గురువారం
31•1•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 8 • సంచిక 216
• పేజీలు : 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

గులాబీ ప్రభంజనం

పంచాయతీ తుదివిడుత ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ జోరు

మూడు విడుతల్లోనూ తిరుగులేని శక్తి

ఓటింగ్‌లో మరోసారి చైతన్యాన్ని చాటిన గ్రామసీమలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రవ్యాప్తంగా 29 జిల్లాల్లో **88.03%** ఓటింగ్ నమోదు

అత్యధికం యాదాద్రి-భువనగిరి **94.99%**

అత్యల్పం జగిత్యాల జిల్లా **77.70%**

ముచ్చటగా మూడోవిడుత పంచాయతీ ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ హవా కొనసాగింది. రాష్ట్ర వ్యాప్తంగా సింహభాగం పల్లెలు గులాబీవర్ణాన్ని పులుముకొన్నాయి. మూడో విడుతలో బుధవారం 3506 పంచాయతీలకు పోలింగ్ నిర్వహించగా, టీఆర్ఎస్ మద్దతుదారులు ఏకగ్రీవాలతో కలిపి 2742 పంచాయతీల్లో విజయబావుటా ఎగురవేశారు. వార్డుల్లోనూ గులాబీ జోరు కొనసాగింది. మొత్తం మూడు విడుతల్లో చూస్తే టీఆర్ఎస్ మద్దతుదారులు 8606 స్థానాల్లో విజయం సాధించారు. మూడో విడుతలో 4,116 పంచాయతీలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ప్రకటించగా.. 576 సర్పంచ్ స్థానాలు, 8956 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. బుధవారం 3,506 పంచాయతీలకు, 36,729 వార్డులకు ఎన్నికలు నిర్వహించారు. మొదటి రెండు విడుతల స్థాయిలోనే మూడో విడుతలోనూ భారీ పోలింగ్ నమోదైంది. మొదటి విడుతలో 85.76%, రెండో విడుతలో 88.26% పోలింగ్ నమోదు కాగా, తుది విడుత ఎన్నికల్లో 88.03% పోలింగ్ నమోదైంది. జిల్లాల వారీగా చూస్తే ఎనిమిది జిల్లాల్లో 90 శాతానికి పైగా, 19 జిల్లాల్లో 80 శాతానికిపైగా పోలింగ్ జరిగింది. మిగిలిన రెండు జిల్లాల్లో కూడా 79.81%, 77.70% ఓటింగ్ నమోదుకావడం గ్రామసీమల్లో ఓటర్ల చైతన్యాన్ని ప్రతిబింబిస్తున్నది. మూడు విడుతల్లో కలిపి 86.67 శాతం పోలింగ్ నమోదు అయినట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. రాష్ట్ర వ్యాప్తంగా తుది విడుత మేడ్చల్ మినహా 29 జిల్లాల్లో 45,23,669 మంది ఓటర్లకుగాను 39,82,043 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 87.38% ఉండగా, మహిళలు 88.67% ఉన్నారు. 196 మంది థర్డ్‌జెండర్ ఓటర్లకుగాను 18 మంది (9.18%) ఓటు హక్కు వినియోగించుకున్నారు. అత్యధికంగా యాదాద్రి-భువనగిరి జిల్లాలో 94.99% ఓటింగ్ నమోదు కాగా, అత్యల్పంగా జగిత్యాల జిల్లాలో 77.70% నమోదైంది. ఇదిలాఉంటే వికారాబాద్ జిల్లా పూడూర్ మండలం తిరుమలాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఏడో వార్డుకు

మిగతా 4వ పేజీలో



నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం పజ్జూరులో టీఆర్ఎస్ మద్దతుదారు సర్పంచ్‌గా గెలుపొందడంతో సంబురాలు జరుపుకొంటున్న కార్యకర్తలు



తుది విడుత ఫలితాలు

మొత్తం పంచాయతీలు : 4082

ఏకగ్రీవాలు: 576

పార్టీ	తుదివిడుత	మొత్తంగా
టీఆర్ఎస్	2742	8606
కాంగ్రెస్	886	2486
బీజేపీ	47	153
సీపీఎం	19	67
సీపీఐ	16	56
టీడీపీ	6	57
ఇతరులు	361	1168

ప్రశాంతంగా ముగిసిన పంచాయతీ ఎన్నికలు

- సత్ఫలితాలిచ్చిన పోలీసు వ్యూహాలు
- రూ.2కోట్ల విలువైన నగదు, మద్యం స్వాధీనం



కరీంనగర్ జిల్లాలో ఓటు హక్కు వినియోగించుకున్న యువతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పోలీసుల ముందస్తు ప్రణాళికలు, పకడ్బందీ వ్యూహాలతో పంచాయతీ ఎన్నికలు మూడు విడుతల్లోనూ ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణను కూడా పోలీసు శాఖ సవాల్‌గా తీసుకుంది. గ్రామాల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ముందస్తుగానే బందోబస్తు ప్రణాళికలు రూపొందించారు. డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి, శాంతిభద్రతల అడిషనల్ డీజీ జితేందర్ నిరంతరం పర్యవేక్షించారు. సున్నితమైన పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించడంతోపాటు మూడు విడుతలకు జిల్లాల పరిధిలోనే సిబ్బందిని సమన్వయం చేసుకునేలా ఐజీలు నాగిరెడ్డి, స్టీఫెన్ రవీంద్రలతోపాటు అన్ని జిల్లాల ఎస్పీలు క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు ఇస్తూ పూర్తి ప్రక్రియను సమన్వయం చేశారు. చిన్నచిన్న సంఘటనలు మినహా ఎక్కడా శాంతిభద్రతల సమస్య రాకుండా చర్యలు తీసుకున్నారు. ఇదిలావుంటే పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఈ నెల 1 నుంచి బుధవారం వరకు జరిపిన తనిఖీల్లో మొత్తం రూ.2కోట్ల మేర నగదు, మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం జిల్లాలో అత్యధికంగా రూ.1.18 కోట్లను సీజ్‌చేశారు. రూ.63,91,222 విలువైన మద్యాన్ని పట్టుకున్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన 572 మందిపై కేసులు నమోదు చేయగా, 260 మందిని అరెస్ట్‌చేశారు.

నేటి నుంచి పార్లమెంట్

- రేపు బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్
- సజావుగా సమావేశాల నిర్వహణకు సహకరించాలన్న స్పీకర్ మహాజన్
- పూర్తి బడ్జెట్ పెడితే వ్యతిరేకిస్తాం: మల్లికార్జున ఖర్గే
- మధ్యంతర బడ్జెట్ ప్రస్తావనే లేదు: కేంద్రమంత్రి విజయ్ గోయల్



లోక్‌సభ ఎన్నికల ముంగిట ప్రజాకర్షక పథకాలతో

మధ్యంతర బడ్జెట్

- వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసే అవకాశం
- సంప్రదాయానికి భిన్నంగా వ్యవహరించనున్న మోదీ సర్కార్

5

సీతారామకు పచ్చజెండా

- తుది అటవీ అనుమతులు మంజూరు
- చెన్నైలోని ప్రాంతీయకార్యాలయం ఉత్తర్వులు
- 1531 హెక్టార్ల అటవీభూమి బదలాయింపు
- పూర్తిస్థాయి పనులకు మార్గం సుగమం

సీతారామ ప్రాజెక్టు అంచనా వ్యయం **7,967 కోట్లు**

6.74 లక్షల ఎకరాలకు సాగునీరు

వందల గ్రామాలకు తాగునీరు

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టు నిర్మాణంలో మరో కీలక అడుగు పడింది. ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్టు పనులకు కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ సమతుల్యతశాఖ తుది అనుమతులు మంజూరుచేసింది. ఈ మేరకు చెన్నైలోని అటవీ, పర్యావరణశాఖ ప్రాంతీయ కార్యాలయం అధికారికంగా ఉత్తర్వులు జారీచేసింది. ఆరునెలల క్రితమే ఈ ప్రాజెక్టుకు తొలిదశ అటవీ అనుమతులు లభించాయి. ఈ ప్రాజెక్టు కింద 1531.0548 హెక్టార్ల అటవీభూమిని బదలాయించడానికి అనుమతినిస్తూ కొన్ని షరతులు

మిగతా 4వ పేజీలో



బుధవారం ఖమ్మంలో చలిగాలులనుంచి రక్షణగా బిడ్డకు కుల్లా కట్టి తీసుకెళ్తున్న ఓ తల్లి

3

ఆగని ఇగం

మరో రెండ్రోజులు గజగజే

సిర్పూర్‌లో అత్యల్పం **3°C**

హైదరాబాద్‌లో 9.3 డిగ్రీలు

- ఒకవైపు ఉత్తరాది, ఈశాన్య గాలులు
- మరోవైపు వెస్టర్న్ డిస్ట్రబెన్సెస్
- పంజా విసురుతున్న చలిపులి
- పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- తెల్లారినా వీడని మంచుతెరలు
- సాయంత్రానికే పెరుగుతున్న చలి
- చలికి వేర్వేరుచోట్ల ఇద్దరు మృతి

102వ రోజు

కంటి వెలుగు

కంటి వెలుగు @ 1.40 కోట్లు

రాష్ట్రంలో విస్తృతంగా వైద్య శిబిరాల నిర్వహణ

ఉత్సాహంగా పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

3

ఎస్సీ, ఎస్టీ చట్టంపై స్టే ఇవ్వలేం

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- 19న సవివరంగా విచారిస్తామని వెల్లడి

5

విమానం సీటు కింద

రెండుకిలోల బంగారం!


శంషాబాద్ ఎయిర్‌పోర్టులో స్వాధీనం

2

పసిడి పరుగులు

రూ.34 వేలు దాటిన తులం ధర

11



నాబార్డు వార్షిక రుణ ప్రణాళిక లక్ష కోట్లు

- రూ.1,01,378 కోట్లతో స్టేట్ ఫోకస్ పేపర్ 2019-20 విడుదల
- గతేడాదితో పోలిస్తే రూ.17,990 కోట్లు అధికం
- పంట రుణాలకు రూ.49,785 కోట్లు
- రైతుల ఆదాయం రెట్టింపు సాధ్యమే: సీఎస్ ఎస్కే జోషి

3



నుమాయిష్‌లో భారీ అగ్నిప్రమాదం

200 స్టాళ్లు ఆహుతి.. కోట్లలో ఆస్తినష్టం.. సకాలంలో స్పందించిన యంత్రాంగం

ప్రాణ నష్టం లేకుండా నియంత్రణ.. మంటలు ఆర్పిన 20కిపైగా ఫైరింజన్లు

8



బుధవారం లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్‌లో పుష్పాంజలి ఘటిస్తున్న మండలి చైర్మన్ స్వామిగౌడ్, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, హోంమంత్రి మహమూద్‌అలీ, ఎంపీ దత్తాత్రేయ, హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్, సీఎస్ ఎస్కే జోషి తదితరులు



అసెంబ్లీ లోని గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మండలి చైర్మన్‌స్వామిగౌడ్, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు తదితరులు

గాంధీజీకి ఘన నివాళులు

- బాపూఘాట్‌లో పుష్పాంజలి ఘటించిన మండలి చైర్మన్, స్పీకర్ హోంమంత్రి తదితరులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని రాష్ట్రప్రభుత్వం ఘనంగా నివాళులర్పించింది. బుధవారం లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్‌లో మండలి చైర్మన్ కే స్వామిగౌడ్, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, హోంమంత్రి మహమూద్‌అలీ సహా పలువురు ప్రముఖులు పుష్పాంజలి ఘటించారు. తొలుత బాపుఘాట్‌కు చేరుకున్న వీరు గాంధీజీ సమాధి వద్ద పుష్పాంజలి ఘటించారు. అక్కడినుంచి ప్రార్థనామందిరంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రార్థనా మందిరంలో కాసేపు గడిపి, సమాచారశాఖ ఆధ్వర్యంలో వివిధ మతాల గురువుల ప్రవచనాలు వినించారు. సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల బృందం సభ్యులు భజన గీతాలు ఆలపించారు. 11 గంటలకు దేశవ్యాప్త నివాళిలో భాగంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్య క్రమంలో ఎంపీ బం డారు దత్తాత్రేయ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, సాధారణ పరిపాలనశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అధర్‌సిన్హా, మేయర్ బొంతు రామ్మోహన్, ఎమ్మెల్సీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వీ శ్రీనివాస్‌గౌడ్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, హైదరాబాద్ జిల్లా ఇంచార్జి కలెక్టర్ జీ రవి, ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ మనోహర్ సహా పలుశాఖల అధికారులు, పాఠశాలల చిన్నారులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో గాంధీ విగ్రహానికి నివాళులు

అసెంబ్లీలోని గాంధీ విగ్రహానికి శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం పూలమాల వేసి నివాళులు అర్పించారు. గాంధీ దేశానికి చేసిన సేవలను గుర్తుచేశారు. వీరితో పాటు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు తదితరులు నివాళులు అర్పించినవారిలో ఉన్నారు.



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రెండుకిలోల బంగారం స్వాధీనం

బండ్లగూడ: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో డీఆర్‌ఐ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టి రెండు కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దుబాయ్ నుంచి ఎయిర్ ఇండియా విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన వ్యక్తి డీఆర్‌ఐ అధికారులు తనిఖీ చేస్తున్నారని తెలుసుకుని విమానం సీటు కింద రూ.60 లక్షల విలువైన రెండు కిలోల బంగారాన్ని వదిలివెళ్లినట్టు అధికారులు తెలిపారు.

వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ

- 1 నుంచి దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఒడిశాలోని సెంచూరియన్ యూనివర్సిటీలో నిర్వహించే నైపుణ్యాభివృద్ధి శిక్షణకు వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో తెలంగాణ నుంచి 100 మంది మైనార్టీ యువతకు అవకాశం ఉందని వక్ఫ్‌బోర్డు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మీర్ మునావర్ అలీ బుధవారం తెలిపారు. శిక్షణకు ఎంపికైనవారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తారని, ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని మైనార్టీ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పడిపోతున్న మోదీ గ్రాఫ్

కేంద్రంలో ప్రాంతీయ పార్టీలదే హవా

- ఫెడరల్ ఫ్రంట్ ఎజెండా పీపుల్స్ ఎజెండా
- ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.25 కోట్లకు పెంచాలి
- చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలి
- నాలుగు లక్ష్యాలతో ఎంపీగా బరిలో..
- ట్విట్టర్ 'ఆస్క్ ఎంపీ కవిత' కార్యక్రమంలో ఎంపీ కవిత



బుధవారం 'ఆస్క్ ఎంపీ కవిత' కార్యక్రమంలో మాట్లాడుతున్న నిజామాబాద్ ఎంపీ కవిత

నిజామాబాద్/నమస్తే తెలంగాణ ప్రతినిధి: 'కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ గ్రాఫ్ రోజురోజుకూ పడిపోతున్నది.. రాహుల్‌గాంధీ గ్రాఫ్ పైకి రావడం లేదు.. దేశంలో ప్రాంతీయ పార్టీలు బలపడుతున్నాయి.. 2019 తర్వాత ఆ పార్టీలదే హవా ఉంటుంది. ఫెడరల్ ఫ్రంట్‌కు పిలుపునిచ్చిన సీఎం కేసీఆర్ తెలంగాణలో మార్పు తెచ్చినట్టుగానే దేశవ్యాప్త మార్పుకోసం ముందుకుసాగుతున్నారు. ఫెడరల్ ఫ్రంట్ ఎజెండా పీపుల్స్ ఎజెండా' అని ఎంపీ కవిత అన్నారు. నిజామాబాద్‌లో బుధవారం ట్విట్టర్ సంస్థ నిర్వహించిన 'ఆస్క్ ఎంపీ కవిత' కార్యక్రమంలో ఆమె దేశవ్యాప్తంగా వివిధవర్గాల నుంచి వచ్చిన ట్వీట్లకు సమాధానాలు ఇచ్చారు. ప్రత్యక్షంగా హాజరైన యువత, విద్యార్థులు, మహిళలు పలు ప్రశ్నలు అడిగారు. ఎంపీ కవిత సమాధానాలు ఆమె మాటల్లోనే..

రాజకీయాల్లో ప్రియాంకది అతిథి పాత్ర. తల్లి కోసం, అన్న కోసం గెస్ట్‌రోల్‌గా వచ్చి తిరిగి వెళ్లిపోతుంది. కాంగ్రెస్‌కు 70 ఏండ్లు అధికారమిచ్చినా ఏమీ చేయలేదు. ప్రస్తుతం ఇస్తున్న రూ.5 కోట్ల ఎంపీ లాడ్స్ నిధులు ఏమాత్రం సరిపోవడం లేదు.. కనీసం రూ. 25 కోట్లకు పెంచాలి. మహిళలు రాజకీయాల్లోకి రావాలన్నా, పరిపాలనలో భాగస్వాములు కావాలన్నా 33శాతం రిజర్వేషన్ రావాల్సిందే. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడంతో పాటు.. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయకు నీతి ఆయోగ్ సూచించిన విధంగా రూ. 24 వేల కోట్లు కేంద్ర బడ్జెట్‌లో ఇవ్వాలి. రాష్ట్రానికి ఏం కావాలో, అభివృద్ధి ఎలా జరుగుతుందో తెలిసిన ఏకైకవ్యక్తి కేసీఆర్. 29 శాతం అభివృద్ధి సాధించి తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచింది. నాలుగున్నరేండ్లు కష్టపడితే ఇది సాధ్యమైంది. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల పాత్ర అందరికీ తెలిసిందే. వారిని రాజకీయాల వైపు ప్రోత్సహించడంలో టీఆర్‌ఎస్ ఎప్పుడూ ముందుంటుంది. గల్ఫ్ మోసాలను అరికట్టేందుకు జాతీయస్థాయిలో చట్టం తీసుకురావాలని విదేశాంగమంత్రిని కలిసి విన్నవించాం. ఈరోజే ఇరాక్ నుంచి పద్నాలుగుమంది బాధితులను ఇండ్ల కు చేర్చాం. గల్ఫ్‌లో ఉపాధికి సంబంధించి 'టాంకామ్' సేవలను సద్వినియోగం చేసుకోవాలి. తెలంగాణలో లక్షలాది మంది బీడీ కార్మికులు జీవనభృతి అందిస్తున్నాం. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పి ఇంటివద్దే పని కల్పించే కృషి జరుగుతున్నది.

జగన్‌ను కేటీఆర్ కలిస్తే బాబుకేం ఇబ్బంది

జగన్‌ను కేటీఆర్ కలిస్తే చంద్రబాబుకు వచ్చే ఇబ్బంది ఏమిటో అర్థం కావడం లేదు. చంద్రబాబు ఎవరిని కలిసినా మాకు అవసరం లేదు. కేటీఆర్ జగన్‌ను కలిసిన విషయం కూడా ఆయనకు అనవసరం. 'మీ టూ' ఉద్యమం బాధితుల్లో ఎంతో ధైర్యాన్ని నింపింది. మహిళల భద్రత, సంరక్షణకు తెలంగాణలో మంచి కార్యక్రమాలు అమలవుతున్నాయి. పంట పెట్టుబడి సాయం, రైతుబీమా తదితర పథకాలు అనేక రాష్ట్రాలను ఆకర్షించాయి.

రాజకీయాల్లో రిటైర్మెంట్ లేదు..

చిన్నప్పుడు నర్సులు, వారి డ్రెసింగ్, సేవలు చూసి నర్సును కావాలని అనుకునేదాన్ని. తర్వాత వ్యాపారంలో రాణించే మహిళగా ఎదుగాలనుకున్నా. అనంతరం చదువులు, అమెరికా.. అక్కడ వ్యాపారం నిర్వహించా. తెలంగాణ ఉద్యమం ప్రారంభం కావడంతో ఉద్యమంలోకి అడుగుపెట్టా. ఉద్యమం రాజకీయాల్లో అడుగుపెట్టేలా చేసింది. ఇందులో మాత్రం నాకు రిటైర్‌మెంట్ లేదు. నాలుగున్నరేండ్లలో ఎంపీగా పెట్టుకున్న లక్ష్యాల్లో పసుపు బోర్డు మినహా మిగిలిన లక్ష్యాలను సాధించా. ఈసారి మరో నాలుగు లక్ష్యాలు నిర్దేశించుకున్నా. పసుపు బోర్డును సాధించి తీరడం, ఇండ్లులేని వారికి సొంతింటి కల సాకారం చేయడం, ఐటీ రంగంలో ఉద్యోగాలను కల్పించడం, జిల్లాను బెస్ట్ ఇండస్ట్రీస్ జిల్లాగా మార్చడం లక్ష్యాలుగా పెట్టుకున్నాను.

పనితీరును ప్రజలే నిర్ణయిస్తారు..

కేసీఆర్ కుటుంబసభ్యులు ఉద్యమం నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. వారి పనితీరును ఎన్నికల్లో ప్రజలే ఇస్తారు. అన్నగా కేటీఆర్‌కు పదికి పది మార్కులిస్తా. పొలిటికల్ లీడర్‌గా అయితే ప్రజలే చెప్తూ ఉన్నారు.

రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కేంద్రంపై ఒత్తిడి

- బైసన్ పోలోపై ప్రధానిని కలుస్తాం
- ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పార్లమెంట్ సమావేశాల ప్రారంభం రోజున ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలిసి రాష్ట్రంలోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతామని కరీంనగర్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ తెలిపారు. బైసన్ పోలో గ్రౌండ్‌ను రాష్ట్రానికి కేటాయించాలని విన్నవిస్తామన్నారు. గురువారం నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. శుక్రవారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పెండింగ్ సమస్యలపై కేంద్రాన్ని నిలదీయాలని సీఎం కేసీఆర్ ఇటీవలే టీఆర్‌ఎస్ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, మంజూరు, పెండింగ్ సమస్యలపై పోరాడాలని సూచించారు. ఐదేండ్లలో కేంద్రం నుంచి రాష్ట్రానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదని, రాష్ట్ర అసెంబ్లీలో చేసిన తీర్మానాలను కూడా పట్టించుకోలేదని, విభజన చట్టం హామీలను కూడా నెరవేర్చలేదని, వాటన్నంటినీ అమలుచేయడానికి కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఎంపీ వినోద్‌కుమార్ బుధవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కొత్త సచివాలయం కట్టుకోవడానికి భూమిని కేటాయించాలని, ఆ స్థలానికి బదులుగా మరో ప్రాంతంలో స్థలం కేటాయించడానికి రాష్ట్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తంచేసిందని గుర్తుచేశారు. ఈ సమస్యపై అనేకమార్లు ప్రధాని సహా రక్షణశాఖ మంత్రులు అరుణ్‌జైట్లీ, మనోహర్ పారికర్, నిర్మలా సీతారామన్‌లను కోరామన్నారు. సీఎం కేసీఆర్ సైతం గతంలో ప్రధానిని కలిసి దీనిపై వినతి పత్రం సమర్పించారని గుర్తుచేశారు. అయినా కేంద్రం నుంచి ఇంతవరకు స్పందనలేదని చెప్పారు. ఇన్నాళ్లు అడ్డంకిగా ఉన్న హైకోర్టు కేసు కూడా తొలిగిపోయిందని, భూమి కేటాయించడానికి ఎలాంటి ఆటంకాలు లేవన్నారు. కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలని ప్రధానిని కోరుతామన్నారు. రాష్ట్రానికి ఐఐఎం, ట్రిపుల్‌ఐటీ, ఐఎస్‌ఈపీఆర్ వంటి సంస్థలను మంజూరుచేయాలని మరోసారి కోరుతామన్నారు. రాష్ట్రానికి జాతీయ రహదారులను మంజూరుచేస్తూ నిర్ణయం తీసుకున్నా గెజిట్ విడుదలలో ఆలస్యం అవుతున్నదని, ఈ విషయంలో కేంద్రంపై ఒత్తిడి తెస్తామన్నారు. రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై టీఆర్‌ఎస్ ఎంపీలందరం కలిసి అన్ని మార్గాల్లో కేంద్రంపై ఒత్తిడి తెస్తామని వినోద్ వివరించారు.

ముహూర్తం

సూర్యోదయం: 6.52 గంటలకు

సూర్యాస్తమయం: 6.07 గంటలకు

విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, కృష్ణపక్షం, ఏకాదశి సాయంత్రం 5.04 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం: జ్యేష్ఠ సాయంత్రం 6.41 వరకు, తదుపరి మూల, అమృతఘడియలు: ఉదయం 9.09 నుంచి 10.45 వరకు, రాహుకాలం మధ్యాహ్నం 1.54 నుంచి 3.18 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.07 నుంచి సాయంత్రం 4.37 వరకు, వర్జ్యం: లేదు.

అరచేతిలో ఓటరు వివరాలు

- అందుబాటులోకి 'నా ఓటు' యాప్
- సమాజంలో రేడియోకు ప్రాధాన్యం
- పట్టణాల్లో పోలింగ్ శాతం పెంపునకు రంగాలవారీగా అవగాహన
- రేడియో జాకీలకు అవగాహన సదస్సులో సీఈవో రజత్‌కుమార్



మాట్లాడుతున్న సీఈవో రజత్‌కుమార్. చిత్రంలో అదనపు కమిషనర్ అమ్రపాలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఓటు వివరాలు తెలుసుకొనేందుకు 'నా ఓటు' యాప్‌ను అందుబాటులోకి తెచ్చామని, దీని ద్వారా తమ వివరాలు సంపూర్ణంగా తెలుసుకొనే వీలుంటుందని సీఈవో రజత్‌కుమార్ చెప్పారు. ఓటర్ల సమస్యల పరిష్కారానికి నా ఓటు అనే యాప్‌ను అందుబాటులోకి తెచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. బుధవారం హరిత ప్లాజాలో ఎన్నికల విభాగం ఆధ్వర్యంలో ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, ఎన్నికల నిర్వహణపై రేడియో జాకీలకు ఒకరోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో రజత్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో రేడియోకు ఎంతో ప్రాధాన్యం ఉన్నదని, గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్‌శాతం ఎక్కువగా నమోదవుతున్నదని, పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ నమోదును పెంచేందుకు ఆయా రంగాలవారీగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగానే ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు విలువ, ప్రాధాన్యం వివరించేందుకు రేడియో జాకీలకు శిక్షణ ఇస్తున్నట్టు వివరించారు. ఎన్నికల నియమావళికి లోబడి ఓటు డిలీషన్ (తొలిగింపు) ఉంటుందని చెప్పారు. ఓటు తొలిగించే ముందు నోటీసు ఇవ్వటమే కాకుండా కేంద్ర ఎన్నికల కమిషన్‌కు కూడా సమాచారం అందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఓట్ల తొలిగింపు ప్రక్రియ చాలా విమర్శలకు దారితీసిందన్నారు. జనాభా కన్నా ఎక్కువ ఓటర్లున్న దగ్గర నియమావళి ప్రకారం గుర్తించి తొలిగించినట్టు పేర్కొన్నారు. సరైన విధానంలోనే 99 శాతం ఓట్లను తొలిగించినట్టు తెలిపారు. కొత్తగా 26 లక్షల మంది ఓటుహక్కు నమోదుచేసుకున్నారని, జాబితాలో తమ పేరు ఉందా, లేదా అనే వివరాలను పరిశీలించుకోలేదని అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటుకోసం దరఖాస్తుచేసుకున్నాక, తిరిగి పరిశీలించుకోవాలని సూచించారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో కొందరు ఓటరుగా పేర్లు నమోదుచేశారని తెలిపారు. దీనిపై జిల్లా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశామని, ఇందుకు బాధ్యులైన డాటా ఎంట్రీ ఆపరేటర్లపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన వెల్లడించారు.

ఐపీ అడ్రస్‌లే కీలకం!

- ఓటర్ లిస్టులో ఎన్నికల అధికారుల పేర్ల కేసులో దర్యాప్తు వేగిరం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఓటర్ లిస్ట్‌లో ఎన్నికల అధికారుల పేర్లు నమోదైన కేసును ఛేదించేందుకు పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఇందుకు ఐపీ (ఇంటర్‌నెట్ ప్రొటోకాల్) అడ్రస్‌లు కీలకం కానున్నాయి. కేంద్ర మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఓపీ రావత్, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ పేర్లను గుర్తుతెలియని వ్యక్తులు ఓటర్ ఐడీ కోసం దరఖాస్తు చేయగా, వారి పేర్లు ఓటరు జాబితాలో చేరాయి. లిస్ట్‌లోకి వీరు పేర్లు ఎలా వచ్చాయో తేల్చాలని, నిందితులపై చర్యలు తీసుకోవాలని నాంపల్లి నియోజకవర్గ ఎన్నికల అధికారి మహ్మద్‌ఖాజా ఇంకెసాఫ్ అలీ ఫిర్యాదుతో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఇద్దరు అధికారుల పేర్లపై దరఖాస్తు ఫారాలు ఆన్‌లైన్‌లోనే జీహెచ్‌ఎంసీ ఎన్నికల విభాగానికి వెళ్లాయి. గుర్తుతెలియని వ్యక్తులు కరెంటు బిల్లు, ఆధార్‌కార్డులను దరఖాస్తుకు అనుబంధంగా అప్‌లోడ్ చేశారు. అది నకిలీ ఆధార్‌కార్డు అయి ఉండే అవకాశాలున్నాయని పోలీసులు భావిస్తున్నారు. దరఖాస్తుతోపాటు జతచేసిన ఆధార్ నంబర్ల వివరాలను కోరుతూ సంబంధిత శాఖకు లేఖ రాశారు. మరోపక్క ఆన్‌లైన్‌లో ఎక్కడినుంచి దరఖాస్తు చేశారు, సంబంధిత ఐపీ నంబర్‌ను గుర్తించే పనిలో ఉన్నారు. ఐపీ చిరునామా తెలిస్తే ఎవరు అప్‌లోడ్ చేశారు, దరఖాస్తు చేయడంలో వారి ఆంతర్యమేమిటనే విషయాలపై స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.

బోగస్ ఓటరుకార్డులపై సీఎస్ సీరియస్

- సహకరించిన అధికారులపై సస్పెండ్ చేయండి: సీఎస్ జోషి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎన్నికల అధికారుల పేర్లతో బోగస్ ఓటరు కార్డులు సృష్టించడంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి సీరియస్ అయ్యారు. ఇందుకు సహకరించిన అధికారులను సస్పెండ్‌చేసి, అవసరమైతే క్రిమినల్ కేసులో నమోదు చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ దానకిశోర్‌ను ఆదేశించినట్టు తెలిసింది. ఈ అంశంపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ దానకిశోర్‌లతో బుధవారం సచివాలయంలో సీఎస్ జోషి సమీక్ష నిర్వహించారు. అప్పటికే ఈ అంశంపై దానకిశోర్ ప్రాథమిక విచారణ జరిపి నివేదికను సీఎస్‌కు అందజేసినట్టు తెలిసింది.

పంపకాల్లో నిక్కచ్చిగా ఉండండి

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం ఆస్తులు, సంస్థల పంపకాల్లో నిక్కచ్చిగా వ్యవహరించాలని సీఎస్ ఎస్కే జోషి అన్నిశాఖల అధికారులను ఆదేశించారు. విభజనకు సంబంధించి భూములు, ఉన్నత విద్యామండలి విభజన వంటి కోర్టుల్లో ఉన్న కీలకమైన అంశాలపై ఆయా శాఖలు అఫిడవిట్‌లు దాఖలుచేయడం లేదని సీఎస్ దృష్టికి వెళ్లింది. ఈ నేపథ్యంలో కోర్టుల్లో ఉన్న అంశాలపై తక్షణమే అఫిడవిట్‌లు దాఖలు చేయాలని సీఎస్ ఆదేశించినట్టు తెలిసింది.

సార్వత్రిక ఎన్నికల కోసమే ప్రతిపక్షాల రైతు జపం

- దేశ రైతాంగానికి దిక్సూచిలా తెలంగాణ సీఎం కేసీఆర్
- రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్, నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో దేశవ్యాప్తంగా జాతీయ, ప్రాంతీయ పార్టీలన్నీ రైతన్న సమస్యలు, వ్యవసాయాన్ని తెరపైకి తీసుకొస్తున్నాయని రైతు సమన్వయ సమితి రాష్ట్ర చైర్మన్, నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి విమర్శించారు. రైతుల ప్రస్తుత దుస్థితికి కాంగ్రెస్, బీజేపీ విధానాలే కారణమన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. దక్షిణ భారత కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ సదస్సులో కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై గుత్తా ఘాటుగా స్పందించారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానం చేయాలని ఎన్నో ఏండ్లుగా కోరడమే కాకుండా.. శాసనసభలో తీర్మానం కూడా చేశామన్నారు. 2009-14 మధ్య కాలంలో దీనిపై అప్పటి ఆర్థికమంత్రి చిదంబరానికి లేఖ రాయగా.. అప్పటి గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి జయరాంరమేష్ అధ్యక్షతన కమిటీ వేసి అనుసంధానం కుదరదని తేల్చారని చెప్పారు. స్వతహాగా రైతు అయిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు.. వివిధ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి దేశ రైతాంగానికి దిక్సూచిలా మారారని పేర్కొన్నారు. నాలుగున్నరేండ్లలో రైతులు పండించిన పంటను పూర్తిస్థాయిలో గిట్టుబాటు ధరతో కొనుగోలుచేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. గత వానకాలం సీజన్‌లో రూ.8,129 కోట్ల విలువైన వరి, మక్కజొన్న, మినుములు, పెసర్లు, సోయాబీన్, కందులు కొనుగోలు చేశామని, సీసీఐ ద్వారా రూ.616.64 కోట్ల విలువైన 14,27,702 టన్నుల పత్తిని కొనుగోలు చేసినట్టు పేర్కొన్నారు. మరణించిన 6,680 మంది రైతుల వివరాలు నమోదుచేసి.. 6,424 మంది రైతు కుటుంబాలకు రూ.323 కోట్ల పరిహారం చెల్లించినట్టు వివరించారు. ఇక్కడి రైతుబంధు, రైతుబీమా పథకాలను వివిధ రాష్ట్రాలు అమలుచేసేందుకు ప్రయత్నిస్తున్నాయని గుత్తా చెప్పారు.

లోకం పోకడ



ప్రశ్నపత్రాలిస్తారేం సార్? పులిహోర, గారెలు, సున్నుండలు వడ్డిస్తారనుకొని వచ్చాం!

సమరయోధుడు, మాజీమంత్రి కేవీ కేశవులు హఠాన్మరణం



కేవీ కేశవులు (ఫైల్)

అమీర్‌పేట్, నమస్తే తెలంగాణ: స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీమంత్రి కేవీ కేశవులు (96) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. అమీర్‌పేట్ డీకే రోడ్డులోని తన నివాసంలో సాయంత్రం 6 గంటల వరకు ఉల్లాసంగా గడిపిన ఆయన ఒక్కసారిగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిపడ్డారు. కుటుంబసభ్యులు వెంటనే దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కేశవులు మృతిపట్ల ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కేశవులు నిస్వార్థంగా పేదలకు సేవలు అందించారని అన్నారు. 1924 జనవరి 14న కరీంనగర్ జిల్లా ధర్మపురిలో జన్మించిన కేవీ కేశవులు సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి రెండుస్లారు ఎమ్మెల్యేగా గెలుపొందారు. జలగం వెంగళరావు మంత్రివర్గంలో చేనేత జౌళిశాఖ మంత్రిగా పనిచేశారు. జాతీయ స్థాయిలో, రాష్ట్రస్థాయిలో అనేక పదవులు నిర్వహించారు. గురువారం కరీంనగర్ జిల్లా ధర్మపురిలో ఆయనకు అంత్యక్రియలు నిర్వహిస్తారు. బడుగు, బలహీనవర్గాల కోసం మాజీ మంత్రి కేవీ కేశవులు ఎంతో కృషిచేశారని మాజీ ఎంపీ రాపోలు ఆనంద్‌భాస్కర్, బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు అన్నారు. కేవీ కేశవులు మరణించడం చాలా బాధాకరమని తీవ్ర సంతాపం తెలిపారు.

బడ్జెట్.. రెండు లక్షల కోట్ల పైనే!

- మధ్యంతర బడ్జెట్‌కు భారీ రూపం
- శాఖలవారీగా ప్రతిపాదనలు సిద్ధంచేసిన అధికారులు
- ఆరు నెలల ద్రవ్యవినిమయానికి అనుమతి కోసం చట్టసభల ముందుకు

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న మధ్యంతర బడ్జెట్ రూ.రెండు లక్షల కోట్లు దాటొచ్చని అంచనా. నాలుగేండ్లుగా రాష్ట్ర సొంత రాబడులు, పన్నేతర ఆదాయం బాగా పెరుగుతుండటంతో ఏటా బడ్జెట్‌ను పెంచుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రాబడిలో 19 శాతం వృద్ధిరేటు నమోదైంది. దీంతో బడ్జెట్ రూ.2 లక్షల కోట్లు దాటుతుందని అంచనా వేస్తున్నారు. ఫిబ్రవరి రెండు లేదా మూడోవారంలో బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. 2019-20 ఆర్థిక సంవత్సరానికిగాను ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను చట్టసభల్లో ప్రవేశపెట్టడానికి రాష్ట్ర ఆర్థికశాఖ అధికారులు చకచక ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌ను చూసి, దానికి అనుగుణంగా రాష్ట్ర మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని సీఎం కేసీఆర్ ఇటీవలి సమీక్షలో ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆర్థికశాఖ అధికారులు శాఖలవారీగా బడ్జెట్‌పై కసరత్తును వేగవంతం చేశారు. పేరుకు తాత్కాలిక బడ్జెటే అయినా పూర్తిస్థాయిలో అన్ని వివరాలతో తుదిరూపం ఇస్తున్నారు.

నాలుగేండ్లుగా పెరుగుతున్న బడ్జెట్

నాలుగేండ్లుగా ఏటా సొంత రాబడి కనీసం 19 శాతం చొప్పున పెరుగుతున్నది. 2017-18లో రాబడి వృద్ధిరేటు 17శాతం దాటింది. అంతకుముందు ఏడాది రూ.1.5 లక్షల కోట్లుగా ఉన్న బడ్జెట్‌ను 2018-19లో రూ.1.74 లక్షల కోట్లకు పెంచారు. ఈసారి రాబడి వృద్ధిరేటు 19శాతం దాటడంతో బడ్జెట్ రూ.2 లక్షల కోట్లు దాటొచ్చని అధికారులు చెప్తున్నారు. రెవెన్యూ రాబడులు, ఖర్చులు, క్యాపిటల్ రాబడులు, క్యాపిటల్ ఖర్చులు, ఆస్తులు, అప్పులు ఇలా మొత్తం రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రం ఉంటుందని సమాచారం.

ఆరు నెలలకు ఓట్ ఆన్ అకౌంట్

కేంద్రం ఫిబ్రవరి 1న ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్నది. మార్చి మొదటివారంలో లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నది. ఈ మధ్య కాలంలోనే రాష్ట్రంలో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టేలా ఆర్థికశాఖ అధికారులు రంగం సిద్ధం చేశారు. 2019-20 ఆర్థిక సంవత్సరానికి సరిపోయేలా దాదాపు పూర్తిస్థాయిలో బడ్జెట్‌ను రూపొందించినా .. ఆరు నెలల కాలానికే అనుమతి తీసుకోనున్నారు. శాసనసభ, శాసనమండలిలో ప్రవేశపెట్టనున్నారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు మూడు నుంచి నాలుగు రోజులపాటు ఉండొచ్చని అధికారులు చెప్తున్నారు. తాత్కాలిక బడ్జెట్‌పై సాధారణ చర్చ ఉంటుందే తప్ప ప్రతీ పద్దుపై చర్చలు ఉండవని స్పష్టంచేశారు. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాత మూడు నెలల్లో పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశమున్నా ముందు జాగ్రత్తగా ఆరునెలల వరకు అనుమతి తీసుకోనున్నట్టు తెలిపారు.



పౌరసరఫరాల భవన్‌లో పర్యటిస్తున్న జస్టిస్ ఆర్కే అగర్వాల్. చిత్రంలో వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి అకున్ సబర్వాల్

కన్జ్యూమర్ హక్కుల పరిరక్షణ భేష్

- ఎన్సీడీఆర్సీ చైర్మన్ జస్టిస్ ఆర్కే అగర్వాల్ ప్రశంస

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ బాగుందని, ఇందుకు తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాల విభాగం చేస్తున్న కృషి ప్రశంసనీయమని నేషనల్ కన్జ్యూమర్ డిస్ప్యూట్స్ రిడ్రెసల్ కమిషన్ (ఎన్సీడీఆర్సీ) చైర్మన్ జస్టిస్ ఆర్కే అగర్వాల్ అన్నారు. వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారంలో చూపుతున్న చొరవను ఆయన అభినందించారు. ఈ నెల 28 నుంచి హైదరాబాద్‌లో విచారణ జరుపుతున్న ఎన్సీడీఆర్సీ చైర్మన్ ఆర్కే అగర్వాల్, సభ్యురాలు ఎం శిరీష బుధవారం పౌరసరఫరాల భవన్‌లోని వినియోగదారుల సలహా కేంద్రం, కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. ఈ-పాస్, ఐరిస్ ద్వారా రేషన్ సరుకులు తీసుకొనే విధానాన్ని పరిశీలించారు. వినియోగదారుల ఫిర్యాదులు, వాటి పరిష్కారానికి సలహా కేంద్రం తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. రోజుకు ఎన్ని ఫిర్యాదులు వస్తున్నాయి, ఎలాంటివి ఎక్కువ వస్తున్నాయనే అంశాలపై ఆరా తీశారు. వినియోగదారుల సలహా కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న నాగలక్ష్మితోపాటు కాల్‌సెంటర్‌లోని ఉద్యోగినులను అభినందించారు. వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి అకున్ సబర్వాల్ మాట్లాడుతూ.. 2018లో తెలంగాణ వినియోగదారుల సలహా కేంద్రంలోని హెల్ప్‌లైన్‌కు 18 వేల కాల్స్ రాగా, వాటిని పరిశీలించి 444 ఫిర్యాదులను నమోదు చేశామని, అందులో 396 కేసులను పరిష్కరించామని చైర్మన్‌కు తెలిపారు. ఉచితంగా కేసులను పరిష్కరించడమే కాకుండా కొంతమంది బాధితులకు రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకు నష్టపరిహారం ఇప్పించామని చెప్పారు. ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 180042500333, కన్జ్యూమర్ ఇన్ఫర్మేషన్ రిడ్రెసల్ సెంటర్ పేరుతో ఫేస్‌బుక్, తెలంగాణ కన్జ్యూమర్ ఇన్ఫో అండ్ రిడ్రెసల్ సెంటర్ పేరుతో ట్విట్టర్ ఖాతాను, www.consumeradvice.in పేరుతో వెబ్‌సైట్లను ఏర్పాటు చేశామని అకున్ సబర్వాల్ వివరించారు.



జలసౌధలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన శిక్షణ అధికారులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పథకాలు, ప్రాజెక్టులను వివరిస్తున్న రాష్ట్ర ఇంజినీర్లు

తెలంగాణ పథకాలు అద్భుతం

- శిక్షణకు వచ్చిన సివిల్ సర్వీసెస్ అధికారుల ప్రశంస
- అధ్యయనంపై రాజస్థాన్ అధికారుల ఆసక్తి
- కాళేశ్వరం, మిషన్ కాకతీయ, భగీరథపై ప్రజంటేషన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ కార్యక్రమాలు అద్భుతంగా ఉన్నాయని అఖిల భారత సివిల్ సర్వీసెస్ అధికారులు ప్రశంసించారు. ప్రభుత్వం ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నదన్నారు. శిక్షణ నిమిత్తం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన అధికారులకు ఎంసీహెచ్చార్డీలో 'సుస్థిర అభివృద్ధికి కచ్చితమైన పథకాల అమలు, పర్యవేక్షణ' అంశంపై ఐదురోజుల శిక్షణ ఇస్తున్నారు. ఇందులోభాగంగా బుధవారం జలసౌధలో కాళేశ్వరం, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథపై పవర్‌పాయింట్‌ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్యాలు, సాంకేతిక వివరాలను ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ హరిరాం, మిషన్ కాకతీయపై మైనర్ ఇరిగేషన్‌శాఖ చీఫ్ ఇంజినీర్ శ్యాంసుందర్, మిషన్ భగీరథపై రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ జగన్ మోహన్ ప్రజెంటేషన్ ఇచ్చారు.రాజస్థాన్ ఐఏఎస్ అధికారి రాజేశ్‌శర్మ తెలంగాణ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రశంసించారు. వీటిపై అధ్యయనంచేసి నివేదిక సమర్పించేందుకు తమ అధికారులను పంపుతామన్నారు. కార్యక్రమంలో నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, సీఎంవో ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే, కాళేశ్వరం ఎస్‌ఈ సుధాకర్‌రెడ్డి, రాజస్థాన్ నుంచి రాజేశ్ శర్మ, పశుసంవర్ధకశాఖ కమిషనర్ కాంతిలాల్ ఉమాప్, కేంద్ర హోంమంత్రిత్వశాఖ తరపున మురళీధర్, కేంద్ర ఆర్థికశాఖ తరపున కుసుమ్ పద్మనాభన్, సుధార రాజగోపాలన్, తెలంగాణ తరపున సీసీఎఫ్ శివాని డోగ్రా, తెలంగాణ అటవీ అకాడమి నుంచి డిప్యూటీ డైరెక్టర్ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

మరో రెండ్రోజులు గజగజే

- ఓవైపు ఉత్తరాది, ఈశాన్య గాలులు
- మరోవైపు వెస్టర్న్ డిస్ట్రబెన్సెస్
- సాయంత్రానికే పెరుగుతున్న చలి
- తెల్లారినా వీడని మంచుతెరలు
- అత్యల్పంగా సిర్పూర్‌లో 3 డిగ్రీలు
- రాజధానిలో 9.3 డిగ్రీలుగా నమోదు
- చలికి వేర్వేరుచోట్ల ఇద్దరు మృతి



ఆదిలాబాద్ పట్టణంలోని గాంధీపార్కు వద్ద ఉదయం 8 గంటలకు పొగమంచు కారణంగా లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనదారులు



కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు చూపుతున్న పట్టిక

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ/నెట్‌వర్క్: రాష్ట్రంలో చలిపులి పంజా విసురుతున్నది. ఒకవైపు ఉత్తరం, ఈశాన్యం నుంచి వీస్తున్న చలిగాలులు, మరోవైపు వెస్ట్రన్ డిస్ట్రబెన్స్ వల్ల రాష్ట్రవ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతున్నాయి. ఫలితంగా చలిగాలులు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. మరో రెండ్రోజుల పాటు చలి తీవ్రంగా ఉంటుందని వాతావరణ కేంద్రం అధికారులు చెప్తున్నారు. శీతాకాలం ముగుస్తున్న క్రమంలో అసాధారణంగా చలి తీవ్రత పెరుగడంతో రాత్రి వేళల్లో ఇండ్లనుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు జంకుతున్నారు. ప్రత్యేకించి గత రెండ్రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా అనేక గ్రామాల్లో సాయంత్రానికే వీధులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. అటవీప్రాంతాలు అధికంగా ఉన్న జిల్లాలు ఊటీ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిస్థితి మరీ తీవ్రంగా ఉన్నది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ యూలో కనిష్ఠ ఉష్ణోగ్రత 3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఆదిలాబాద్‌లోని పొచ్చెర వద్ద 3.4 డిగ్రీలు, అర్లీ టీ వద్ద 3.6 డిగ్రీలు, నేరడిగొండ వద్ద 3.9 డిగ్రీల సెల్సియల్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీనికి చలిగాలులు తోడవడంతో వణికిపోతున్న ప్రజలు.. చలితీవ్రతనుంచి రక్షణకు అనేక ప్రాంతాల్లో చలిమంటలు వేసుకొని ఉపశమనం పొందుతున్నారు. ఇటు హైదరాబాద్‌లోనూ చలి తీవ్రత కొనసాగుతున్నది. బుధవారం రాత్రి సాధారణస్థాయికంటే 7.7 డిగ్రీలు పడిపోయి.. 9.3 డిగ్రీలుగా రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలిగాలులతోపాటు ఉదయం ఏడుగంటల వరకు మంచు దుప్పటి నగరాన్ని కప్పేస్తున్నది. చలి తీవ్రత పెరుగడానికి వెస్టర్న్ డిస్టబెన్స్, ఉత్తరాది, ఈశాన్య ప్రాంతం నుంచి వీస్తున్న చలిగాలులు కారణమని అధికారులు చెప్తున్నారు. గత కొన్నిరోజులుగా జమ్ముకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్‌లో మైనస్ 3 నుంచి మైనస్ 4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదవుతున్నది. దట్టంగా మంచు కురుస్తున్నది. వాటి ప్రభావం తెలంగాణపై ఉన్నదని అధికారులు తెలిపారు. గురువారం ఉదయం నుంచి మరో 24 గంటలపాటు చలి గాలుల తీవ్రత పెరుగవచ్చని వారు అంచనా వేశారు. శుక్రవారం నుంచి క్రమంగా ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి చేరుకుంటాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి నాగరత్న తెలిపారు.

ఆర్కిటిక్ శీతలగాలులే కారణం

చలి తీవ్రత విపరీతంగా పెరుగడానికి ఉత్తర ధ్రువంలోని ఆర్కిటిక్ ప్రాంతం నుంచి వీస్తున్న శీతల గాలులే (పోలార్ వొర్టెక్స్) కారణమని ఐఎండీ లాంగ్ రేంజ్ ఫోర్‌కాస్టింగ్ విభాగాధిపతి డీ శివానంద తెలిపారు. ఈ గాలులు దక్షిణ దిశగా సాగి యూరప్, అమెరికా మీదుగా భారత్‌లోకి ప్రవేశిస్తున్నాయని, దీంతో ఉత్తరాదితోపాటు దక్షిణాదిలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా క్షీణించాయని చెప్పారు. రాజస్థాన్‌లోని చురులో మంగళవారం మైనస్ 11 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు వెల్లడించారు.

వణుకుతున్న గ్రేటర్

చలిగాలులు మరోసారి గ్రేటర్ హైదరాబాద్‌ను వణికిస్తున్నాయి. బుధవారం రాజధాని నగరంలో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణస్థాయి కంటే 7.7 డిగ్రీలు తగ్గి, 9.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. ఈ నెల మొదటిరోజు అంటే జనవరి 1న కూడా ఇదే తరహాలో 9.3డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. గతనెల 31న 9.5 డిగ్రీలుగా నమోదైంది. 2010 డిసెంబర్‌లో అతితక్కువగా రాత్రి ఉష్ణోగ్రతలు 8.9 డిగ్రీలు నమోదైనట్టు వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. జనవరిలో మాత్రం ఇంత తక్కువస్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కావడం గడిచిన పదేండ్లలో ఇది రెండవసారి కావడం గమనార్హం. ఆ రెండు రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు కూడా ఇదే నెలలో నమోదు కావడం యాదృచ్ఛికం. ఆరంభంతోనే వణికించిన జనవరి నెల.. ముగింపులో కూడా వణికిస్తున్నది. నగరంలో తేమ 57% నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. మరో మూడ్రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశాలున్నట్టు తెలిపారు. ఉదయం, రాత్రి సమయాల్లో పొగమంచు ప్రభావం కూడా అధికంగా ఉంటుందని పేర్కొన్నారు.

కశ్మీర్‌ను తలపిస్తున్న ఆదిలాబాద్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా చలితీవ్రత కొనసాగుతున్నది. మంగళవారం రాత్రి నుంచి చలిప్రభావం ఒక్కసారిగా పెరిగింది. బుధవారం ఉదయం 8గంటల వరకు మంచు ప్రభావం కనిపించింది. దీంతో వాతావరణం కశ్మీర్‌ను తలపించింది. ఉదయం 10 గంటల వరకు కూడా ప్రజలు బయటకు రాలేకపోతున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కుమ్రంభీం ఆసిఫాబా ద్ జిల్లా తిర్యాణి మండలం గిన్నెధరిలో 4.1 డిగ్రీలు, ఆదిలాబాద్‌లో 4.6, ఆదిలాబాద్ రూరల్ మండలం పొచ్చరలో 3.4, జైనథ్ మండలంలో 7, తలమడుగులో 7.3, బేలలో 7.3, నార్నూర్‌లో 10 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లా కేంద్రంతోపాటు జాతీయ రహదారి, ఇతర మార్గాల్లో మంచు కురువడంతో వాహనదారులు లైట్లు వేసుకొని నడుపాల్సి వచ్చింది.


వేర్వేరుచోట్ల ఇద్దరు మృతి

చలి తీవ్రతకు వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు చనిపోయారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మామిళ్ళగడ్డ ముత్యాలమ్మ వీధికి చెందిన కూరగాయల వ్యాపారి బడుగు యాదగిరి (55) చలి తీవ్రతతో అస్వస్థతకు గురై రెండు రోజులుగా చికిత్స పొందుతూ బుధవారం మరణించారు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లికి చెందిన నకిరెకంటి వెంకటయ్య (80) చలి తీవ్రతతో అస్వస్థతకు గురై చనిపోయినట్టు బంధువులు తెలిపారు.

రాష్ట్రమంతటా ఆనందాశ్రమాలు!

- ప్రభుత్వానికి జైళ్లశాఖ ప్రతిపాదనలు
- హైదరాబాద్‌లో 250 మంది యాచకులకు ఆశ్రయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రమంతటా ఆనందాశ్రమాల ఏర్పాటుకు తెలంగాణ జైళ్లశాఖ సిద్ధమవుతున్నది. గూడులేక, పూటకు తిండిలేక భిక్షాటనచేస్తూ బతుకు వెల్లదీస్తున్న అనాథలు, వయోవృద్ధులు, వికలాంగులను ఆనందాశ్రమాలతో అక్కున చేర్చుకుంటున్నది. దాదాపు 250 మందికి హైదరాబాద్‌లోని చంచల్‌గూడ, చర్లపల్లి కేంద్రకారాగాల్లో ఏర్పాటుచేసిన ఆనందాశ్రమాల్లో ఆశ్రయం కల్పిస్తున్నది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆనందాశ్రమాల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపినట్టు జైళ్లశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఈ ఆశ్రమాల్లోకి వచ్చిన యాచకులకు మంచి భోజనం, వసతితోపాటు వారి మానసిక వికాసానికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రాథమిక విద్యను సైతం అందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆశ్రమాలకు వచ్చేవారి పూర్తి వివరాలు, వేలిముద్రలు తీసుకుంటూ.. వారిని కుటుంబసభ్యుల చెంతకు చేర్చేందుకు జైళ్లశాఖ ప్రయత్నిస్తున్నది.





ఖమ్మం పట్టణంలో చలిగాలులు, పొగమంచు ప్రభావంతో ఉదయం 9 గంటలకు స్వెటర్లు, శాలువాలు కప్పుకొని తిరుగుతున్న స్థానికులు

మూడేండ్ల బాలుడి స్వెటర్‌ను విప్పేశారు

- సీఎం సభకు నల్లరంగు స్వెటర్ వేసుకొని వచ్చినందుకే; అసోంలో దారుణం

గువాహటి, జనవరి 30: చలికి వణికిపోతున్న మూడేండ్ల బాలుడి స్వెటర్‌ను తొలిగించారు అసోం పోలీసులు. దీనికి ప్రధాన కారణం ఆ బాలుడు నల్లరంగు స్వెటర్‌ను ధరించడమే. బిశ్వనాథ్ జిల్లాలో జరిగిన అసోం సీఎం సర్బానందా సోనోవాల్ సభకు ఓ మహిళ తన మూడేండ్ల బాలుడిని తీసుకొని వెళ్లారు. అయితే కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న పౌరసత్వ బిల్లును వ్యతిరేకిస్తూ ఈశాన్య రాష్ట్రాల్లో ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో సీఎం సభకు నల్లరంగు చొక్కాలు వేసుకొని వస్తున్న వారిని అనుమతించం లేదు. ఈ నిబంధనను మూడేండ్ల బాలుడికి కూడా పోలీసులు అమలు చేయడం సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ బాలుడికి సభ అంటే తెలువదు.. నిరసన అంటే తెలువదు.. చలికి వణికిపోతున్న బాలుడి స్వెటర్‌ను ఎలా తొలిగిస్తారు? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. స్వెటర్ తొలిగింపు వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సీఎం సర్బానందా సోనోవాల్ స్పందిస్తూ.. దర్యాప్తు చేసి నివేదిక అందజేయాలని డీజీపీని ఆదేశించారు.

కంటి వెలుగు @ 1.40 కోట్లు

- రాష్ట్రంలో విస్తృతంగా వైద్య శిబిరాల నిర్వహణ
- ఉత్సాహంగా పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

102 వ రోజు — కంటి వెలుగు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో కోటి 40 లక్షల మందికి పరీక్షలు నిర్వహించారు. ప్రతి పౌరుడు కంటిచూపు కోల్పోవద్దన్న లక్ష్యంతో ప్రభుత్వం వైద్య, ఆరోగ్యశాఖ అధ్వర్యంలో విస్తృతంగా కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నది. బుధవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా 8,506 గ్రామాల్లో, మున్సిపాలిటీల పరిధిలోని 751 వార్డుల్లో నిర్వహించిన వైద్యశిబిరాల్లో 1,40,75,395 మందికి పరీక్షలు చేయగా, 21,42,797 మందికి అద్దాలు అందజేశారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 67,456 మందికి పరీక్షలు చేశారు. సంగారెడ్డి జిల్లాలో 7,039 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 513 మందికి అద్దాలు పంపిణీ చేశారు. 312 మందికి అద్దాలు అందించేందుకు ఆర్డర్లు చేశారు. 207 మందికి శస్త్ర చికిత్సల కోసం గుర్తించి రెఫర్ చేశారు.



ఖమ్మం జిల్లా వేంసూరు మండలం మర్లపాడు పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కంటి వైద్యశిబిరాల్లో సేవలు పొందినవారి సంఖ్య

క్యాటగిరీ	బుధవారం	మొత్తం శిబిరాల్లో
పరీక్షలు చేయించుకున్నవారు	67,456	1,40,75,395
కండ్లద్దాలు పొందినవారు	4,816	21,42,797
ప్రత్యేక అద్దాలకు ప్రతిపాదన	4,508	16,68,086
కంటి సమస్యలపై రెఫరల్	3,459	8,70,521

పాణాలు కాపాడనీకే తీరొక్క పథకం



ఎవుసం జేసుకొని బతికే రైతులను ఇప్పటిదాకా పట్టించుకునోళ్లేలేరు. ఇప్పడనిపిస్తంది తెలంగాణ తెచ్చుకున్నది అన్నదాతల బాధలు తీర్చడానికే అని. భూమిని నమ్ముకున్న మాకు పాణం మీద తీపుండది. మా కాల్జేతులు పనిజేత్తన్నయా.. మాకండ్లు సక్కగ కనవడ్తన్నయా అని సూడం. ఇప్పుడు మా అసొంటోళ్ల పాణాలను కాపడానీకే సర్కారోళ్లు తీరొక్క పథకం బెడ్తన్రు. కంటి వెలుగుల పరీక్షలు జేశి అద్దాలిచ్చిన్రు. ఇగ పొలం పనులు మంచిగ జేస్కోవచ్చు. - బద్దం శ్రీనివాస్‌రెడ్డి, రైతు, వెంకట్రావుపల్లి, రామడుగు మండలం, కరీంనగర్ జిల్లా

కేసీఆర్ సార్ సల్లంగుండాలె..



తెలంగాణ ప్రభుత్వంలో కంటి వెలుగు ద్వారా పది మందికి చూపు ప్రసాదిస్తున్న సీఎం కేసీఆర్ సార్ సల్లంగుండాలె. నేను ఎంతో కాలంగ కంటి సమస్యతో బాధపడుతున్న. కండ్లు కనవడకున్నా ఇన్నాళ్లూ ఏ దవాఖానకు పోలె. సీఎం కేసీఆర్ సార్ ప్రవేశపెట్టిన కంటివెలుగు శిబిరంలో కంటి సమస్యకు పరిష్కారం దొరికింది. అందాలు, మందులు ఇచ్చిర్రు. ఇప్పుడు కండ్లు మంచిగ కనవడుతున్నై.

- జట్ల విజయలక్ష్మి, అశోక్‌నగర్ కాలనీ, భద్రాచలం

నాబార్డు రుణ ప్రణాళిక లక్ష కోట్లు

- రూ.1,01,378 కోట్లతో స్టేట్ ఫోకస్ పేపర్ 2019-20 విడుదల
- గతేడాదికన్నా 17,990 కోట్లు అధికం
- పంట రుణాలకు రూ.49,785 కోట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నాబార్డు 2019-20 ఆర్థిక సంవత్సరానికి రూ. 1,01,378 కోట్ల రాష్ట్ర రుణ ప్రణాళిక ఉండాలని నిర్ణయించింది. 2018-19లో రూ. 83,388 కోట్లు కాగా, ఈసారి అదనంగా రూ.17,990 కోట్లు కేటాయించింది. నాబార్డు రూపొందించిన 'స్టేట్ ఫోకస్ పేపర్ 2019-20'ను సీఎస్ ఎస్కే జోషి విడుదల చేశారు. రుణ కేటాయింపులు ఎలా ఉండాలో అన్ని జిల్లాల నుంచి వివిధ శాఖల ద్వారా వివరాలను సేకరించి క్రోడీకరించింది.

70 శాతం పంట రుణాలకే..

మొత్తం రుణప్రణాళికలో దాదాపు 70 శాతం పంట రుణాలకే కేటాయించాలని నాబార్డు బ్యాంకులకు దిశానిర్దేశం చేసింది. వ్యవసాయానికి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్న నేపథ్యంలో ఆ మేరకు కేటాయింపులు భారీగా పెంచాలన్నది నాబార్డు ఉద్దేశంగా కనిపిస్తున్నది. వ్యవసాయం, పశు సంవర్ధకశాఖ, మత్స్యశాఖ సహా అనుబంధరంగాలకు రూ.70,965 కోట్ల రుణాలు ఇవ్వాలని, అందులో రూ.46,344 కోట్లు పంట రుణాలకు కేటాయించాలని విజ్ఞప్తిచేసింది. ఇవి 2018-19తో పోలిస్తే రూ. 3,441 కోట్లు అదనం. యాంత్రీకరణకు రూ.2,833 కోట్లు, వ్యవసాయ మార్కెటింగ్‌లో సదుపాయాలు, గోదాములకు రూ.1,401 కోట్లు, గృహ రుణాలకు రూ.5,834 కోట్లు, విద్యా రుణాలకు రూ.2009 కోట్లు కేటాయించింది.

సన్న, చిన్నకారు రైతులకు అనుగుణంగా..

తెలంగాణలో సన్న, చిన్నకారు రైతులు ఎక్కువగా ఉన్నందున వారి లక్ష్యంగా రుణ ప్రణాళిక ఉండాలని సూచించింది. రాష్ట్రంలో పంటల మార్పిడి జరుగాల్సిన అవసరాన్ని నాబార్డు గుర్తించింది. సోయాబీన్, పప్పు ధాన్యాల సాగును పెంచాలని విజ్ఞప్తిచేసింది. రాష్ట్రప్రభుత్వం ఆహారశుద్ధి పరిశ్రమల స్థాపనపై దృష్టిసారించడంతో ఆ రంగంలో రుణాల కోసం రూ.1145 కోట్లు కేటాయించింది.



సీఎస్ ఎస్కేజోషికి జ్ఞాపిక అందజేస్తున్న నాబార్డు తెలంగాణ మేనేజర్ విజయ్‌కుమార్. చిత్రంలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి తదితరులు

రైతుల ఆదాయం రెట్టింపు సాధ్యమే: సీఎస్ ఎస్కే జోషి

ప్రభుత్వశాఖల పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా వ్యవసాయ అనుబంధ రంగాలతోపాటు పౌరసరఫరాలశాఖను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చే లా సీఎం కేసీఆర్ ఆలోచిస్తున్నారని సీఎస్ ఎస్కే జోషి తెలిపారు. దేశంలో సగటున 3 శాతమే వ్యవసాయ వృద్ధి ఉన్నదని, తగిన చర్యలు తీసుకుంటే రైతుల ఆదాయం రెట్టింపు చేయడం సాధ్యమేనన్నారు. నాబార్డు రూపొందించిన 'స్టేట్ ఫోకస్ పేపర్ 2019-20'ను ఆయన బేగంపేటలో విడుదల చేసి మాట్లాడారు. చిన్న కమతాలవారూ యంత్రాలు కొనాలని, అద్దెకు వ్యవసాయ యంత్రాలు దొరికేలా మార్పులు రావాలన్నారు. కార్యక్రమంలో ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, నాబార్డ్ తెలంగాణ మేనేజర్ విజయ్‌కుమార్, ఆర్బీఐ జీఎం సుందర్‌శంకర్, ఎస్సెల్బీసీ జీఎం రమేశ్, ఆంధ్రాబ్యాంకు ఈడీ ఏకే రథ్, ఎండీ, సీఈవో జే పకీర్‌స్వామి పాల్గొన్నారు.

మహా ఘట్‌బంధన్ గెలిస్తే

రోజుకో ప్రధాని

- విపక్ష ప్రధాని అభ్యర్థి ఎవరో చెప్పాలి
- కాన్పూర్ బూత్ స్థాయి కార్యకర్తల భేటీలో బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా

కాన్పూర్, జనవరి 30: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఒకవేళ 'మహాఘట్‌బంధన్' అధికారంలోకి వస్తే రోజుకొక ప్రధాని ఉంటారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఎద్దేవా చేశారు. బుధవారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని బీజేపీ బూత్ కమిటీ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. విపక్షం తమ ప్రధాని అభ్యర్థి ఎవరో ప్రకటించాలన్నారు. 'ఒకవేళ వారు అధికారంలోకి వస్తే.. సోమవారం మాయావతి, మంగళవారం అఖిలేశ్ యాదవ్, బుధవారం మమతాబెనర్జీ, గురువారం శరద్‌పవార్, శుక్రవారం దేవెగౌడ, శనివారం స్టాలిన్ ప్రధానిగా ఉంటారని, ఆదివారం సెలవు ఉంటుందని వ్యాఖ్యానించారు. వారికి నాయకుడే లేడని విమర్శించారు. బీజేపీకి నాలుగు 'బీ'లు ఉన్నాయన్నారు. బఢ్తా భారత్ (ముందుకెళుతున్న భారత్), బన్‌తా భారత్ (అభివృద్ధి చెందుతున్న భారత్)గా చెప్పారు. మహాకూటమిగా ఏర్పాటైన పార్టీలు వారసత్వ రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఆ పార్టీలకు నాలుగు 'బీ'లు.. బువా(మేనత్త), భతిజా(మేనల్లుడు), భాయి (సోదరుడు), బెహెన్ (చెల్లెలు) ఉన్నారని విమర్శించారు. 'వారి ప్రభుత్వం దేశాన్ని ముందుకు తీసుకెళ్లలేదు. మోదీజీ నాయకత్వంలో ఏర్పాటైన సమర్థ ప్రభుత్వం ఉండాలని మనం కోరుకుంటున్నాం. వారు 'మజ్బూర్ (నిస్సహాయ) ప్రభుత్వం కోరుకుంటున్నారు. మోదీజీ మాత్రమే 'మజ్బూత్ (బలమైన) ప్రభుత్వం అందించగలరు' అని అమిత్ షా చెప్పారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఘనమైన విజయాన్ని సాధించి పెట్టాలని కార్యకర్తలను కోరారు. ఈ ఎన్నికల్లో ఫలితాలతో విపక్షాలు వణికిపోవాలన్నారు. రామజన్మభూమి అంశాన్ని లేవనెత్తే అధికారం కాంగ్రెస్ పార్టీ నేతలకు లేదన్నారు. రామ్ జన్మభూమి న్యాస్ నుంచి 42 ఎకరాల భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నదని, ఆ భూమిని తిరిగిచ్చేయాలన్నారు.



2 నుంచి పవర్‌లోకి సర్పంచ్‌లు

ఉత్తర్వులు జారీచేసిన పంచాయతీరాజ్ కమిషనర్ నీతూప్రసాద్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో పంచాయతీల కొత్త పాలకవర్గాలు ఫిబ్రవరి 2వ తేదీ నుంచి బాధ్యతలు స్వీకరించనున్నాయి. ఈ మేరకు పంచాయతీరాజ్ కమిషనర్ నీతూప్రసాద్ బుధవారం గెజిట్ జారీచేశారు. మూడు విడుతలుగా నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు ఫిబ్రవరి 2న బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు. అదేరోజు పాలకమండలి తొలి సమావేశం నిర్వహించాలని స్పష్టంచేశారు.

సర్పంచ్ పదవి వేలంపై హైకోర్టులో కేసు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నల్గొండ జిల్లా వేములపల్లి మండలం తిమ్మారెడ్డిగూడ గ్రామంలో సర్పంచ్ పదవికి వేలం పాట నిర్వహించి.. బలవంతంగా పదవిని దక్కించుకున్నారని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన పలువురు బుధవారం హైకోర్టును ఆశ్రయించారు. సర్పంచ్ పదవిని రూ.8 లక్షలకు కొనుగోలు చేసినట్టు ఆరోపించారు. తాము నామినేషన్ వేయకుండా భయభ్రాంతులకు గురిచేశారని పిటిషనర్లు పేర్కొన్నారు. దీనిపై హైకోర్టు విచారణ చేపట్టాల్సి ఉన్నది.

మూడు విడుతల్లో పంచాయతీ ఎన్నికల (సర్పంచ్) ఫలితాలు..

టీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ	టీడీపీ	సీపీఐ	సీపీఎం	ఇతరులు	తేలనివి
8606	2486	153	57	56	67	1168	16

తుది విడుత పంచాయతీ ఎన్నికల (సర్పంచ్) ప్రాథమిక ఫలితాలు..

జిల్లా పేరు	మొత్తం పంచాయతీలు ఏకగ్రీవాలు కలిపి	టీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ	టీడీపీ	సీపీఐ	సీపీఎం	ఇతరులు	తేలనివి
కరీంనగర్	109	86	08	05	01	--	--	9	--
జగిత్యాల	127	95	20	02	--	--	--	10	--
పెద్దపల్లి	81	42	19	08	--	--	--	12	--
రాజన్న సిరిసిల్ల	89	78	02	01	--	--	--	08	--
మంచిర్యాల	92	64	21	-	--	--	--	07	--
కుమ్రం భీం ఆసిఫాబాద్	114	74	32	--	--	--	--	07	01
ఆదిలాబాద్	163	119	18	--	--	--	--	25	01
నిర్మల్	131	80	24	02	--	--	--	25	--
కామారెడ్డి	169	123	37	02	--	--	--	07	--
నిజామాబాద్	211	165	12	04	01	--	--	29	--
ఖమ్మం	192	114	49	--	02	05	10	12	--
భద్రాద్రి కొత్తగూడెం	163	92	39	--	--	08	02	22	--
మహబూబ్‌నగర్	227	164	48	--	--	--	--	15	--
నాగర్‌కర్నూల్	152	111	31	--	--	--	--	10	--
వనపర్తి	87	62	23	--	--	--	--	02	--
జోగుళాంబ గద్వాల	75	59	14	01	--	--	--	01	--
మెదక్	145	115	10	--	--	--	--	20	--
సిద్దిపేట	122	85	21	01	01	--	--	14	--
సంగారెడ్డి	199	140	53	--	--	--	--	06	--
సూర్యాపేట	154	97	46	--	--	--	04	07	--
నల్లగొండ	257	142	97	01	--	03	01	11	02
యాదాద్రిభువనగిరి	145	97	32	02	--	--	--	14	--
రంగారెడ్డి	198	86	74	15	01	--	--	22	--
వికారాబాద్	148	93	39	03	--	--	--	12	01
వరంగల్ అర్బన్	58	50	07	--	--	--	--	01	--
వరంగల్ రూరల్	120	85	31	--	--	--	--	04	--
జనగామ	91	64	08	--	--	--	02	17	--
మహబూబాబాద్	155	115	35	--	--	--	--	05	--
జయశంకర్ భూపాలపల్లి	108	45	36	--	--	--	--	27	--
మొత్తం	4082	2742	886	47	06	16	19	361	05



వనపర్తి జిల్లా వీపనగండ్ల సర్పంచ్‌గా గెలుపొందిన టీఆర్ఎస్ మద్దతుదారు వంగూరు నర్సింహారెడ్డి విజయోత్సవం

గులాబీ ప్రభంజనం

> మొదటిపేజీ తరువాయి...

రీపోలింగ్ నిర్వహించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. బుధవారం జరిగిన మూడో విడుత ఎన్నికల్లో ఇక్కడ కమ్లిబాయి అనే మహిళ ఓటు హక్కును వేరొక మహిళ వినియోగించుకున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో.. మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఆయన నిర్ణయించారు. ఫిబ్రవరి 1వ తేదీన వార్డు మెంబర్ ఎన్నికతోపాటు ఆ వార్డులో సర్పంచ్ ఎన్నికను కూడా నిర్వహించాలని అధికారులకు సూచించారు.



మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం మద్దిగట్లలో టీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు



ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం చెరువుకొమ్ముతండాలో టీఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి గెలుపు సంబురాల్లో మహిళలు

జిల్లాలవారీగా పోలింగ్ వివరాలు

జిల్లా	పోలింగ్ శాతం
యాదాద్రి భువనగిరి	: 94.99
కామారెడ్డి	: 94.56
సూర్యాపేట	: 92.60
నల్లగొండ	: 91.73
కుమ్రంభీం ఆసిఫాబాద్	: 91.54
సిద్దిపేట	: 90.73
మెదక్	: 90.28
సంగారెడ్డి	: 90.15
వరంగల్ రూరల్	: 89.78
జోగుళాంబ గద్వాల	: 89.66
కరీంనగర్	: 89.66
జనగామ	: 89.42
నిర్మల్	: 89.05
వరంగల్ అర్బన్	: 88.80
పెద్దపల్లి	: 88.79
రంగారెడ్డి	: 88.40
నాగర్‌కర్నూల్	: 87.40
భద్రాద్రి కొత్తగూడెం	: 87.24
జయశంకర్ భూపాలపల్లి	: 86.97
ఖమ్మం	: 86.30
మహబూబాబాద్	: 85.94
మహబూబ్‌నగర్	: 85.94
వనపర్తి	: 85.41
రాజన్న సిరిసిల్ల	: 85.30
వికారాబాద్	: 83.68
ఆదిలాబాద్	: 82.99
మంచిర్యాల	: 80.04
నిజామాబాద్	: 79.81
జగిత్యాల	: 77.70
మేడ్చల్	ఎన్నికలు లేవు
మొత్తం	**: 88.03**

వీవీప్యాట్‌ల లెక్కింపుపై వివరాలివ్వండి

ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గత నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఇబ్రహీంపట్నం, కోదాడ, తుంగతుర్తి నియోజకవర్గాల్లో వీవీ ప్యాట్ స్లిప్పులను లెక్కించే అంశంపై కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఎన్నికల సంఘాన్ని బుధవారం ఆదేశించింది. ఫిబ్రవరి 7వ తేదీ వరకు పూర్తి వివరాలు అందజేయాలని పేర్కొంది. ఆయా సెగ్మెంట్లలో వీవీ ప్యాట్ స్లిప్పులు లెక్కించేలా ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీచేయాలని మల్‌రెడ్డి రంగారెడ్డి, పద్మావతిరెడ్డి, అద్దంకి దయాకర్ హైకోర్టును ఆశ్రయించగా ఆదేశాలు జారీ చేసింది.

నేడు పర్యావరణ విద్యపరీక్ష

- రేపటినుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు గురువారం పర్యావరణ విద్య పరీక్ష నిర్వహించనున్నట్టు, ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఇంటర్‌బోర్డు సెక్రటరీ తెలిపారు. ఈ పరీక్షకు 4.95 లక్షల మంది హాజరవుతారని పేర్కొన్నారు. ఫిబ్రవరి ఒకటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు.

ఏడో పే కమిషన్‌పై ప్రభుత్వానికి నివేదిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏడో వేతన సవరణ కమిషన్‌పై నివేదికను బుధవారం ప్రభుత్వానికి అందజేశామని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ పాపిరెడ్డి తెలిపారు. వర్సిటీ, ప్రభుత్వ డిగ్రీ కాలేజీల అధ్యాపకులతోపాటు రిటైర్డ్ ఉద్యోగులకు ఆరోగ్య పథకాన్ని వర్తింపజేయడం, రిటైర్డ్ సిబ్బందికి సవరించిన పింఛన్‌ను అమలుచేయాలన్న ప్రతిపాదనలతో నివేదిక అందజేసినట్టు పేర్కొన్నారు.

సొంతూళ్లకు గల్ఫ్ బాధితులు

- క్షేమంగా చేరుకొన్న 14 మంది
- ఎంపీ కవితకు రుణపడి ఉంటామంటున్న బాధితులు
- తెలంగాణ జాగృతి చొరవకు కృతజ్ఞతలు

కాచిగూడ/ నిజామాబాద్/నమస్తే తెలంగాణ ప్రతినిధి: నకిలీ ఏజెంట్ చేతిలో మోసపోయి ఇరాక్‌లో అష్టకష్టాలు పడుతున్న పలువురు ఎంపీ కవిత చొరువతో స్వగ్రామాలకు చేరారు. నిజామాబాద్ జిల్లాలోని వేర్వేరు గ్రామాలకు చెందిన 14 మంది ఇరాక్‌కు వెళ్లి పడరాని బాధలు పడ్డారు. రెండురోజులకోసారి భోజనం చేశారు. దీనస్థితి గురించి బాధితుల కుటుంబసభ్యులు ఎంపీ కవితను కలిసి వివరించారు. ఆమె సూచన మేరకు వారిని స్వదేశానికి తరలించాలని కోరుతూ ఇరాక్‌లోని భారత రాయబార కార్యాలయానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. 14 మంది బాధితులు ఇంటికి చేరేందుకు ఇరాక్ నుంచి ఢిల్లీకి విమాన చార్జీలు, ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు రైలు చార్జీలను ఎంపీ కవిత భరించారు. ఢిల్లీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ ద్వారా హైదరాబాద్ చేరుకున్న బాధితులకు తెలంగాణ జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, నాయకులు పసుల చరణ్, ప్రశాంత్ కలిసి స్వాగతం పలికి.. భోజన ఏర్పాట్లు చేసి ప్రత్యేక వాహనాల్లో స్వగ్రామాలకు పంపారు.

బాధితుల వివరాలు..

నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం కోనసముందర్‌కు చెందిన రాజేశ్వర్, సిరికొండకు చెందిన గంగారెడ్డి, నవీపేట్ మండలం నాగేపూర్‌కు చెందిన కృష్ణాకర్, గంగన్న, ధర్పల్లి మండలం రామడుగుకు చెందిన శ్రీరాం లింబాద్రి, రాజు, సిరికొండ మండలం కొండూర్‌కు చెందిన కాటం మహేందర్‌రెడ్డి, డిచ్‌పల్లి మండలం కొరట్‌పల్లికి చెందిన రాజేందర్, నందిపేట్ మండలం బజార్‌కొత్తూరుకు చెందిన భూమేశ్వర్, కొండూరుకు చెందిన లక్ష్మణ్, కోరట్‌పల్లికి చెందిన సాయన్న, మాక్లూర్ మండలం గుత్ప తండాకు చెందిన చతుర్‌సింగ్, రవీందర్, వినోద్ స్వగ్రామాలకు చేరుకున్నారు.



సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్‌కు చేరిన ఇరాక్ బాధితులను రిసీవ్ చేసుకొంటున్న తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి

స్వస్థలాలకు వెళ్లేందుకు ఎంపీ కవిత ఏర్పాట్లు చేశారు



ఇరాక్‌లో ఇబ్బందులు పడుతున్న వారిని స్వదేశానికి రప్పించేందుకు ఎంపీ కవిత ఏర్పాట్లుచేశారు. ఎంబసీ అధికారులతో మాట్లాడి బాధితుల జరిమానాలను రద్దు చేయించారు. సొంత ఖర్చులతో స్వస్థలాలకు పంపారు.

–నవీన్ ఆచారి, తెలంగాణ జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఎంపీ కవితకు రుణపడి ఉంటాం..



నాలుగు నెలలుగా ఇరాక్‌లో ఇబ్బంది పడుతున్నం.. మమ్మల్ని ఆదుకునేవాళ్లే లేరు. ఎంపీ కవిత మేడమ్ తన సొంత ఖర్చులతో టికెట్లు, భోజన ఖర్చులు పెట్టి ఇక్కడికి తీసుకువచ్చినందుకు ఆమెకు రుణపడి ఉంటాం. ఎంపీ మేడమ్ దయతో మా కుటుంబ సభ్యులను కలుసుకోబోతున్నం.

– భూమేశ్వర్, బజార్‌కొత్తూర్, నిజామాబాద్ జిల్లా

హెచ్‌వీడీసీ విద్యుత్ సరఫరా షట్‌డౌన్

- నేటి నుంచి ఫిబ్రవరి 6 వరకు ప్రాంతీయ లింకుల ద్వారా సరఫరా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మన రాష్ట్రానికి విద్యుత్ సరఫరాచేసే 500 కేవీ హెచ్‌వీడీసీ టాల్కర్ ఈస్టర్న్ రీజియన్ నుంచి కోలార్ సదరన్ రీజియన్ లైన్ విద్యుత్ సరఫరాను ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 6 వరకు షట్‌డౌన్ చేయనున్నట్లు టీఎస్ ట్రాన్స్‌కో గ్రిడ్ ఆపరేషన్ డైరెక్టర్ బీ నర్సింగరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. షట్‌డౌన్ కారణంగా ఇబ్బంది కలుగకుండా ఎన్ఎల్‌డీసీ ద్వారా ఇతర అంతర్గత ప్రాంతీయ లింకుల ద్వారా విద్యుత్‌ను సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఈ లైన్‌కు సంబంధించి విద్యుత్ సరఫరాను పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్) నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. ఈ లైన్ 2,000 మెగావాట్ల విద్యుత్‌ను ఈస్టర్న్ రీజియన్ నుంచి సదరన్ రీజియన్ వరకు టాల్కర్ ఎన్టీపీసీ థర్మల్ పవర్ స్టేషన్ స్టేజ్–2 నుంచి సౌత్ రీజియన్‌లోని రాష్ట్రాలను కలుపుకొని సరఫరా ఉంటుందని ఆయన వెల్లడించారు.

నేటినుంచి మిషన్ భగీరథపై వర్క్‌షాపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మిషన్ భగీరథ ప్రాజెక్టును సమర్థంగా నిర్వహించడంపై పంచాయతీరాజ్ గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ దృష్టిపెట్టింది. వేల కోట్ల రూపాయల ప్రజాధనంతో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు నిర్వహణ కోసం అత్యుత్తమ పద్ధతులను అన్వేషిస్తున్నది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశాలతో మిషన్ భగీరథ వంటి ప్రాజెక్టులపై ఇతర రాష్ట్రాలు, విదేశాలు అవలంబిస్తున్న విధానాలను అధ్యయనం చేసేందుకు అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం గురువారం నుంచి ఫిబ్రవరి 2 వరకు మూడురోజులపాటు గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్సీఐ)లో వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ వర్క్‌షాపులో మిషన్ భగీరథ ప్రాజెక్టు ఇంజినీర్లు, అధికారులతోపాటు తాగునీటి సరఫరా విభాగంలో అనుభవజ్ఞులైన రిటైర్డ్ ఇంజినీర్లు, పలు సంస్థలు పాల్గొననున్నాయి. సమర్థమైన తాగునీటి సరఫరాకు కావాల్సిన విధానాలపై మూడురోజుల వర్క్‌షాపులో చర్చించనున్నారు



తెలంగాణ టౌన్ ప్లానింగ్ అధికారులు, ఉద్యోగుల సంఘం డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యాధర్, టీజీవో అధ్యక్షురాలు మమత, టౌన్ ప్లానింగ్ అధికారుల సంఘం అధ్యక్ష్య కార్యదర్శులు జగన్‌మోహన్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

సీతారామకు పచ్చజెండా

> మొదటిపేజీ తరువాయి...

విధించారు. వాటన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం పరిపూర్ణం చేయడంతో తాజాగా తుది అనుమతులు మంజూరయ్యాయి. అటవీ సంరక్షణ చట్టం 1980 సెక్షన్ 2 కింద వచ్చిన తాజా అనుమతుల నేపథ్యంలో భద్రాద్రి జిల్లాలోని మణుగూరు, పాల్వంచ, కొత్తగూడెం డివిజన్లు, ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, ఖమ్మం డివిజన్లలోని అటవీప్రాంతాల్లో సీతారామ ప్రాజెక్ట్‌లో భాగంగా కాల్వలు, సొరంగమార్గాలు, విద్యుత్‌లైన్ల ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యింది. సీతారామ ప్రాజెక్టు తొలిదశ అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన నివేదిక తయారు చేసింది. అటవీ, నీటిపారుదలశాఖల అధికారులు తీవ్రంగా శ్రమించి, తొలిదశ అనుమతులు సాధించారు. అనంతరం రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ప్రశాంత్‌కుమార్ ఝా తన విచక్షణాధికారాన్ని ఉపయోగించి ప్రాజెక్టు పనులకు వర్కింగ్ పర్మిషన్ ఇచ్చారు. తొలి అనుమతులిచ్చిన సమయంలో కేంద్ర ప్రభుత్వం విధించిన షరతులను, నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం యుద్ధపాతిపదికన పూర్తిచేసింది. అటవీశాఖ బదలాయించే సుమారు 1531 హెక్టార్ల అటవీభూమికి ప్రత్యామ్నాంగా పాల్వంచ, సత్తుపల్లి, జగిత్యాల, ఖమ్మం, ఇల్లందు, మణుగూరు ప్రాంతాల్లో దాదాపు 1648 హెక్టార్ల భూమిని ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. ఈ భూములలో కాంపెన్సేటరీ ఎఫారెస్టేషన్ కింద అటవీశాఖ పర్యవేక్షణలో ప్రత్యామ్నాయంగా అడవులను పెంచాలని కేంద్ర అటవీ, పర్యావరణశాఖ ఆదేశించింది. దీనికయ్యే మొత్తం ఖర్చును నీటిపారుదలశాఖ భరిస్తున్నది. అంతేకాకుండా.. కిన్నెరసానిలో క్షీణించిన అటవీ ప్రాంతాలలో మొక్కలను పెంచుతున్నారు. రెవెన్యూ భూములలో 20 లక్షలకు పైగా మొక్కలను నాటడానికి అటవీశాఖ ప్రణాళిక సిద్ధంచేసింది. దీంతోపాటు ప్రాజెక్ట్ పరిధిలో 94 కిలోమీటర్ల పొడవునా కాల్వల గట్లపై మొక్కలను పెంచనున్నట్టు అధికారులు వెల్లడించారు. వన్యప్రాణుల మనుగడకు ఎలాంటి ముప్పులేకుండా చర్యలు తీసుకుంటున్నారు. నాలుగుచోట్ల వన్యప్రాణుల సంచారానికి వీలుగా 20 మీటర్ల వెడల్పుతో పర్యావరణ హిత వంతెనలను ప్రతిపాదించారు. 91 ప్రాంతాలలో కాల్వల కింద నుంచి వన్యప్రాణులు అటూ ఇటూ తిరిగేందుకు వీలుగా అవసరమైన దారిని ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. దీనికితోడు సుమారు పదివేల వృక్షాలను ట్రాన్స్‌లొకేట్ చేయడానికి కూడా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఇలా నిబంధనలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిచేయడంతో కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ తుదిదశ అనుమతులను జారీచేసింది. రూ. 7967 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి–కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని 25 మండలాలు, మహబూబాబాద్ జిల్లాలోని ఒక మండలంలో కొత్త ఆయకట్టు, స్థిరీకరణ కలిపి మొత్తం 6.74 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. వందలాది గ్రామాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.



లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ నిర్వహించిన అఖిలపక్ష భేటీకి హాజరైన వివిధ పార్టీల నేతలు

- రేపు బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్
- సజావుగా సమావేశాల నిర్వహణకు సహకరించాలన్న స్పీకర్ మహాజన్
- మధ్యంతర బడ్జెట్ పేరుతో పూర్తి బడ్జెట్ పెడితే వ్యతిరేకిస్తాం: మల్లిఖార్జున ఖర్గే
- మధ్యంతర బడ్జెట్ అనే ప్రస్తావనే లేదన్న కేంద్ర మంత్రి విజయ్ గోయల్
- 10 రోజులు జరుగనున్న సమావేశాలు

నేటి నుంచి పార్లమెంట్
'బడ్జెట్' సమావేశాలు

న్యూఢిల్లీ, జనవరి 30: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు గురువారం నుంచి వాడివేడిగా ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో పలు ప్రజాకర్షక పథకాలను ప్రకటించేందుకు అధికార పక్షం సిద్ధం అవుతున్నది. మరోవైపు విపక్షాలు రాఫెల్ కుంభకోణం, వ్యవసాయ సంక్షోభంపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాయి. గురువారం నుంచి మొదలయ్యే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 13తో ముగిస్తాయి. నరేంద్ర మోదీ సారథ్యంలోని ప్రభుత్వానికి ఇవే చివరి సమావేశాలుగా భావిస్తున్నారు. గురువారం పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగిస్తారు. శుక్రవారం ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ వచ్చే ఆర్థిక సంవత్సరానికి తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెడతారు. ఇందులో వివిధ వర్గాలు లక్ష్యంగా చేసుకుని పలు సంక్షేమ పథకాలను ప్రకటించే అవకాశం ఉంది. రాజ్యసభలో పౌరసత్వం, ట్రిపుల్ తలాక్ బిల్లుల ఆమోదానికి అధికార పక్షం చేస్తున్న ప్రయత్నాలకు విపక్షాల నుంచి గట్టి వ్యతిరేకత వస్తున్నది. జేడీయూ వంటి బీజేపీ మిత్రపక్షాలూ సదరు బిల్లులపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. పొరుగు దేశాల నుంచి వలస వచ్చి దేశంలో స్థిరపడిన ముస్లిమేతరులు..హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైన్లు, క్రైస్తవులకు భారత పౌరసత్వం కల్పించడానికి ప్రతిపాదించిన పౌరసత్వ సవరణ బిల్లు ఆమోదం కోసం ప్రభుత్వం పట్టుదలగా ఉన్నది. ప్రవాస భారతీయులకు పరోక్ష ఓటు హక్కు తదితర బిల్లుల ఆమోదానికి కేంద్రం ప్రయత్నిస్తున్నది. పౌరసత్వ సవరణ బిల్లును గత సమావేశాల్లో లోక్‌సభ ఆమోదించింది. ఈ బిల్లులో పేర్కొన్న పొరుగు దేశాల జాబితా నుంచి బంగ్లాదేశ్‌ను తొలిగించాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అయోధ్యలో వివాదరహిత స్థలాన్ని అప్పగించాలని సుప్రీంకోర్టును కేంద్రం కోరడాన్ని విపక్షాలు నిలదీసే అవకాశం ఉంది.

సజావుగా పార్లమెంట్ సాగేందుకు సహకరిస్తామన్న పార్టీలు: సుమిత్రా మహాజన్

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరిస్తామని అన్ని పార్టీలు హామీ ఇచ్చాయని లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ తెలిపారు. ఆమె అధ్యక్షతన బుధవారం అఖిలపక్ష సమావేశం జరిగింది. 16వ లోక్‌సభ చివరి సమావేశాల్లో జాతీయ ప్రాముఖ్య అంశాలను లేవనెత్తాలని కోరారు. అన్ని పార్టీలు రైతుల అంశాలపై చర్చ జరుగాలని కోరాయని సమావేశం తర్వాత ఆమె మీడియాతో చెప్పారు. 10 రోజుల పాటు పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జరుగుతాయి. వచ్చేది తాత్కాలిక బడ్జెట్టా, ఓటాన్ అకౌంట్ బడ్జెట్టా? అన్న విషయం ప్రభుత్వానికి సంబంధించిన అంశమన్నారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి విజయ్ గోయల్ స్పందిస్తూ రాజ్యాంగంలో 'మధ్యంతర బడ్జెట్' అనే పదమేదీ లేదన్నారు. దీనిపై లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ పక్ష నేత మల్లిఖార్జున ఖర్గే స్పందిస్తూ ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రతిపాదనలతో వస్తే కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుందన్నారు. అప్పుడు తమపై ఆగ్రహించొద్దని స్పీకర్‌ను ఖర్గే కోరారు. బడ్జెట్‌లో ఎటువంటి ప్రజాకర్షక విధానాలను ప్రవేశపెట్టినా వ్యతిరేకిస్తామని విపక్షాలు స్పష్టం చేశాయి. మధ్యంతర బడ్జెట్ పేరుతో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడితే తాము వ్యతిరేకిస్తామని కాంగ్రెస్ నేత మల్లిఖార్జున ఖర్గే తెలిపారు. ప్రభుత్వం కేవలం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టాల్సి ఉంటుందన్నారు. రాఫెల్ ఒప్పందంపై సరికొత్త అంశాలు ఇంగ్లిష్ దినపత్రికల్లో బయటపడ్డాయని, దీనిపై పార్లమెంట్‌లో ప్రధాని మోదీ సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల కల్పనపై ఎన్‌ఎస్ఎస్ఓ గణాంకాలను నిలదీస్తామన్నారు. వ్యవసాయ సంక్షోభం, సీబీఐలో పరిణామాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని తృణమూల్ సభ్యుడు సుదీప్ బందోపాధ్యాయ చెప్పారు.

ప్రజాకర్షక పథకాలతో మధ్యంతర బడ్జెట్

- వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసే అవకాశం
- సంప్రదాయానికి భిన్నంగా వ్యవహరించనున్న మోదీ సర్కార్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఎన్నికల సంవత్సరంలో కేంద్రం సంప్రదాయాలకు భిన్నంగా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు బదులుగా ప్రజాకర్షక పథకాలతో కూడిన మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్టు తెలుస్తున్నది. గత ప్రభుత్వాలు సార్వత్రిక ఎన్నికలకు ముందు ఓటాన్ అకౌంట్ బడ్జెట్/మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సందర్భాలున్నాయి. ఈసారి పాత సంప్రదాయానికి భిన్నంగా వ్యవహరిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఇటీవల సూచనప్రాయంగా చెప్పారు. 'ఎన్నికల ముందు తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టే సంప్రదాయం చాలా కాలంగా కొనసాగుతున్నది. దీని నుంచి పక్కకు జరుగకుండా ఉండేందుకు ఎటువంటి కారణాలు కనిపించడం లేదు. ప్రస్తుత దశలో వీటిని వెల్లడించడం లేదా వీటి గురించి చర్చించడం కుదరదు' అని జైట్లీ ఈ నెల 17న ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ చెప్పారు. కానీ ఇలా చేయడం రాజ్యాంగ విరుద్ధమని, సముచితం కాదని కేంద్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా పేర్కొన్నారు. దేశ వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని, ఉపాధి కల్పన వేగవంతం కావడం లేదని, బ్యాంకుల్లో మొండిబాకీలు గణనీయంగా పెరుగుతున్నాయని, మోదీ సర్కార్ ఈ సమస్యలను పరిష్కరించకుండా ఆర్థిక గణాంకాలకు లేనిపోని మెరుగులద్ది ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. కాగా, సంక్షోభం నుంచి రైతులను గట్టెక్కించేందుకు వీలుగా వ్యవసాయ రంగానికి సహాయ ప్యాకేజీని ప్రకటిస్తామని జైట్లీ ఇటీవల చెప్పారు. వ్యవసాయ సంక్షోభ తొలిగింపునకు త్వరలో కొన్ని కీలక చర్యలను ప్రకటించనున్నట్టు కేంద్ర వ్యవసాయ మంత్రి రాధామోహన్ సింగ్ కూడా సంకేతాలివ్వడంతో ఈసారి బడ్జెట్‌లో వ్యవసాయానికి పెద్దపీట వేసే అవకాశం కనిపిస్తున్నది. తెలంగాణ 'రైతుబంధు' తరహాలో దేశంలోని చిన్న, సన్నకారు రైతులకు పంట పెట్టుబడిగా ఎకరాకు రూ.10 వేల చొప్పున సాయం అందజేయాలని కేంద్రం నిర్ణయిస్తే రానున్న ఆర్థిక సంవత్సరం (2019-20)లో దేశ ద్రవ్యలోటు 72 బేసిస్ పాయింట్లు పెరుగుతుందని ఇండియా రేటింగ్స్ అండ్ రిసెర్చ్ సంస్థ స్పష్టం చేసింది.



రాజ్‌ఘాట్‌లోని గాంధీ సమాధివద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి కోవింద్, చిత్రంలో వెంకయ్య, మోదీ, నిర్మలా సీతారామన్ తదితరులు

మహాత్మాగాంధీకి జాతి నివాళి

న్యూఢిల్లీ, జనవరి 30: మహాత్మాగాంధీ 71వ వర్ధంతి సందర్భంగా ఆయనకు జాతి బుధవారం నివాళులర్పించింది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్రమోదీ, ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు తదితరులు ఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద బాపూజీ సమాధి వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, హర్దీప్ సింగ్ పురి తదితరులు జాతిపితకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్‌ఘాట్ వద్ద మహాత్మాగాంధీకి ప్రీతిపాత్రమైన సంకీర్తన 'రఘుపతి రాఘవ రాజారాం' గేయాన్ని ఆలపించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ తదితరులు రాజ్‌ఘాట్ వద్ద జాతిపితకు నివాళులర్పించారు. ట్విట్టర్ వేదికగా ప్రధాని మోదీ నివాళులర్పిస్తూ.. మహాత్మాగాంధీ చూపిన మార్గంలో ఆయన సిద్ధాంతాలకు కట్టుబడి ముందుకు సాగుతామని పేర్కొన్నారు. 'దేశం కోసం ప్రాణాలర్పించిన అమర వీరులకు సెల్యూట్. జాతి కోసం ప్రాణాలర్పించిన వారికి దేశం కృతజ్ఞతతో ఉంటుంది' అని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ చట్టంపై స్టే జారీ చేయలేం

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- 19న సవివరంగా విచారిస్తామని వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 30: ఎస్సీలు, ఎస్టీలపై అకృత్యాల నిరోధక చట్టానికి కేంద్ర ప్రభుత్వం చేసిన సవరణలపై స్టే విధించడానికి మరోసారి సుప్రీంకోర్టు నిరాకరించింది. కేంద్ర ప్రభుత్వ సమీక్షా పిటిషన్, కేంద్రం చేసిన చట్ట సవరణలపై తక్షణం స్టే విధించాలని కోరుతూ సీనియర్ న్యాయవాది వికాస్‌సింగ్ తదితరులు దాఖలుచేసిన పిటిషన్లపై బుధవారం జస్టిస్ యూయూ లలిత్ సారథ్యంలోని బెంచ్ విచారణ జరిపింది. వీటిపై వచ్చే నెల 19న సవివరంగా విచారణ జరుపుతామని తెలిపింది. ఎస్సీ, ఎస్టీలపై అకృత్యాల నిరోధక చట్టాన్ని ప్రభుత్వ ఉద్యోగులు, వ్యక్తులపై వేధింపులకు దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొంటూ దాఖలైన పిటిషన్లపై గతేడాది మార్చి 20న విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం ఈ చట్టం కింద దాఖలైన కేసుల్లో నిందితులకు ముందస్తు బెయిల్ మంజూరు చేయవచ్చునని ఆదేశించింది. దీంతో సుప్రీంకోర్టు జారీచేసిన ఆదేశాలను తోసి రాజంటూ గతేడాది ఆగస్టు తొమ్మిదో తేదీన పార్లమెంట్ బిల్లును ఎస్సీ/ ఎస్టీ చట్టానికి కేంద్రం సవరణలు చేసింది. ఈ సవరణలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను తగిన బెంచ్ విచారిస్తుందని ఈ నెల 25న సుప్రీంకోర్టు తెలిపింది. తాజాగా పార్లమెంట్ ఆమోదించిన చట్ట సవరణలపై స్టే జారీ చేయలేమని పేర్కొంది. దీనిపై దాఖలైన పిటిషన్ల విషయమై కేంద్రం వైఖరేమిటో తెలియజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

విజృంభిస్తున్న
స్వైన్ ఫ్లూ



మాస్క్‌లతో స్కూల్‌కు హాజరైన విద్యార్థులు

- నెల రోజుల వ్యవధిలో దేశవ్యాప్తంగా 4,571 కేసులు నమోదు
- 181 మంది మృతి
- రాజస్థాన్‌లో అత్యధికంగా 76 మరణాలు.. తెలంగాణలో అత్యల్పంగా ఇద్దరు మృతి

న్యూఢిల్లీ, జనవరి 30: ప్రమాదకర స్వైన్ ఫ్లూ వైరస్ మళ్లీ విజృంభిస్తున్నది. కేవలం నెల రోజుల వ్యవధిలో దేశవ్యాప్తంగా 4,571 స్వైన్ ఫ్లూ కేసులు నమోదయ్యాయి. అంటే ప్రతి రోజు సగటున 168 కేసులు నమోదయ్యాయి. ఈ నెల రోజుల వ్యవధిలో దేశవ్యాప్తంగా 181 మంది మరణించారు. ఇందులో ఎక్కువగా రాజస్థాన్‌లో 76 మరణాలు సంభవించాయి. తర్వాతి స్థానాల్లో పంజాబ్ (27 మరణాలు), గుజరాత్ (27 మరణాలు), మహారాష్ట్ర (12 మరణాలు), హర్యానాలో 8 మంది చనిపోయారు. ఇక కేసుల వారీగా చూస్తే.. రాజస్థాన్‌లో అత్యధికంగా 1,976 స్వైన్ ఫ్లూ కేసులు నమోదయ్యాయి. గుజరాత్‌లో 659 కేసులు, ఢిల్లీలో 532, పంజాబ్‌లో 188, హర్యానాలో 388, మహారాష్ట్రలో 96, హిమాచల్ ప్రదేశ్‌లో 9 మందికి స్వైన్ ఫ్లూ ఉన్నట్లు తేలింది. ఈ వైరస్ వల్ల ఢిల్లీలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో 215 స్వైన్ ఫ్లూ కేసులు నమోదు కాగా.. నలుగురు మరణించారు. కేరళలో 100 కేసులు నమోదుకాగా.. ముగ్గురు మృతిచెందారు. తెలంగాణలో 271 మందికి స్వైన్ ఫ్లూ సోకగా.. ఇద్దరు మరణించారు. ఈ రెండు మరణాలు కూడా హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానలో చోటుచేసుకున్నాయి. కర్ణాటకలో 189 మందికి ఈ వైరస్ సోకింది. జమ్ముకశ్మీర్‌లో 121 కేసులు నమోదు కాగా.. 10 మంది ప్రాణాలు కోల్పోయారు. గతేడాది దేశవ్యాప్తంగా 14,992 స్వైన్ ఫ్లూ కేసులు నమోదు కాగా.. 1,103 మంది మృత్యువాతపడ్డారు. మళ్లీ స్వైన్ ఫ్లూ కేసులు పెరిగిపోతుండటంతో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. అన్ని రాష్ట్రాల అధికారులతో ఇటీవల ఓ సమావేశాన్ని నిర్వహించింది. ఈ వ్యాధి బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించింది. స్వైన్ ఫ్లూ రోగుల కోసం దవాఖానల్లో ప్రత్యేక గదులు కేటాయించాలని కోరింది.

21న మందిర్‌కు శంకుస్థాపన

పరమ ధర్మ సంసద్ ప్రకటన



ధర్మ సంసద్‌లో స్వామి స్వరూపానంద

న్యూఢిల్లీ,: లోక్‌సభ ఎన్నికల ముంగిట అయోధ్యలో 'రామ మందిరం' అంశం వేడి పుట్టిస్తున్నది. దీనిపై హిందూత్వ సంస్థలు కేంద్రంపై ఒత్తిడిని పెంచుతున్నాయి. అయోధ్యలోని వివాదరహిత భూమిని దాని యజమానులకు అప్పగించేందుకు అనుమతించాలని సుప్రీంకోర్టును కేంద్రం కోరిన మరునాడే హైందవ ఆధ్యాత్మిక నేతల సమూహం పరమ ధర్మ సంసద్ వచ్చే నెల 21న అయోధ్యలో రామ మందిరం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని బుధవారం ప్రకటించింది. హిందూ మతంపై ఆరెస్సెస్ గుత్తాధిపత్యం చెల్లదని, దేశవ్యాప్తంగా హిందువులకు ఆధ్యాత్మిక నాయకుడు స్వామి స్వరూపానంద అని సంసద్ నేతలు పేర్కొన్నారు. రెండు రోజులు ఢిల్లీలో సదస్సు జరిగిన తర్వాత స్వామి స్వరూపానంద మీడియాతో మాట్లాడుతూ, రామ మందిరం నిర్మాణం కోసం మొదలైన ఊపు ఇక ఆగకూడదన్నారు. నేతలు ఆగిపోతే దేశవ్యాప్తంగా హిందువులు ముందడుగు వేయాలన్నారు. వివాదాస్పద స్థలం చుట్టూ ఉన్న భూమిని సేకరించి, అందులో ఒక విగ్రహాన్ని నిర్మించాలని ప్రభుత్వం భావిస్తున్నదని ఆరోపించారు. 'ఆ భూమిని తిరిగిచ్చేయాలని మీరు ఎలా నిర్ణయించారు? అలా నిర్ణయించడానికి మీరు ఎవరు? అక్కడున్న మొత్తం 66 ఎకరాల్లో భారీ రామాలయం నిర్మించాల్సి ఉంది' అని అన్నారు. రామమందిరానికి శంకుస్థాపనకు తాను తన అనుచరులతో కలిసి ఫిబ్రవరి 21న అయోధ్య వెళ్తానని చెప్పారు.



జడ్జిలకు రాజకీయ ఉద్దేశాలు ఆపాదించడం
కోర్టు ధిక్కారమే

- న్యాయవాదుల బృందంపై జస్టిస్ అరుణ్ మిశ్రా ఆగ్రహం
- చీప్ పబ్లిసిటీ కోసం తహతహలాడుతున్నారని విమర్శ

న్యూఢిల్లీ, జనవరి 30: అధికార పార్టీకి అనుకూలంగా పలు తీర్పులు వెలువడడంపై ఓ న్యాయవాదుల బృందం వ్యక్తిగత ఆరోపణలు చేస్తుండడంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ మిశ్రా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయమూర్తులపై వ్యక్తిగత దాడికి దిగడం, వారి తీర్పులకు రాజకీయ ఉద్దేశాలు ఆపాదించడం తీవ్ర ధిక్కారమేనని స్పష్టం చేశారు. రాజకీయంగా ప్రాధాన్యమున్న పలు కేసులను కావాలనే కొన్ని ధర్మాసనాలకు కేటాయిస్తున్నారంటూ గతేడాది జనవరిలో సుప్రీంకోర్టులోని నలుగురు సీనియర్ న్యాయమూర్తులు మీడియా సమావేశంలో ఆరోపించిన విషయం తెలిసిందే. జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనానికి కీలకమైన కేసులు ఇవ్వడాన్ని వారు పరోక్షంగా ప్రస్తావించారు. ఆ సమయంలో ఆయన జస్టిస్ లోయా మృతి కేసు సహా పలు కీలక కేసులను విచారిస్తున్న ధర్మాసనానికి నేతృత్వం వహిస్తున్నారు. బుధవారం ఓ కేసు విచారణ సందర్భంగా జస్టిస్ మిశ్రా ఓ న్యాయవాదుల బృందంపై మండిపడ్డారు. వారు చీప్ పబ్లిసిటీ కోసం తహతహలాడుతున్నారని, తాము బార్ కౌన్సిల్ కంటే ఎక్కువ అన్నట్లు భావిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదైనా రాజకీయ అంశం కోర్టుకు వచ్చి తీర్పు వెలువడితే యోగ్యత లేని వారు న్యాయమూర్తులకు రాజకీయ ఉద్దేశాలు ఆపాదిస్తున్నారని మండిపడ్డారు. ఇది న్యాయవ్యవస్థను పలుచన చేయడమేనని, న్యాయవ్యవస్థపై ప్రజలకున్న విశ్వాసాన్ని దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. ఒకవేళ ఎవరైనా న్యాయమూర్తిపై ఫిర్యాదు చేయదలిస్తే..ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం సరైన పద్ధతి అని సూచించారు. చర్చలు లేవనెత్తడం, మీడియా ముందు మాట్లాడడం ద్వారా తీర్పులను ప్రభావితం చేసే ప్రయత్నాలను అనుమతించబోమన్నారు. కోర్టు ప్రొసీడింగ్స్‌ను వక్రీకరించి మీడియాకు మేత అందించడం సాధారణమైపోయిందని, ఇది కోర్టు ధిక్కరణే అని పేర్కొన్నారు. న్యాయవాదుల స్వతంత్రత, నిష్పాక్షికత విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని బార్ కౌన్సిల్‌కు సూచించారు.

చట్టంతో ఆడుకోవద్దు



- కార్తీ చిదంబరానికి సుప్రీంకోర్టు హెచ్చరిక
- విదేశాలకు వెళ్లేందుకు షరతులతో కూడిన అనుమతి
- రూ.10 కోట్లు జమచేయాలని ఆదేశం

న్యూఢిల్లీ, జనవరి 30: కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పీ చిదంబరం కుమారుడైన కార్తీ చిదంబరానికి సుప్రీంకోర్టు తీవ్ర హెచ్చరికలు చేసింది. చట్టంతో ఆడుకోవద్దని స్పష్టం చేసింది. ఐఎన్ఎక్స్ మీడియా, ఎయిర్ సెల్ మ్యాక్సిస్ కేసుల్లో విచారణకు సహకరించకపోతే తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఫిబ్రవరి 10 నుంచి 23 వరకు ఆయన విదేశాలకు వెళ్లేందుకు పలు షరతులతో కోర్టు అనుమతి ఇచ్చింది. సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్ వద్ద రూ.10 కోట్లు జమచేయాలని ఆయనను ఆదేశించింది. మార్చి 5, 6, 7, 12 తేదీల్లో కేసుల విచారణకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎదుట హాజరుకావాలని స్పష్టం చేసింది. 'మీరు వెళ్లాల్సిన చోటుకు వెళ్లొచ్చు. మీరు చేయాల్సింది చేయొచ్చు. అయితే చట్టంతో ఆడుకోవద్దు. ఒకవేళ సహకరించకపోతే మేం తీవ్ర చర్యలు తీసుకుంటాం' అని సుప్రీంకోర్టు ధర్మాసనం హెచ్చరించింది. పలు అంతర్జాతీయ టెన్నిస్ టోర్నమెంట్ల కోసం ఫిబ్రవరి 10-26, మార్చి 23-31వ తేదీల మధ్య ఫ్రాన్స్, స్పెయిన్, జర్మనీ, యూకే వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కార్తీ దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు బుధవారం విచారణ జరిపింది.

వాయుసేనను అమ్మేసుకున్న మోదీ

- యువత అవకాశాలు దొంగిలించారు
- రాఫెల్ కుంభకోణంపై రాహుల్‌గాంధీ మండిపాటు



'యువక్రాంతి యాత్ర' ముగింపు సభలో మాట్లాడుతున్న రాహుల్

న్యూఢిల్లీ, జనవరి 30: భారత వైమానిక దళాన్ని (ఐఏఎఫ్) ప్రధాని నరేంద్రమోదీ అమ్మేసుకున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలు ఒప్పందం ద్వారా మోదీ తన స్నేహితుడు, పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి రూ.30 వేల కోట్లు ఇచ్చి యువత అవకాశాలను దొంగిలించిన సంగతి ప్రజలందరికీ తెలుసన్నారు. యువజన కాంగ్రెస్ జాతీయ ప్రచారోద్యమం 'యువక్రాంతి యాత్ర' ముగింపు సందర్భంగా బుధవారం జరిగిన సభలో రాహుల్ మాట్లాడుతూ.. రాఫెల్ కుంభకోణంలో నిజానిజాలను ఎవరూ దాచిపెట్టలేరని, వాస్తవాలు తప్పక వెలుగులోకి వస్తాయని చెప్పారు. పార్లమెంట్‌లో మోదీ 90 నిమిషాల సేపు మాట్లాడినా రాఫెల్ ఒప్పందంపై నిజాలను వెల్లడించలేదని ఆరోపించారు. 'రాఫెల్ కుంభకోణంపై మేం ప్రధాని, రక్షణ మంత్రిలను మూడు, నాలుగు ప్రశ్నలకు అడిగాం. ఆయన (మోదీ) మా కండ్లలోకి చూసి సమాధానం ఇవ్వలేకపోయారు' అని చెప్పారు. 'మీరు (మోదీ) రాత్రి వేళ నిద్రపోరు. అనిల్ అంబానీ, రాఫెల్ జెట్, అమరులైన ఐఏఎఫ్ జవాన్ల చిత్రాలను చూసినప్పుడు మాత్రమే మీరు నిద్ర పోతారు. యువత భవిష్యత్‌తో మీరు ఆటలాడుకున్న సంగతి దేశ ప్రజలందరికీ తెలుసు' అని రాహుల్ ఆరోపించారు. '2019లో ప్రజాగ్రహాన్ని మోదీ చూడాల్సిందే' అని స్పష్టం చేశారు.

'హంగ్ పార్లమెంట్' ఓ రుగ్మత

- 30 ఏండ్లపాటు అభివృద్ధిని అడ్డుకుంది
- పెద్ద నోట్లరద్దుతో దిగొచ్చిన ఇండ్ల ధరలు
- ప్రధాని మోదీ వ్యాఖ్య



దండిలోని ఉప్పు సత్యాగ్రహ స్మారక కేంద్రంలో మోదీ

సూరత్, జనవరి 30: కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం ఏర్పడడం అత్యంత అవసరమని ప్రధాని నరేంద్రమోదీ నొక్కిచెప్పారు. హంగ్ పార్లమెంట్ కారణంగా దేశంలో గత మూడు దశాబ్దాలుగా అభివృద్ధి కుంటుపడిందన్నారు. మరోవైపు తమ ప్రభుత్వం తీసుకున్న 'పెద్ద నోట్ల రద్దు' నిర్ణయాన్ని ప్రధాని సమర్థించుకున్నారు. దీని ద్వారా ఇండ్ల ధరలు దిగివచ్చాయని చెప్పారు. రియల్ ఎస్టేట్ రంగంలో నల్లధనానికి చెక్ పెట్టడం ద్వారా అందుబాటు ధరలో నేటి తరం నివాసాలను పొందుతోందని తెలిపారు. బుధవారం గుజరాత్‌లోని సూరత్ విమానాశ్రయ విస్తరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ... ఏ పార్టీకి సంపూర్ణ మెజారిటీ రాకపోవడం వల్ల 30 ఏండ్లు దేశం అస్థిరత నెలకొందని, దీని వల్ల దేశాభివృద్ధి నిలిచిపోయిందని చెప్పారు. గత ఎన్నికల్లో ఓటర్లు వివేకం ప్రదర్శించడం వల్ల నేడు దేశం పురోగతి సాధిస్తున్నదని చెప్పారు. హంగ్ పార్లమెంట్ అనే 30 ఏండ్ల రుగ్మతను ప్రజలు తమ ఓట్ల ద్వారా రూపుమాపారని పేర్కొన్నారు. యూపీఏ ప్రభుత్వం 25 లక్షల ఇండ్లు నిర్మించగా, తమ ప్రభుత్వం గత నాలుగున్న రేండ్లలో 1.30 కోట్ల ఇండ్లను నిర్మించిందని చెప్పారు. ఇది చేయాలంటే గత ప్రభుత్వానికి ఇంకో 25 ఏండ్లు పడుతుందని ఎద్దేవా చేశారు. పెద్దనోట్ల రద్దుతో ప్రయోజనమేంటని తనను ప్రశ్నిస్తున్నారని, అయితే ఆ నిర్ణయం తర్వాత అందుబాటు ధరలో ఇండ్లను కొన్న యువతను ఆ ప్రశ్నను అడగాలని మోదీ సమాధానమిచ్చారు. ఇంతకుముందు రియల్ ఎస్టేట్ రంగంలో నల్లధనం పోగుబడి ఉండేదని, పెద్ద నోట్ల రద్దు,రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ ద్వారా నల్లధనానికి తమ ప్రభుత్వం చెక్ పెట్టిందని చెప్పారు.

ప్రతికూల స్వభావ వ్యక్తులే వ్యతిరేకిస్తున్నారు..

ప్రతికూల స్వభావం కలిగిన వ్యక్తులు నాడు మహాత్మాగాంధీ చారిత్రక దండి యాత్ర చేపట్టకుండా అడ్డుకోవాలని చూశారని, అలాంటి వారే నేడు తమ ప్రభుత్వం చేపడుతున్న ప్రజానుకూల విధానాలను ప్రశ్నిస్తున్నారని ప్రధాని మోదీ ధ్వజమెత్తారు. మహాత్మాగాంధీ 71వ వర్ధంతి సందర్భంగా గుజరాత్ రాష్ట్రంలోని దండిలో ఏర్పాటుచేసిన జాతీయ ఉప్పు సత్యాగ్రహ స్మారకాన్ని, మ్యూజియాన్ని ప్రధాని బుధవారం జాతికి అంకితం చేశారు.

హజారే ఆమరణ దీక్ష

మంత్రితో చర్చలకు నిరాకరణ

రాలెగావ్ సిద్ధి, జనవరి 30: లోక్‌పాల్ ఏర్పాటు హామీని కేంద్ర ప్రభుత్వం నెరవేర్చకపోవడాన్ని, మహారాష్ట్ర లోకాయుక్త చట్టాన్ని ఆమోదించకపోవడాన్ని నిరసిస్తూ ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే మహారాష్ట్రలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. అహ్మద్‌నగర్ జిల్లా రాలెగావ్ సిద్ధిలోని పద్మావతి ఆలయంలో బుధవారం ఉదయం ప్రార్థనలు నిర్వహించిన హజారే.. అనంతరం రైతులు, విద్యార్థులు, యువతో కలిసి యాదవ్‌బాబా ఆలయం వద్దకు ప్రదర్శనగా వెళ్లి అక్కడ దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. మహారాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయాన్ని లోకాయుక్త పరిధిలోకి తీసుకురావాలన్న రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఈ అంశంపై తనతో చర్చలు జరిపేందుకు మహారాష్ట్ర ప్రభుత్వ దూతగా వచ్చిన మంత్రి గిరీశ్ మహాజన్‌ను కలుసుకునేందుకు హజారే నిరాకరించారు. లోకాయుక్త గురించి మహాజన్‌తో చర్చించడం తనకు ఇష్టం లేదని హజారే తేల్చి చెప్పారు.

పాక్ గాయకుడు ఫతే అలీఖాన్‌కు
ఈడీ నోటీసులు

న్యూఢిల్లీ, జనవరి 30: పాకిస్థాన్ గాయకుడు రాహత్ ఫతే అలీఖాన్‌కు భారత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ (ఈడీ) బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఫారెక్స్ నిబంధనలకు విరుద్ధంగా రూ.2.61 కోట్ల విలువైన విదేశీ కరెన్సీని అక్రమంగా దేశంలోకి తరలించారనే ఆరోపణలపై ఈ నోటీసులు జారీ చేసింది.

'రాహుల్‌తో భేటీలో రాఫెల్ ప్రస్తావనే లేదు'

న్యూఢిల్లీ, జనవరి 30: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో జరిగిన ఐదు నిమిషాల భేటీలో రాఫెల్ ఒప్పందం ప్రస్తావనే రాలేదని గోవా సీఎం మనోహర్ పారికర్ స్పష్టం చేశారు. తనను మర్యాద పూర్వకంగా కలుసుకున్న రాహుల్‌గాంధీ.. 'అల్పమైన రాజకీయ ప్రయోజనాల కోసం' తమ భేటీని వాడుకున్నారని పారికర్ ఆరోపించారు. ఈ మేరకు రాహుల్‌కు ఆయన బుధవారం లేఖ రాశారు. దీనిపై రాహుల్ తక్షణమే స్పందించారు. పారికర్‌తో జరిగిన సమావేశ వివరాలను ఎవరికీ వెల్లడించలేదని, రాఫెల్ ఒప్పందంపై అందరికీ అందుబాటులో ఉన్న వివరాలనే తన ప్రసంగాల్లో ప్రస్తావిస్తున్నానని రాహుల్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం పారికర్‌కు ఓ లేఖ రాశారు. పారికర్ తనకు లేఖ రాసినందునే ఈ వివరణ ఇస్తున్నట్టు రాహుల్ తెలిపారు.

బ్రెగ్జిట్‌పై థెరెసా మే సర్కార్‌కు చుక్కెదురు

లండన్/బ్రసెల్స్, జనవరి 30: ఐరోపా యూనియన్ (ఈయూ) నుంచి బ్రిటన్ వైదొలిగేందుకు (బ్రెగ్జిట్‌కు) ఒప్పందాన్ని కుదుర్చుకోరాదన్న ప్రతిపాదనను బ్రిటన్ ఎంపీలు తోసిపుచ్చారు. అయితే ఈ విషయమై ఇప్పటికే ఈయూతో కుదుర్చుకున్న విడాకుల ఒప్పందం గురించి చర్చించేందుకు బ్రిటన్ ప్రధాని థెరెసా మే చేస్తున్న ప్రయత్నాలకు వారు మద్దతు తెలిపారు. ఈయూ నుంచి వైదొలిగేందుకు బ్రిటన్ ఒప్పందాన్ని కుదుర్చుకోరాదన్న ప్రతిపాదనపై మంగళవారం జరిగిన ఓటింగ్‌లో 318 మంది ఎంపీలు వ్యతిరేకంగా ఓటు వేయగా, 310 మంది అనుకూలంగా ఓటు వేశారు. దీంతో ఎటువంటి ఒప్పందం లేకుండానే మార్చి 29న ఈయూ నుంచి వైదొలిగేందుకు బ్రిటన్ సుముఖంగా ఉన్నదని థెరెసా మే ప్రభుత్వం చేస్తున్న వాదనకు చుక్కెదురైంది.

రాహుల్ రావణుడు... ప్రియాంక శూర్పణఖ

బీజేపీ ఎమ్మెల్యే వివాదస్పద వ్యాఖ్యలు

బలియా, జనవరి 30: ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే సురేంద్ర సింగ్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ రావణుడని, ఆయన సోదరి ప్రియాంకా గాంధీ వాద్రా శూర్పణఖ అని విమర్శించారు. 'రాముడితో యుద్ధం ప్రారంభమయ్యే ముందు, రావణుడు శూర్పణఖను ప్రయోగించాడు. ప్రధాని మోదీ రాముడిలా, ప్రియాంకను బరిలో దించిన రాహుల్ రావణుడిలా కనిపిస్తున్నారు. అయినా లంకను గెలుస్తాం' అని సురేంద్ర సింగ్ వ్యాఖ్యానించారు. ప్రియాంకను ప్రధాన కార్యదర్శిగా నియమించడం ద్వారా మోదీపై పోరాటంలో తన అసమర్థతను రాహుల్ నిరూపించుకున్నారని విమర్శించారు. సురేంద్ర సింగ్ గతంలోనూ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు.



సువిశాలమైన దేశంలో ప్రియాంక ఎక్కడైనా కాంగ్రెస్ తరపున ప్రచారం చేస్తారు. గతంలో కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రధాని దేశమంతటా ప్రచారం చేసేవారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ప్రియాంక అవసరాలకు అనుగుణంగా ప్రచారం చేస్తారు.


గులాం నబీ ఆజాద్, కాంగ్రెస్ సీనియర్ నేత

ఇప్పుడు దేశంలో రావణ సంస్కృతి నడుస్తున్నది. రాహుల్ రావణుడు అయితే, ఆయన చెల్లె ప్రియాంక శూర్పనక పాత్ర వహిస్తున్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు. శ్రీరాముడిగా మోదీ దేశ క్షేమం కోసం తపిస్తున్నారు.

సురేంద్రసింగ్, బీజేపీ ఎమ్మెల్యే, యూపీ



చరిత్రలో నేడు



1851

పాల పొడిని తయారుచేసిన అమెరికా శాస్త్రవేత్త గేల్ బోర్డెన్.

1933

ఫ్రెంచి పాలకుడిగా ఎడ్వర్డ్ డాలడీర్.





1933

పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి హామీ ఇచ్చిన జర్మనీ నియంత హిట్లర్.

2019 సాధారణ ఎన్నికలు దగ్గర పడుతున్నకొద్దీ మహారాష్ట్ర రాజకీయ సమీకరణలు కొత్త రూపు తీసుకుంటున్నాయి. ఏడాది కిందటనే ఒంటరిగా పోటీచేస్తామని ప్రకటించి, బీజేపీపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టిన శివసేన ఇప్పుడు బీజేపీతో పొత్తుకు సై అంటున్నది. కాంగ్రెస్-ఎన్సీపీ కూటమిని ఎదుర్కోవాలంటే హిందూ ఓటు బ్యాంకు చీలకుండా చూసుకోవాలని సేన భావిస్తున్నది. యూపీ తర్వాత అతి ఎక్కువ ఎంపీ సీట్లున్న మహారాష్ట్రలో గెలుపు బీజేపీకి అత్యవసరం..

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

కర్ణాటక సంకీర్ణ ప్రభుత్వానికి బయటి నుంచే గాక, లోపలి నుంచీ సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రతిపక్ష బీజేపీ నుంచే గాక మిత్రపక్షం కాంగ్రెస్ నుంచీ కుమారస్వామి ప్రభుత్వం సమస్యలు ఎదుర్కొంటున్నది. అదనుచూసి బీజేపీ అధికారం చేపట్టేందుకు ఎమ్మెల్యేలను తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండగా, తక్కువ సంఖ్యాబలం ఉన్న జేడీ(ఎస్)కు సీఎం పదవి కట్టబెట్టడం సిద్ధరామయ్య వర్గీయులకు కంటగింపుగా ఉన్నది. ఈ నేపథ్యంలో కుమారస్వామి ప్రభుత్వం అడుగడుగునా అవరోధాలు ఎదుర్కొంటుండటం గమనార్హం.

ది హిందూ

ఉద్యమ-రాజకీయ నేత

నిరంతరం ఉద్యమాలతో, రాజకీయాలతో మమేకమైన అరుదైన స్వతంత్ర ఆలోచనాధార గల నాయకుడు జార్జి ఫెర్నాండెజ్ కన్ను మూయడం ఒక శకసమాప్తిని సూచిస్తున్నది. ప్రత్యేకిం చి కార్మికోద్యమాలలో, సోషలిస్టు రాజకీయాలలో ఆయన నిర్వహించిన క్రియాశీల పాత్ర విస్మరించలేనిది. తాను నమ్మిన వాదనను, ఎంచుకున్న మార్గాన్ని అత్యంత కఠోరంగా, ఉద్వేగభరితంగా ఆచరించే, అనుసరించే వ్యక్తిత్వం ఆయనది. ఈ పోరాట స్వభావం, చెదరని వ్యక్తిత్వమే ముంబయిలో పేవ్‌మెంట్లపై పడుకున్న ఆయనను కేంద్రమంత్రి స్థాయికి చేర్చింది. కేంద్ర మం త్రిగా ఉంటూనే విదేశాలలోని వేర్పాటు ఉద్యమాలకు ఊతం ఇవ్వడం ఆయనకే చెల్లింది. క్రైస్తవాలయంలో పూజారిగా శిక్షణ పొందుతున్న క్రమంలో అక్కడి పరిస్థితులను ఆమోదించలేక, ముంబయి పారిపోయినప్పుడు ఆయన వయసు పందొమ్మిదేండ్లు! ఆ గడ్డు కాలమే ఆయనను కరుడుగట్టిన ఉద్యమకారుడిగా మార్చింది. 1960 దశకం నుంచి ప్రతి దశాబ్దంలోనూ కాల పరిస్థితులకు అనుగుణంగా రూపుదిద్దుకుంటూపోయారు. మన దేశం ఒక్కో దశలో చవిచూసిన సంక్షోభాలకు, రాజకీయాలకు ఆయన నిరంతర పరిణామం అద్దం పడుతుంది. ఫెర్నాండెజ్ ఆయా కాలాలలో నిర్వహించిన పాత్రపై విమర్శలు ఉండవచ్చు. ఆయన భావజాలంతో అందరూ ఏకీభవించకపోవచ్చు. తొలిదశాబ్దాల ఉద్యమ జీవితానికి, చివరిదశ రాజకీయాలకు పొంతన కుదరకపోవచ్చు. కానీ జార్జి ఫెర్నాండెజ్ జీవితాన్ని దేశ పరిణామాల నుంచి విడదీసి చూడలేము.

ముంబయిలో అడుగుపెట్టిన అనతికాలంలో రామ్ మనోహర్ లోహియా సోషలిస్టు రాజకీయాలతో ఫెర్నాండెజ్ ప్రభావితులయ్యారు. అప్పటికే బలమైన కాంగ్రెస్ నాయకులకు, కమ్యూనిస్టు ఉద్యమయోధులకు ముంబయి వేదిక. కానీ ఫెర్నాండెజ్‌లోని ఉద్వేగం, కఠోర శ్రమ వారిని అధిగమించేవిధంగా చేసినయి. టాక్సీ డ్రైవర్ల సంఘాన్ని బలమైందిగా తీర్చిదిద్ద డం ఆయన ఉద్యమాలకు మొదటి మెట్టు. 19 50, 60 దశకాలలో అనేక బందులు, సమ్మెలు నిర్వహించారు. అనేకసార్లు శిక్షలు పడ్డాయి. ముంబయి కార్మికవర్గంతో ఎంతగా మమేకమయ్యారంటే, ముంబయిలో కిరీటం లేని మహారాజుగా వెలుగుతున్న కాంగ్రెస్ ఘనాపాటిని 1967 లోక్‌సభ ఎన్నికలలో ఫెర్నాండెజ్ మట్టి కరిపించారు. ఈ విజయంతో ఫెర్నాండెజ్ జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు. ఒకవైపు ఇందిరాగాంధీ బలమైన, జనాకర్షణ గల నాయకత్వం. మరోవైపు భిన్న సైద్ధాంతిక రాజకీయపక్షాల పోరాటం. దేశవ్యాప్తంగా వివిధ వర్గాలలో అనిశ్చితి, అసంతృప్తి ఉద్యమాలుగా పెల్లుబుకుతున్న కాలమది. 1974లో ఫెర్నాండెజ్ నాయకత్వంలోని రైల్వే మెన్స్ ఫెడరేషన్ జరిపిన సమ్మె తదనంతర దేశ రాజకీయాలను ప్రభావితం చేసింది. ఇరువై రోజుల పాటు రైళ్ళు నిలిచిపోయాయి. ఆ తర్వాత జయప్రకాశ్ నారాయణ్ కేం ద్ర బిందువుగా రాజకీయపక్షాల ఆందోళన మొదలైంది. 1975 జూన్‌లో ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించారు. ప్రతిపక్ష నాయకులను జైలులో పెట్టారు గానీ ఫెర్నాండెజ్ దొరుకలేదు. సోషలిస్టు రాజకీయాలలో ఉన్నా ఆయనది కమ్యూనిస్టులను పోలిన ఉగ్రవాద పోకడ. ఇందిరాగాంధీ సభా వేదికల దగ్గర పేలుళ్లు జరిపించడానికి కుట్ర పన్నారనేది ఆయనపై ఆరోపణ. ఎమర్జెన్సీ విధించిన ఏడాదికి ఆయన దొరికారు. బరోడా డైనమైట్ కేసులో ఆయన ముద్దాయి. ఆయన జైలులో ఉంటూనే 1977 ఎన్నికలలో జనతాపార్టీ అభ్యర్థిగా పోటీచేశారు. సంకెళ్ళతో ఉన్న ఫెర్నాండెజ్ పోస్టర్లతో ప్రచారం సాగింది. మూడు లక్షల మెజార్టీతో ఆయన విజయం సాధించి లోక్‌సభలో అడుగుపెట్టి పరిశ్రమల మంత్రి అయ్యారు. దీంతో ఆయన ఉద్యమకారుడి స్థానంలో కొత్త రాజకీయ నాయకుడు అవతరించాడు.

1970 దశకానికి ముందు తర్వాత ఫెర్నాండెజ్‌లో మార్పు కనిపిస్తుంది. 1969లో సంయుక్త సోషలిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా, ఆ తర్వాత 1973లో సోషలిస్టు పార్టీ చైర్మన్‌గా బాధ్యత లు చేపట్టారు. కానీ ఆయన ఇందిరాగాంధీ వ్యతిరేకిగా, కాంగ్రెస్‌కు బద్ధ విరోధిగా ఉన్నంతగా, ముంబయిలో ప్రైవేటు పరిశ్రమల పురోగతిని అడ్డుకోలేదు. ఒక నిలకడైన రాజకీయ విధానాన్ని కొనసాగించలేకపోయారు. మొరార్జీ దేశాయికి అనుకూలంగా పార్లమెంటులో అనర్గళంగా ప్రసంగించి, ఆ మరుసటి రోజే ఫిరాయించడం విమర్శలకు తావిచ్చింది. జనతాదళ్ ఏర్పాటులోనూ ఆయన ప్రధాన పాత్ర పోషించారు.

1970 దశకానికి ముందు తర్వాత ఫెర్నాండెజ్‌లో మార్పు కనిపిస్తుంది. 1969లో సంయుక్త సోషలిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా, ఆ తర్వాత 1973లో సోషలిస్టు పార్టీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. కానీ ఆయన ఇందిరాగాంధీ వ్యతిరేకిగా, కాంగ్రెస్‌కు బద్ధ విరోధిగా ఉన్నంతగా, ముంబయిలో ప్రైవేటు పరిశ్రమల పురోగతిని అడ్డుకోలేదు. ఒక నిలకడైన రాజకీయ విధానాన్ని కొనసాగించలేకపోయారు. మొరార్జీ దేశాయికి అనుకూలంగా పార్లమెంటులో అనర్గళంగా ప్రసంగించి, ఆ మరుసటి రోజే ఫిరాయించడం విమర్శలకు తావిచ్చింది. జనతాదళ్ ఏర్పాటులోనూ ఆయన ప్రధాన పాత్ర పోషించారు. కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా అత్యంత బలంగా ఉన్నప్పుడు, ఎమర్జెన్సీని వ్యతిరేకించిన క్రమంలో, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, సోషలిస్టు నేతలు పరిమిత అవగాహనతో జనసంఘ్‌తో చేతులు కలిపారు. కానీ ద్వంద్వ సభ్యత్వ వివాదం రాగానే దూరమయ్యారు. వీపీ సింగ్ కమ్యూనిస్టుల నుంచి, బీజేపీ నుంచి ఏక కాలంలో మద్దతు పొందినా, సంఘ పరివార్ రాజకీయాలను వ్యతిరేకిస్తూ పదవిని త్యాగం చేశారు. కానీ జనతాదళ్ చీలికల తర్వాత బీజేపీతో అనుబంధం పెంచుకున్న తీరు ఆశ్చర్యకరమైందే. ఫెర్నాండెజ్ వంటి ఉన్నత స్థాయి ఉద్యమకారులు, రాజకీయ నాయకులు నిర్వహించిన పాత్ర మంచి చెడులు, తప్పొప్పులు చర్చానీయాంశాలు. కానీ ఎమెర్జెన్సీ కాలమైనా, సంకీర్ణ యుగ రాజకీయాలైనా- ఏది చర్చించినా ఫెర్నాండెజ్ పాత్రను విస్మరించలేము.

జనగళం

వాహనాల సంఖ్య పెంచాలె

ప్రభుత్వ దవాఖానల నుంచి మృతదేహాలను తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పార్థీవ వాహనాలను ఏర్పాటుచేసింది. రాష్ట్రంలో ఏ మూలకైనా ఉచితంగా మృతదేహాలను తరలిస్తున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత టీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న గొప్ప పథకాల్లో ఈ పథకం కూడా ఒక్కటి. గాంధీ, ఉస్మానియా, నిమ్స్ దవాఖానల్లో ఈ పథకం కొనసాగుతున్నది. పేద ప్రజలకు ఈ పథకం వరంగా మారింది. అయితే కొన్ని వాహనాలు చెడిపోగా కొన్ని వాహనాలు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. ప్రభుత్వం చెడిపోయిన వాహనాలకు మరమ్మతులు నిర్వహించి పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలా చూడాలి. దీంతో పాటు వాహనాల సంఖ్యను కూడా పెంచాల్సిన అవసరం ఉన్నది. జిల్లాకు రెండు మూడు చొప్పున పార్థీవ వాహనాలను ఏర్పాటుచేస్తే పేద ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

- పుల్కం సంపత్‌కుమార్, రాములపల్లి, జగిత్యాల జిల్లా

విలువల ఎజెండాగా ఉండాలె

ఈ మధ్యకాలంలో ప్రతి రాజకీయపార్టీ అభివృద్ధిని గురించి చెబుతూ ఓట్లు అడుగుతున్నాయి. పార్టీలన్నీ పోటీపడి అభివృద్ధి జపాన్ని చేస్తున్నాయి. జరుగుతున్న అభివృద్ధి తీరు ఎలాగున్నదో, దాని పర్యవసానాలు ఎలా ఉన్నాయో, ఉండాలో ఎవరూ అడుగటం లేదు. సమాజ ఔన్నత్యం కేవలం మౌలిక వనరుల కల్పనలోనే ఉండదు. భౌతిక అవసరాలు తీర్చటంతోనే సరిపోదు. అంతకు మించి మానవ సమాజాన్ని ఉన్నత మానవీయ విలువల పునాదులపై నిలుపాల్సిన బాధ్యత పాలకులది. కానీ నేడు ఎవరూ మానవీయ సమాజం, విలువల గురించి ఆలోచించటం లేదు. చెప్పటం లేదు. ఈ విధమైన ఆలోచనా తీరుతోనే నేటి నవనాగరిక సమాజం హింసాత్మకమైపోయింది. నానాటికీ మహిళలపై హింసా దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయి. చిన్నపిల్లలపై సైతం లైంగిక దాడులు జరుగుతున్నాయి. దీనికి కారణమేమిటో, నివారణ ఎప్పుడో, ఎలాగో ఎవరూ చెప్పటం లేదు, ఆ దిశగా ఆలోచించకపోవటం విషాదం.

అందరి లక్ష్యం, గమ్యం మానవీయ సమాజం కావాలి. దానికి సామాజికంగా సమున్నత విలువల నిర్మాణం కోసం కృషి జరుగాలి. ఈ దిశగా అందరూ ఆలోచించాలి. అడుగులు వేయాలి.

- కె.రమాదేవి, కరీంనగర్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

ఆలోకన



టంకశాల అశోక్

ఈవీఎం ఫలితాలే బ్యాలట్లోనూ..

ఈవీఎంలు ఉపయోగించిన అసెంబ్లీ ఎన్నికలలో ఎటువంటి ఫలితాలు వచ్చాయో, బ్యాలట్ పత్రాలు వాడిన పంచాయతీ ఎన్నికల్లనూ అటువంటి ఫలితాలే వచ్చాయి. ప్రజలకు టీఆర్‌ఎస్ పట్ల గల ఆదరణ రెండు పద్ధతుల్లోనూ ఒకే తీరుగా వెల్లడైన స్థితిలో కాంగ్రెస్ కూటమికి ఇంకా మిగిలిన ఫిర్యాదులు ఏమైనా ఉన్నాయేమో తెలియదు. వారు తమ ఓటమికి కారణాలు ఏమిటో సీరియస్ సమీక్షలు చేసుకొని దిద్దుబాటు చర్యలు చేపట్టడానికి బదులు హాస్యాస్పదమైన సాకులు వెతికే పరమ అసమర్థతను చూసి వారిపై జాలి కూడా కలగటం లేదు.

అసెంబ్లీ ఫలితాలు డిసెంబర్ 11న వెలువడినప్పుడు కాంగ్రెస్ తెలంగాణలో ఓడిపోగా రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో గెలిచింది. అన్నిచోట్ల కూడా ఎన్నికల సంఘం ఈవీఎంలనే వాడింది. కానీ తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం తక్కిన మూడు రాష్ర్టాలలో తాము గెలిచినందున అక్కడి ఈవీఎంల ఫలితాలను ఆమోదించి, తెలంగాణలో ఓడారు గనుక ఇక్కడి ఈవీఎంలు మాత్రం లోపాలతో కూడుకున్నవని విమర్శించటం మొదలు పెట్టారు. ఇందులోని కపటత్వం స్పష్టంగా కనిపిస్తున్నదే అయినా, ఓడిపోయిన బాధలో అట్లా మాట్లాడుతున్నారు లెమ్మని అందరూ ఉపేక్షించి ఉంటారు. కానీ అప్పటినుంచి నెలన్నర గడిచినా వారి ధోరణి మారలేదు. జనవరి మూడవ వారంలో ఇందిరా పార్కు వద్ద ధర్నా జరి పి అదే మాట మరింత గట్టిగా అన్నారు. ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ అవినీతిపరుడని పరోక్షంగా ఆరోపించి ఆయన ఆస్తులపై దర్యా ప్తు జరిపించాలనే డిమాండ్ వరకు వెళ్లారు. ఈ ధర్నా నాటికి పంచాయతీ ఎన్నికల తీరు ఏకాభిప్రాయాల్లో, ఇతరత్రా కూడా తెలువటం మొదలైపోయింది. అయినప్పటికీ కాంగ్రెస్ కూటమి నాయకులకు అదే తరహా లో మాట్లాడేందుకు ఎటువంటి సంకోచాలు, బిడియాలు లేకపోయాయి.

పరిస్థితి ఏమిటో వారికి బోధపడేటట్లు చేయటానికి డిసెంబర్ 15-జనవరి 20 మధ్య పలు వ్యాఖ్యానాలు వెలువడ్డాయి. ఎన్నికల సంఘం ఇచ్చిన వివరణలు గాక మీడియా వ్యాఖ్యాతలు చాలానే చెప్పారు. ఈవీఎంల చరిత్ర గురించి, రాజస్థాన్ తదితర రాష్ర్టాల ఫలితాల గురించి బాగానే దృష్టికి తెచ్చారు. అయినప్పటికీ తెలంగాణ కాంగ్రెస్‌కు తమ తీరును మార్చుకోవటం అవసరమని తోచలేదు. మరొకవైపు చూస్తే, ఎన్నికల ఫలితాలను సమీక్షించుకొని తగు చర్యలు తీసుకోగలమని వారు డిసెంబర్ 11 తర్వాత కొద్ది రోజుల పాటు అనకపోలేదు. అందుకోసమని చెప్తూ హైదరాబాద్‌లో, ఢిల్లీలో కొద్దిసార్లు సమావేశమయ్యారు కూడా. కానీ దేనిపై సమీక్షలు జరిపారో, ఏమి కనుగొని ఏమి నిర్ణయించుకున్నారో మనకు ఈ రోజువరకు తెలియదు. ఈవీఎంలపై, ఎన్నికల సంఘంపై విమర్శలను యథావిధిగా కొనసాగించటం ఒక్కటే మనకు కన్పించింది. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ గురించి తెలిసినవారికి, వారు తమ ఓటమిపై సీరియస్ సమీక్షలు చేసుకొనగలరని గాని, దిద్దుబాటు చర్యలు చేపట్టగలరని గాని ఎప్పుడూ అన్పించలేదు. ఎందువల్ల? కాం గ్రెస్ పార్టీ తరచు ఓడిపోవటం 1970లలో ఇందిరాగాంధీ కాలం నుంచి మొదలైంది. ఓడిన ప్రతిసారి జాతీయస్థాయిలో గాని, ఆయా రాష్ర్టాల స్థాయిలో గానీ సమీక్షలు అంటూ కమిటీలు వేయటం, వాటి నివేదికల ను బీరువాలలో దాచటం తప్ప మరేమీ లేకపోవటం ఒక ఆనవాయితీ గా మారింది. ఇటీవలి కాలంలో అసలు కమిటీలు వేస్తున్నదీ లేనిదీ తెలియని దశ వచ్చింది. వర్కింగ్ కమిటీలో నాలుగు మాటలు చెప్పుకొని ముగిస్తారు.

కాంగ్రెస్ వంటి పెద్దపార్టీ, సుదీర్ఘ చరిత్ర గల పార్టీ, భవిష్యత్తుపై ఆశ లున్న పార్టీ చేయవలసిన పని కాదిది. అయినప్పటికీ ఈ తీరు రాహుల్ గాంధీ అధ్యక్షుడు కాకముందు ఏ విధంగా తయారైందో ఇప్పటికీ అదే విధంగా కొనసాగుతున్నది. సీరియస్ సమీక్షలు, తదనంతర చర్యలు ఎందుకు అవసరమో వీరికి తెలియక కాదు. కానీ ఈ పని చేసే నిజాయితీ, ధైర్యం నాయకత్వానికి లోపించాయి. సమీక్ష చేయటమంటే అద్దంలో తమ మొహాలను చూసుకోవటం. తదనంతర చర్యలు అంటే తమ లోపాలను అంగీకరించి చికిత్సలు చేసుకోవటం. ఈ రెండూ చేయగల తరం కాంగ్రెస్‌లో గడిచిపోయింది. ఇప్పటి తరాలకు అర్థమయ్యే భాష అధికారం, అందుకు ఎత్తుగడలు మాత్రమే. ఆత్మస్తుతి, పరనింద మాత్ర మే. ఈ విధంగా పరిణామ క్రమానికి లోనై పతనమవుతున్న కాంగ్రెస్‌కు తమ ఓటమిలో హాస్యాస్పదమైన సాకులు మాత్రమే కన్పిస్తాయి. జాతీ య నాయకత్వమే మరుగుజ్జుగా మారినప్పుడు రాష్ర్టాల నాయకత్వాలు ఆజానుబాహువులు కాగలవని ఆశించగలమా? ఈ స్థితినుంచి కాంగ్రెస్‌ను కాపాడగల నాయకత్వాలు కన్పించటం లేదు. ఇంచుమించు 15 సంవత్సరాల ప్రత్యక్ష రాజకీయ పాత్రలో అరడజను ఓటములు ఒకటీ అరా విజయాల పద్ధతిలో గాలివాటున సాగటం తప్ప పార్టీని మూలాల నుంచి ఉద్ధరించలేక పోయిన రాహుల్ గాంధీ, గాలివాటు విజయాలు మరికొన్ని సాధిస్తే సాధించవచ్చుగాని, పార్టీ సిద్ధాంతాలను, యంత్రాంగాన్ని, వ్యవహరణను జనామోదం పొందగల విధంగా సంస్కరించగలరన్న ఆశలు ఏమీ లేవు. ఇటువంటి 'ప్రాణాంతక వ్యాధి'తో కునారిల్లుతున్న కాంగ్రెస్‌ను ప్రియాంక గాంధీ ఏదో చేయగలరనుకోవటం ఒక పెద్ద భ్రమ.

తిరిగి తెలంగాణకు వస్తే, పై తరహాలో గల జాతీయ కాంగ్రెస్ నాయకత్వం ఇక్కడి పార్టీని దారిలో పెట్టగల అవకాశం కన్పించటం లేదు. స్వయంగా ఇక్కడ కూడా ఆ స్థాయి, వివేకం, దార్శనికత, సమర్థత గల నాయకులెవరూ కన్పించరు. ఒకవేళ పొరపాటున అటువంటి లక్షణాలు ఏ వ్యక్తిలోనైనా కన్పించినా తక్కినవారు ఆ వ్యక్తి మొహంపై దిండును అదిమి ఊపిరాడకుండా చేసి ప్రాణాలు తీయగలరు. ఇప్పుడు వీరందరికి కావలసింది ఒకప్పటి తమ ఘనమైన పార్టీ తిరిగి ఘనంగా మారటం కాదు. వారందరికి అధికారం, డబ్బు కావాలి. అందుకోసం షార్ట్‌కట్లు కావాలి. వాటికోసం అయితే కాంగ్రెస్, లేదంటే మరొక పార్టీ. అందుకోసమని చివరకు తెలంగాణ ప్రజలు అసహ్యించుకునే టీడీపీ అయినా ఆలింగనం చేసుకోగలరు. తమ పార్టీ బాగు పడటం కన్నా ఇటువంటి ప్రయోజనాలు ముఖ్యమైన కాలం ఎప్పుడో వచ్చివేసింది. అటువంటి వారికి ఎన్నికల ఓటమిపై సీరియస్ సమీక్షలు, దిద్దుబాటు చర్యలు ఎట్లా సరిపగడలవు. రెండింటికి పూర్తిగా చుక్కెదరు.

ఇటువంటి తార్కిక, తాత్విక స్థితినుంచి వచ్చినటువంటిదే ఈవీఎంలపై, ఎన్నికల కమిషన్‌పై ఈ రోదనా ప్రక్రియ. చివరికి బ్యాలట్లు ఉపయోగించిన పంచాయతీ ఎన్నికల్లోనూ అదే తరహా ఫలితాలు వెల్లడవుతున్నప్పటికీ అదే రోదనను కొనసాగించటం మినహా మరేమీ చేయాలో తెలియని నిస్సహాయ పరిస్థితి. వీరి తీరును చూడగానే ఒక సందేహం కలుగుతున్నది. మరికొద్ది మాసాలలో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్నాయి. వాటిలో అసెంబ్లీ ఫలితాలు పునరావృతం కాగలవని అధికార పక్షమైన టీఆర్‌ఎస్ ధీమాగా ప్రకటిస్తున్నది. అటువంటిది కాంగ్రెస్ మాట వరుసకైనా చేయలేకపోతున్నది. ఆ సరికి సహకార సంఘాల వంటి మరికొన్ని ఎన్నికలు జరుగనున్నాయి. వాటి ఫలితాలు, లోక్‌సభ ఫలితాలు ఏ విధంగా ఉండవచ్చునో ఎవరైనా ఊహించగలరు. అసెంబ్లీ వలెనే లోకసభ ఎన్నికలు కూడా ఈవీఎంలతోనే జరుగుతాయని ఎన్నికల సంఘం ప్రకటిస్తున్నది. ఇటువంటి పరిస్థితుల మధ్య, తమ లోక్‌సభ ఓటమికి కూడా కాంగ్రెస్ ముందస్తు సాకులు వెతుకుతున్నట్లు అనుమానం కలుగుతున్నది. అందులో భాగంగానే ఈవీఎం విమర్శలు మరింత పెంచటం, టీఆర్‌ఎస్ అభ్యర్థుల ఎన్నికపై కోర్టులలో వరుస పిటిషన్లు వేయటం వంటివి ఒక పద్ధతి ప్రకారం మొదలుపెట్టారు. వారి బలహీనతను ఆవిధంగా బయటపెట్టుకుంటున్నారు. కానీ ఇటువంటి ధోరణి వల్ల పార్టీ బలపడబోదని, ప్రజాదరణ మరింత తగ్గుతుందని తెలుసుకోవటం లేదు.

మరికొద్ది మాసాలలో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్నాయి. వాటిలో అసెంబ్లీ ఫలితాలు పునరావృతం కాగలవని అధికార పక్షమైన టీఆర్‌ఎస్ ధీమాగా ప్రకటిస్తున్నది. అటువంటిది కాంగ్రెస్ మాట వరుసకైనా చేయలేకపోతున్నది. ఆ సరికి సహకార సంఘాల వంటి మరికొన్ని ఎన్నికలు జరుగనున్నాయి. వాటి ఫలితాలు, లోక్‌సభ ఫలితాలు ఏ విధంగా ఉండవచ్చునో ఎవరైనా ఊహించగలరు. అసెంబ్లీ వలెనే లోకసభ ఎన్నికలు కూడా ఈవీఎంలతోనే జరుగుతాయని ఎన్నికల సంఘం ప్రకటిస్తున్నది. ఇటువంటి పరిస్థితుల మధ్య, తమ లోక్‌సభ ఓటమికి కూడా కాంగ్రెస్ ముందస్తు సాకులు వెతుకుతున్నట్లు అనుమానం కలుగుతున్నది. అందులో భాగంగానే ఈవీఎం విమర్శలు మరింత పెంచ టం, టీఆర్‌ఎస్ అభ్యర్థుల ఎన్నికపై కోర్టులలో వరుస పిటిషన్లు వేయటం వంటివి ఒక పద్ధతి ప్రకారం మొదలుపెట్టారు.

కేసీఆర్‌కే ఆ క్రెడిట్

విశ్లేషణ



ఇలపావులూరి మురళీమోహన రావు

రజనీకాంత్ సినిమా భాషలో ఒక డైలాగ్ చాలా పాపులర్. 'ఆ దేవుడు ఆదేశిస్తాడు.. ఈ భాషా పాటిస్తాడు'. ఇది కేవలం సినిమా డైలాగ్. అభిమానులను మెప్పించడానికి రజనీకాంత్ ఆ శైలిలో డైలాగ్ ఇప్పటికీ వినిపిస్తూనే ఉంటుంది.

ఇక నిజ జీవితంలోకి వస్తే.. ఈ రోజు పాపులర్ డైలాగ్ ఏమంటే 'కేసీఆర్ ప్రారంభిస్తాడు.. దేశమంతా పాటిస్తుంది!' నిజమే కదా! ఇవాళ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఏ సంక్షేమ పథకాన్ని ప్రారంభించినా, దేశమంతా దాన్ని కాపీ కొట్టడానికి ప్రయత్నిస్తున్నది. రాష్ర్టాల్లో అయినా, కేంద్రంలో అయినా, అధికారంలోకి రాకముందు రైతుల గురించి, వ్యవసాయం గురించి గిరీశం తరహా లెక్చర్లు దంచే రాజకీయ నాయకులకు కొదువ లేదు. కానీ, అధికారంలోకి రాగానే ఇక రైతుల గురించి మరిచిపోతారు. వ్యవసాయం దండుగ అని తేల్చేస్తారు. పారిశ్రామికవేత్తల వెంట పడుతారు. వారికి అడక్కుండానే బోలెడు రాయితీలు ఇస్తారు. పారిశ్రామికవేత్తల ఇంట్లో బాలసారె, అన్నప్రాసన జరిగినా పరిగెత్తుకుంటూ వెళ్తారు. వాళ్లతో విందులు కుడుస్తారు. స్వతంత్రం వచ్చిన గత డెబ్బై ఏండ్లలో వేలాదిమంది రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. పంటలు పండక, పండిన పంటలకు గిట్టుబాటు ధరలు రాక, పెట్టుబడులు లేక, ప్రభుత్వాలు ఆదుకోక, అన్నదాతలు ఉసురు తీసుకుంటున్నారు. కానీ, ఏనాడైనా ఒక్క పారిశ్రామికవేత్త ఆత్మహత్యకు పాల్పడటం విన్నామా? పచ్చని పొలాలను ఆక్రమించి అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామంటారు. ఏదైనా పరిశ్రమను మూసేసి ఆ స్థలంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం ఎన్నటికీ జరుగదు. పంటలు పండే భూములను ఆక్రమిస్తే అదేమీ అభివృద్ధో తెలియదు.

స్వయంగా రైతు కావడంతో రైతుల కష్టాలు, కడగండ్లు కేసీఆర్‌కు బాగా తెలుసు. అందుకనే రైతుబంధు పథకం పేరుతో నేరుగా రైతుల ఖాతాల్లోనే పంటసాయం కోసం రెండు విడుతలుగా ఏడాదికి రూ.8 వేలు అందిస్తామని చెప్పగానే దేశం మొత్తం ఆశ్చర్యపోయింది. అప్పటివరకూ రైతుల గురించి ఈ విధమైన ఆలోచన చేసిన ముఖ్యమంత్రి లేడు! ఇది సాధ్యమా? బడ్జెట్ సరిపోతుందా? అని సందేహాలు తలెత్తాయి. కొందరు కుత్సితులు ఓట్ల కోసం రైతులకు ఇచ్చే లంచం అంటూ ఈ పథకాన్ని విమర్శించారు. రైతులకు ఇస్తారు.. మరి కౌలు రైతుల సంగతి ఏమిటి? అంటూ కోడిగుడ్డు మీద ఈకలు పీకారు మరికొందరు. దానికేదైనా పరిష్కారం ఉంటే ఆలోచించాలె తప్ప అధిక సంఖ్యలో రైతులకు మేలుచేసే కార్యక్రమాన్ని విమర్శించడం ఎంతవరకు సబబో వారే ఆత్మవిమర్శ చేసుకోవాలి.

కేసీఆర్ ప్రారంభించిన రైతుబంధు పథకం లక్షలాది మంది రైతులకు ఎంతో మేలుచేసిందని చెప్పడానికి సందేహించాల్సిన పనిలేదు. మొన్నటి శాసనసభ ఎన్నికల్లో ఈ విషయం నిర్ద్వంద్వంగా రుజువైంది. 99 శాతం మంది రైతులు కేసీఆర్‌కు జై కొట్టారు. ఊహించని విజయాన్ని కట్టబెట్టి ఆశీర్వదించారు. ఆహారధాన్యాల ఉత్పత్తిలో తెలంగాణ గణనీయమైన ప్రగతిని సాధించింది. అలాగే నిన్న జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కూడా 80 శాతం విజయాన్ని టీఆర్‌ఎస్ నమోదు చేసింది. చివరికి ఈ పథకం ప్రభావం ఎంతమేరకు వెళ్లిందంటే, కేంద్ర ప్రభుత్వం కూడా రైతుబంధు పథకాన్ని దేశం మొత్తం అమలుచేయాలని ప్రయత్నిస్తున్నది. పశ్చిమ బెంగాల్, ఒడిషా ప్రభుత్వాలు కూడా రైతుబంధు పథకం పట్ల ఆకర్షితులై వారి రాష్ర్టాల్లో అమలుచేయాలని ప్రయత్నిస్తున్నాయంటే ఆ క్రెడిట్ కచ్చితంగా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌దే.

ఇక కేసీఆర్ అమలుచేస్తున్న ఆర్థిక విధానాలు భేషుగ్గా ఉన్నాయని మొన్ననే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ ఛైర్మన్ విజయ్ కేల్కర్ ప్రకటించారు. ప్రస్తుత దేశ ఆర్థిక విధానాలు అసమతుల్యంగా ఉన్నాయని, వీటిలో మార్పు జరిగి దేశం పురోగమించాలంటే కేసీఆర్ ప్రతిపాదించిన నూతన ఆర్థిక విధానమే శరణ్యమని ప్రశంసించారు. దేశం మొత్తం ఇలాంటి విధానాలను అనుసరించాలని కూడా ఆయన కితాబిచ్చారు. ఇక కేసీఆర్ మదిలో పురుడు పోసుకున్న మరో అద్భుత పథకం కంటివెలుగు. ఉచితంగా కంటి పరీక్షలు చేయడమే కాకుండా అద్దాలు కూడా అందిస్తున్నారు. వంద రోజుల కిందట ప్రారంభించిన ఈ పథకం ద్వారా ఇప్పటికే సుమారు కోటి నలభై లక్షల మంది లబ్ధి పొందారు. త్వరలో ఈ విధానం దేశమంతా అనుసరించినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు.

ఇక పాలనాపరంగా కూడా కేసీఆర్ అనేక విజయాలను నమోదు చేస్తున్నారు. గత నాలుగేండ్లుగా వివాదాల్లో ఉన్న బైసన్ పోలో గ్రౌండ్‌లో తెలంగాణ సచివాలయ నిర్మాణానికి హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వంతో అనేకమార్లు ఈ విషయం మీద చర్చలు జరిపిన కేసీఆర్ చివరికి విజయం సాధించారు. అలాగే మొన్ననే పాలమూరు ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర అటవీశాఖ నుంచి అనుమతులు సాధించడంలో కేసీఆర్ తన చాణక్యాన్ని ప్రదర్శించి అబ్బురపరిచారు.

రాజకీయంగా, పాలనాపరంగా కేసీఆర్ ఇన్నిన్ని విజయాలను ఎలా సాధించగలుగుతున్నారని ప్రశ్నించుకుంటే దొరికే జవాబు ఒక్కటే. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉన్నది. సమాజంలోని అన్ని వర్గాలవారికి ఉపకారం చెయ్యాలనే తపన ఉన్నది. పనుల్లో నిజాయితీ ఉన్నది. అందుకే ఆయన నిర్భీతిగా తన పథకాలను, కార్యక్రమాలను అమలు చేసుకుంటూ పోతున్నారు. నూతిలో నివసించే కప్పలకు సూర్యుడి గురించి తెలియదంటుంది శాస్త్రం. కేసీఆర్ విజన్ గురించి గ్రహింపు లేనివారికి, రాజకీయ కువిమర్శలు చేసేవారికి కేసీఆర్ ప్రతిభాపాటవాన్ని అంచనా వేయడం ఎలా సాధ్యమతుంది? చేసిన మంచి కార్యాల గురించి చెప్పుకోకుండా ఉండటం గొప్పవారి లక్షణం అన్నట్లు ఎన్ని విజయాలు సాధించినా వేరే ఎవరో వాటిగురించి లోకానికి చెప్పాల్సిందే తప్ప కేసీఆర్ స్వయంగా డప్పు వాయించుకోరు. అదొక ఉత్తమ లక్షణం.

కృషితో నాస్తి దుర్భిక్షమని ఆర్యులు నుడివినట్లు.. మన వంతు ప్రయత్నం మనం చేస్తే దైవం అనుకూలిస్తుందని మనసా వాచా కర్మణా నమ్మినవాడు కాబట్టి కేసీఆర్‌కు వరుసబెట్టి విజయాలు లభిస్తున్నాయి. రాబోయే అయిదేండ్ల పాలనలో కేసీఆర్ కలలుగన్న బంగారు తెలంగాణ సాకారమవుతుందనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. దేశం మొత్తం కేసీఆర్ విధానాలను అనుసరిస్తుందని చెప్పడంలో కూడా వెనుకాడాల్సిన అవసరం లేదు.

రాజకీయంగా, పాలనాపరంగా కేసీఆర్ ఇన్నిన్ని విజయాలను ఎలా సాధించగలుగుతున్నారని ప్రశ్నించుకుంటే దొరికే జవాబు ఒక్కటే. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉన్నది. సమాజంలోని అన్ని వర్గాలవారికి ఉపకారం చెయ్యాలనే తపన ఉన్నది. పనుల్లో నిజాయితీ ఉన్నది. అందుకే ఆయన నిర్భీతిగా తన పథకాలను, కార్యక్రమాలను అమలు చేసుకుంటూ పోతున్నారు. నూతిలో నివసించే కప్పలకు సూర్యు డి గురించి తెలియదంటుంది శాస్త్రం. కేసీఆర్ విజన్ గురించి గ్రహింపు లేనివారికి, రాజకీయ కువిమర్శలు చేసేవారికి కేసీఆర్ ప్రతిభాపాటవాన్ని అంచనా వేయడం ఎలా సాధ్యమతుంది? చేసిన మంచి కార్యాల గురించి చెప్పుకోకుండా ఉండటం గొప్పవారి లక్షణం అన్నట్లు ఎన్ని విజయాలు సాధించినా వేరే ఎవరో వాటిగురించి లోకానికి చెప్పాల్సిందే తప్ప కేసీఆర్ స్వయంగా డప్పు వాయించుకోరు. అదొక ఉత్తమ లక్షణం.

(వ్యాసకర్త: సీనియర్ రాజకీయ విశ్లేషకులు)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



బుధవారం నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం పొతంగల్‌లో ఓటేసినట్టు చూపుతున్న ఎంపీ కల్వకుంట్ల కవిత, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాంకిషన్‌రావు



ఖమ్మం జిల్లా కొణిజర్ల మండల కేంద్రంలో ఓటు వేసేందుకు భారీగా క్యూలో నిల్చున్న ఓటర్లు



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రాంతంలో ఓట్లు వేసిన గిరిజన మహిళలు

గులాబీ గుబాళింపు

తుదివిడుతలోనూ టీఆర్ఎస్ మద్దతుదారుల హవా • అత్యధిక స్థానాలు కైవసం

- వికారాబాద్ జిల్లా కులకచర్ల మండల పరిధిలోని కామునిపల్లిలో వార్డుసభ్యుడిగా పోటీచేసి నాలుగు రోజుల క్రితం చనిపోయిన రామయ్య తన ప్రత్యర్థిపై 16 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.
- వికారాబాద్ జిల్లా పరిగి మండలం మిట్ట కోడూర్‌లో కోరె వెంకటమ్మ (65) అనే వృద్ధురాలు పోలింగ్ కేంద్రంలో ఓటువేసి బయటకు వచ్చిన అనంతరం గుండెపోటుతో మృతిచెందారు.
- ఓటరు లిస్ట్‌లో పేరు లేకపోవడంతో వికారాబాద్ జిల్లా కులకచర్ల మండలం సాల్వీడ్ గ్రామంలో 68 మంది గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తాము ఓటు వేశామని.. ఇప్పుడు ఎందుకు తొలగించారని మండిపడ్డారు.
- మహబూబ్‌నగర్ జిల్లా కోస్గి మండలం ముశ్రీఫా గ్రామంలో ఎన్నికల విధినిర్వహణలో గ్రామ వీఆర్వో నర్సప్ప(51) గుండెపోటుతో మృతిచెందారు. ఎన్నికల విధుల్లో ఉన్న వీఆర్వో నర్సప్పకు భోజన ఏర్పాట్లు చూసుకోవాలని ఉన్నతాధికారులు సూచించడంతో కూరగాయల కోసం కోస్గికి వెళ్తుండగా.. మార్గమధ్యంలో చాతినొప్పి వచ్చింది. దీంతో ఓ ప్రైవేట్ దవాఖానకు వెళ్లి అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు.
- మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం శివ్వారంలో పంచాయతీకి సర్పంచ్‌గా పోటీచేసిన అర్నె సమ్మయ్య 12 ఓట్లతేడాతో ఓడిపోవడంతో అతడి మేనమామ బద్రపు లింగయ్య (56) పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం అతడు మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో చికిత్సపొందుతున్నాడు.
- కామారెడ్డి జిల్లాలో మూడో విడతలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పెద్దకొడప్‌గల్ మండలం పోచారం గ్రామానికి చెందిన మణెవ్వ ఒక్క ఓటుతో విజయం సాధించారు. గ్రామంలో మొత్తం 327 ఓట్లు పోలయ్యాయి. మణెవ్వకు 164 ఓట్లు రాగా ఆమె ప్రత్యర్థి లక్ష్మీబాయికి 163 ఓట్లు వచ్చాయి.
- కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం బస్వాయిపల్లికి చెందిన ఫాతిమాబేగం ఒక్క ఓటుతో గెలుపొందారు. గ్రామంలో 348 ఓట్లు పోల్ అయ్యాయి. ఫాతీమా బేగంకు 172 ఓట్లు రాగా, సుల్తానా బేగంకు 171 ఓట్లు వచ్చాయి. ఐదు ఓట్లు చెల్లలేదు.
- నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం తిమ్మారెడ్డిగూడెం గ్రామ ఏకగ్రీవ ఎన్నికను రద్దు చేయాలని అదే గ్రామానికి చెందిన మేకల రాంరెడ్డి బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పంచాయతీ ఎన్నికల్లో దేశిరెడ్డి లక్ష్మి వేలంపాట ద్వారా రూ. 8లక్షలతోపాటు శ్మశానవాటికకు 8 గుంటల స్థలాన్నిఇచ్చి, సర్పంచ్ పదవి దక్కించుకున్నారని ఆరోపించారు.
- కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలంలోని కాట్రపల్లిలో ఓ సర్పంచ్ అభ్యర్థి కుటుంబసభ్యులు ఏడుగురు ఉండగా, ఆమెకు ఆరు ఓట్లే రావడం చర్చనీయాంశమైంది.
- మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం పెద్దంపేటలో ఇద్దరు అభ్యర్థులకు సమాన ఓట్లు రావడంతో టాస్ ద్వారా సర్పంచ్‌ను ఎన్నుకున్నారు. టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి తిరుమల సుగుణ, కాంగ్రెస్ బలపర్చిన పొట్టాల సుమలతకు సమానంగా 607 ఓట్ల చొప్పున రాగా అధికారులు టాస్ వేయగా సుమలతను పదవి వరించింది.
- సుల్తానాబాద్ మండలం కనుకుల పంచాయతీలో పోలు అంజయ్య రెండు ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.
- ధర్మారం మండలం కానంపల్లి గ్రామ సర్పంచ్‌గా మనీష(21) అత్యంత పిన్న వయసులో గెలుపొందారు. ఆమె ప్రస్తుతం వరంగల్‌లో శ్రీ చైతన్య మెడికల్ కళాశాలలో బీ-ఫార్మసీ చదువుతున్నారు.
- సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శ్రీరాములపల్లిలో వేముల వెంకవ్వ(75) ఒకటో బూత్‌లో ఓటేశాక.. తలతిరుగుతుందని చెప్పడంతో సిబ్బంది అక్కడే కూర్చోబెట్టారు. కుర్చీలోంచి కిందపడిపోయి అపస్మారకస్థితికి వెళ్లి మృతిచెందింది.
- రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం పద్మనగర్ గ్రామపంచాయతీలో ముదారి పోచయ్య ఒక్క ఓటుతో గెలుపొందారు. సమీప అభ్యర్థికి 174 ఓట్లు రాగా, తనకు 175ఓట్లు వచ్చాయి.

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: గ్రామ పంచాయతీ తుదివిడుత పోరులోనూ గులాబీ పార్టీ దూకుడును కొనసాగించింది. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మూడోవిడుత పంచాయతీ ఎన్నికల్లోనూ అత్యధికంగా టీఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులనే విజయం వరించింది. పంచాయతీలోనూ ప్రగతికే పట్టంకడుతూ ఓటరు మరోసారి తీర్పునిచ్చారు.

భద్రాద్రి కొత్తగూడెంలో గులాబీ హవా

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మూడోవిడుతలో 163 పంచాయతీలకుగాను 12 ఏకగ్రీవమయ్యాయి. 1,404 వార్డులకుగాను 210 పంచాయతీలు ఏకగ్రీవంకాగా ఏడువార్డులకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. మిగిలిన 151 పంచాయతీల్లో ఎన్నిక జరుగగా.. 87.23 శాతం పోలింగ్ నమోదైంది.. మొత్తం 163 సర్పంచ్ స్థానాల్లో 92 స్థానాలను టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు గెలిచారు.

ఖమ్మంలో కారు జోరు

ఖమ్మం జిల్లాలో 192 పం చాయతీలకుగాను 24 చోట్ల, 1740 వార్డుల్లో 245 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 168 పంచాయతీలు, 1495 వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు జరిగాయి. 192 పంచాయతీల్లో 114 మంది టీఆర్ఎస్, 49 మంది కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు విజయం సాధించారు.

మెదక్‌లో దూకుడు

- మెదక్ జిల్లాలో మూడోవిడుత ఎన్నికల్లో 90.28 శాతం పోలింగ్ నమోదైంది. 133 పంచాయతీలకు, 1031 వార్డు స్థానాలకు ఎన్నికలు జరిగాయి. 12 ఏకగ్రీవ గ్రామ పంచాయతీలను కలుపుకొని 115 స్థానాల్లో టీఆర్ఎస్, 10 పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందారు.
- సిద్దిపేట జిల్లాలో 90.73శాతం పోలింగ్ నమోదైంది. 122 సర్పంచ్ స్థానాలకుగాను 85 స్థానాల్లో టీఆర్ఎస్, 21 స్థానాల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు గెలిచారు.

పాలమూరులో గులాబీ హోరు

- వనపర్తి జిల్లాలో 87 పంచాయతీలకు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగా.. ఏడు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 80 స్థానాలకు ఎన్నికలు జరుగగా 62 స్థానాల్లో టీఆర్ఎస్(ఏకగ్రీవాలతో కలిపి), 23 చోట్ల కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందారు.
- మహబూబ్‌నగర్ జిల్లాలో 85.91శాతం పోలింగ్ నమోదైంది. 227 పంచాయతీలకుగాను 24 ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 203 పంచాయతీలకు ఎన్నికలను నిర్వహించారు.
- నాగర్‌కర్నూల్ జిల్లాలో 87.40 శాతం పోలింగ్ నమోదైంది. 152 పంచాయతీలకు 22 ఏకగ్రీవమయ్యాయి. 130 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ఏకగ్రీవాలతో కలిపి 111చోట్ల టీఆర్ఎస్ మద్దతుదారులు, 31 స్థానాల్లో కాంగ్రెస్ మద్దతుదారులు విజయం సాధించారు.
- జోగుళాంబ గద్వాల జిల్లాలో 89.81 శాతం పోలింగ్ నమోదైంది. 69 పంచాయతీలకు ఎన్నికలు జరుగగా, 53 స్థానాల్లో టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందారు.

కరీంనగర్‌లో టీఆర్ఎస్ హవా



ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం వీఆర్ బంజరలో ఓటు వేయించేందుకు తల్లిని మంచంపై ఎత్తుకొస్తున్న కుమారులు

కరీంనగర్ జిల్లాలో 89.66 శాతం పోలింగ్ నమోదైంది. 13 సర్పంచ్, 200 వార్డు స్థానాలు ఏకగ్రీవంకాగా, మిగతా 96 జీపీలు, 797 వార్డులకు ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 109 సర్పంచ్ స్థానాలకు 86 స్థానాలను టీఆర్ఎస్, ఎనిమిదిచోట్ల కాంగ్రెస్ మద్దతుదారులు గెలుపొందారు.

- జగిత్యాల జిల్లాలో 80.03 శాతం పోలింగ్ నమోదైంది. 10 పంచాయతీలు, 258 వార్డు స్థానాలు ఏకగ్రీవంకాగా, మిగిలిన 117 జీపీలు, 924వార్డులకు ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 127 పంచాయతీలకు 93 చోట్ల టీఆర్ఎస్, 19 స్థానాల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు గెలిచారు.
- రాజన్న సిరిసిల్లలో మూడోవిడుతలో 14 సర్పంచ్, 191 వార్డు స్థానాలు ఏకగ్రీవంకాగా, మిగతా 75 సర్పంచ్, 565 వార్డుస్థానాలకు ఎన్నికలు జరిగాయి. జిల్లాలో 85.30 శాతం పోలింగ్‌నమోదైంది. 89 సర్పంచ్ స్థానాల్లో 78 చోట్ల టీఆర్ఎస్, రెండుచోట్ల కాంగ్రెస్ మద్దతుదారులు గెలుపొందారు.



మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం ఆలేరులో ఓటు వేసేందుకు వృద్ధురాలిని వీల్‌చైర్‌లో తీసుకొస్తున్న అంగన్‌వాడీ ఆయా

నిజామాబాద్‌లో..

నిజామాబాద్ జిల్లాలో 210 పంచాయతీలకు ఎన్నికలు జరగగా.. ఏకగ్రీవాలతో కలుపుకొని 164 స్థానాల్లో టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులే గెలుపొందారు. కాంగ్రెస్ 12 స్థానాలతో సరిపెట్టుకోగా, మిగిలిన స్థానాల్లో ఇతరులు గెలుపొందారు.

ఆదిలాబాద్‌లో..

ఆదిలాబాద్ జిల్లాలో 163 జీపీలకుగాను 119 స్థానాల్లో టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు, 18 పంచాయతీల్లో కాంగ్రెస్ మద్దతుదారులు విజయం సాధించారు.

వారెవ్వా కారు.. వరంగల్‌లో జోరు

- వరంగల్ అర్బన్ జిల్లాలో 88.8 శాతం పోలింగ్ నమోదైంది. 58 జీపీలకు ఎన్నికలు నిర్వహించగా 50 స్థానాల్లో టీఆర్ఎస్ మద్దతుదారులు గెలుపొందారు.
- వరంగల్ రూరల్ జిల్లాలో 89.78శాతం పోలింగ్ నమోదైంది. 120 జీపీలకు ఎన్నికలు జరగగా 85స్థానాల్లో టీఆర్ఎస్, 31 చోట్ల కాంగ్రెస్ మద్దతుదారులు గెలిచారు.
- జనగామ జిల్లాలో 89.53శాతం పోలింగ్ నమోదైంది. 91 జీపీల్లో ఎన్నికలు జరుగగా 64 స్థానాల్లో టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందారు.
- మహబూబాబాద్ జిల్లాలో 91.54 శాతం పోలింగ్ నమోదైంది. 155 జీపీలకు ఎన్నికలు జరుగగా 115 స్థానాల్లో టీఆర్ఎస్, 35 చోట్ల కాంగ్రెస్ మద్దతుదారులు విజయం సాధించారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 84.51శాతం పోలింగ్ నమోదైంది. 108 పంచాయతీల్లో ఎన్నికలు జరుగగా 45 చోట్ల టీఆర్ఎస్, 36 స్థానాల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు గెలిచారు.

నల్లగొండ జిల్లాలో

జిల్లాలో 257 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో 16 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కాగా మిగిలిన 242 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు జరిగాయి. ఏకగ్రీవాలతో కలుపుకొని టీఆర్ఎస్ మద్దతుదారులు 142 స్థానాల్లో, 97 స్థానాల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందారు.




మహారుద్ర చండీయాగంలో భాగంగా అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్‌లో వైభవంగా చండీయాగం

హాజరైన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

నర్సాపూర్, నమస్తేతెలంగాణ: మెదక్ జిల్లా నర్సాపూర్‌లో కోటి కుంకుమార్చన సహిత మహారుద్రచండీయాగం బుధవారం వైభవంగా ప్రారంభమైంది. ఐదురోజులపాటు జరుగనున్న ఈ యాగంలో 100 మంది వేదపండితులు పాల్గొన్నారు. పుష్పగిరి ఆశ్రమ పీఠాధిపతి శ్రీవిద్యా శంకరభారతిస్వామి పాదపూజ కార్యక్రమం ఘనంగా జరిపారు. అనంతరం గోపూజను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ యాగంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సీహెచ్ మదన్‌రెడ్డి, బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు మధుశ్రీశర్మ తదితరులు పాల్గొన్నారు.



బాసర అమ్మవారిని దర్శించుకున్న ట్రాన్స్‌కో సీఎండీ

బాసర: బాసర జ్ఞాన సరస్వతీ పుణ్యక్షేత్రాన్ని బుధవారం ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట డైరెక్టర్ గణపతి, నిర్మల్ ఎస్ఈ ఉత్తమ్ జాడే, ఆలయ ఈవో సుధాకర్ రెడ్డి, ఏఈవో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

లక్ష్మీనారసింహునికి వేంచేపు మండపం



యాదాద్రిలో శ్రీవారికి వేంచేపు మండప నిర్మాణం కోసం స్తంభాలను చెక్కే పనులను ప్రారంభిస్తున్న స్థపతి డాక్టర్ ఆనందాచారి

యాదాద్రి భువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తే తెలంగాణ: యాదాద్రిలో వేంచేపు మండపం నిర్మించాలని నిర్ణయించారు. సప్తతల గోపురం ముం దు భాగంలో దీన్ని నిర్మించనున్నారు. శ్రీ వారి తిరువీధి సేవ ప్రారంభానికి ముందు, సేవ పూర్తయ్యాక ఈ వేంచేపు మండపంలో శ్రీవారు అమ్మవారితో కలిసి భక్తులకు దర్శనమిస్తారు. పాతగుట్టలోని శిల్పకళాశాలలో మేలు రకమైన కృష్ణశిలతో కూడిన 19 అడుగుల ఎత్తయిన నాలుగు రాతి స్తంభాలను ఎంపికచేశారు. వీటిని చెక్కే పనులను బుధవారం సాయంత్రం స్థపతి డాక్టర్ ఆనందాచారివేలు, ఉప స్థపతులు ప్రారంభించారు. స్తంభాలుగా మలిచిన తర్వాత వీటిని భారీ వాహనాల సాయంతో కొండపైకి చేరవేస్తారు. కార్యక్రమంలో మొగిలి, సంజయ్, శ్రీను, ఆదిత్య, హేమాద్రి, చిరంజీవి పాల్గొన్నారు.

హాస్టల్ నుంచి బధిర విద్యార్థినుల అదృశ్యం

మిర్యాలగూడఅర్బన్: నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని ప్రభుత్వ కళాశాల బాలికల వసతి గృహం నుంచి ఇద్దరు దివ్యాంగులైన ఇంటర్ విద్యార్థినులు అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు, వసతి గృహం సంక్షేమాధికారి పార్వతి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్‌కు చెందిన లింగమ్మ (20), కరీంనగర్ జిల్లా చిప్పలపల్లికి చెందిన పూజ(20) నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో ఉంటూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని దివ్యాంగ (బధిర) విభాగంలో చదువుతున్నారు. వీరు మంగళవారం ఉదయం నుంచి కనిపించడం లేదని హాస్టల్ సంక్షేమాధికారి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేయడంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. విద్యార్థినులు ముంబైలో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఫిబ్రవరి 3న ముంబైలో జరిగే ' స్లో ఒలింపియాడ్ ' క్రీడలను చూసేందుకు బాలికలు వెళ్లినట్టు పోలీసులు చెప్పారు. ఈ విషయమై అక్కడి క్రీడా అధికారులను ఫోన్‌లో సంప్రదించగా విద్యార్థులు అక్కడే ఉన్నట్టు వారు చెప్పారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

చెన్నూర్ రూరల్: మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం కిష్టంపేట సమీపంలో బుధవారం జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా 11 మందికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నూర్ నుంచి ప్రయాణికులతో టాటాఏస్ వాహనం మంచిర్యాలకు వెళ్తుండగా కిష్టంపేట మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో టాటా ఏస్ ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. ఈ ఘటనలో టాటాఏస్ వాహనంలో ప్రయాణిస్తున్న చెన్నూర్ంలోని దుబ్బగూడేనికి చెందిన కడవండి రాయపోచం (42), మహారాష్ట్రలోని సిరోంచాకు చెందిన మగ్రి రాజన్న (35) అక్కడికక్కడే మృతిచెందారు. మరో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే జైపూర్ ఏసీపీ వెంకట్‌రెడ్డి చేరుకొని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు ఏసీపీ తెలిపారు.

భార్యను చంపిన భర్త

కలిసుంటానంటూ కోర్టులో ఒప్పుకొన్న మరుసటిరోజే హత్య

కోరుట్ల: భార్యతోకలిసి కాపురం చేస్తానంటూ కోర్టులో ఒప్పుకొని భార్య పిల్లలను తీసుకెళ్లి ఒక్కరోజుకూడా గడువకముందే భార్యను హతమార్చాడో భర్త. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మోహన్‌రావుపేటకు చెందిన రవళిని ఎనిమిదేండ్ల క్రితం నిజామాబాద్ జిల్లా దరిపెల్లి మండలం హన్మాజిపేటకు చెందిన మురళికిచ్చి పెండ్లి చేశారు. ఈ క్రమంలో వారికి ఓ కుమారుడు, కూతురు జన్మించారు. కాగా 2016 నుంచి వారి కుటుంబంలో గొడవలు మొదలయ్యాయి. మురళి తన కూతురును వేధిస్తున్నాడని రవళి తండ్రి భూమయ్య కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీసులు కౌన్సెలింగ్ ఇవ్వగా భార్యాపిల్లలను మురళి తీసుకొని వెళ్లాడు. అయినప్పటికీ వేధింపులు తగ్గకపోవడంతో 2017లో రవళి కోర్టును ఆశ్రయించింది. రెండేండ్లుగా కోర్టులో విచారణ సాగుతున్నది. భార్యాపిల్లలతో కలిసి ఉంటానని మురళి మంగళవారం కోరుట్ల ఓపెన్ కోర్టులో ఒప్పుకున్నాడు. దంపతు లిద్దరూ 15 రోజుల కోసారి కోర్టుకు రావాలని జడ్జి చెప్పడంతో ఒప్పుకున్న మురళి తన కుటుంబ సభ్యులతో హన్మాజిపేటకు చేరుకు న్నాడు. బుధవారం తెల్లవారుజామున భార్య కు ఉరివేసి హతమార్చాడు. భార్యను నమ్మించి హతమార్చిన మురళిని కఠినంగా శిక్షించాలని రవళి తరపు బంధువులు హన్మాజీపేటలో ఆందోళన చేపట్టారు.

ఏసీబీకి చిక్కిన సంగారెడ్డి ఎంవీఐ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/సంగారెడ్డి రూరల్: సంగారెడ్డి జిల్లా ఆర్టీఏ కార్యాలయ ఎంవీఐ అనిల్ చవాన్ లంచం తీసుకుంటూ బుధవారం ఏసీబీ అధికారులకు చిక్కాడు. అనిల్‌చవాన్‌తోపాటు హోంగార్డు సాయిరాం, కంప్యూటర్ ఆపరేటర్ సాయికుమార్‌ను కూడా అధికారులు అరెస్టుచేశారు. రూ.5 వేలు లంచం తీసుకుంటుండగా వీరిని అరెస్టు చేసినట్టు ఏసీబీ డీజీ పూర్ణచంద్రరావు తెలిపారు. బాలాజీ ఇంజినీరింగ్ వర్క్స్‌కు చెందిన సందీప్ అనే వ్యక్తి వాహనాలకు తాత్కాలిక రిజిస్ట్రేషన్ ఇచ్చేందుకు ఎంవీఐ అనిల్‌చవాన్ రూ.5 వేలు లంచం డిమాండ్‌చేశాడు. ఇందుకు హోంగార్డు సాయిరాం మధ్యవర్తిత్వం వహించాడు. వీరు ఆర్టీఏ కార్యాలయంలో డాటాఎంట్రీ ఆపరేటర్ సాయికుమార్ ద్వారా డబ్బు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ముగ్గురిని అరెస్టుచేసి హైదరాబాద్ ఏసీబీ న్యాయస్థానంలో హాజరుపర్చినట్టు డీజీ తెలిపారు.

గ్రామాల అభివృద్ధే సీఎం కేసీఆర్ లక్ష్యం

- గల్ఫ్ మోసాలపై కఠినచర్యలు
- నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత వెల్లడి



నిజామాబాద్ జిల్లా పొతంగల్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ కవిత

నిజామాబాద్; నమస్తే తెలంగాణ ప్రతినిధి: గ్రామాల అభివృద్ధే సీఎం కేసీఆర్ లక్ష్యమని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. గ్రామాలను ప్రగతిపథంలో తీసుకెళ్లేందుకే సీఎం కేసీఆర్ కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకొచ్చారని చెప్పారు. పంచాయతీ ఎన్నికల్లో 80 శాతానికి పైగా టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులే గెలుపొందారన్నారు. బుధవారం ఆమె నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం పొతంగల్‌లో ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ కవిత మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో కులవృత్తులకు జీవం పోశారన్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు కేసీఆర్ స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీని తిరస్కరించి టీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గల్ఫ్ తీసుకెళ్తామంటూ తెలంగాణ బిడ్డలను మోసం చేసే ఏజెంట్లపై కఠినచర్యలు తీసుకుంటామని ఎంపీ హెచ్చరించారు. ఏజెంట్ల మోసాలను అరికట్టేందుకు కేంద్రప్రభుత్వం ప్రత్యేకచట్టాన్ని తీసుకురావాలని కోరారు. కేసీఆర్ పట్ల నమ్మకంతో టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని అన్నారం బరాజ్ వద్ద టీఎన్జీవో నేతలు

కాళేశ్వరం ప్రాజెక్టు అద్భుతం

ప్రాజెక్టును సందర్శించిన టీఎన్జీవోస్ నేతలు

కాళేశ్వరం(జయశంకర్ భూపాలపల్లి): కాళేశ్వరం ప్రాజెక్టు అద్భుతమని టీఎన్జీవోస్ నేతలు కొనియాడారు. బుధవారం టీఎన్జీవోస్ కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీఎన్జీవో నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించారు. కాళేశ్వర, ముక్తీశ్వరస్వామి దేవస్థానానికి చేరుకోగా.. ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం కన్నెపల్లి పంప్‌హౌస్‌ను, అన్నారం బరాజ్‌ను సందర్శించారు.

జనశక్తి అగ్రనేతలకు మాతృవియోగం

అనారోగ్యంతో కూర మల్లమ్మ మృతి

వేములవాడ, నమస్తే తెలంగాణ: సీపీఐఎంఎల్ జనశక్తి అగ్రనేతలు కూర రాజన్న, దేవేందర్ అలియాస్ అమర్ తల్లి మల్లమ్మ (92) బుధవారం కన్నుమూశారు. వేములవాడ ప్రధాన రహదారిలోని ముదిరాజ్ వీధిలో సేవకురాలి సాయంతో నివసిస్తున్న ఆమె రెండేండ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నారు. ఆమె భర్త బాలయ్య 1978లోనే మరణించారు. మల్లమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కొడుకు కూర రాజన్న జనశక్తి వ్యవస్థాపకుడిగా భూస్వాములకు వ్యతిరేకంగా సాయుధ బలగాలతో కలిసి పోరాటంచేసి.. 40 ఏండ్లుగా అజ్ఞాతంలోనే ఉండగా, ఆయన సోదరుడు దేవేందర్ అలియాస్ అమర్ కూడా రాజన్న అడుగుజాడల్లోనే నడిచి అజ్ఞాతంలోనే ఉన్నాడు. వీరిపై పలు కేసులు ఉన్నందున తల్లి అంత్యక్రియలకు హాజరవుతారా? లేదా అనేది ఉత్కంఠగా మారింది. ఇప్పటికే అమర్ భార్య విమలక్క వేములవాడకు చేరుకొని కన్నీటి పర్యంతమయ్యారు. గురువారం ఉదయం వేములవాడలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.



సంపులో పడి బాలుడి మృతి

గుమ్మడిదల: ఐదేండ్ల బాలుడు ప్రమాదవశాత్తు సంపులో పడి మరణించాడు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం వీరారెడ్డిపల్లికి చెందిన తొంట ముత్యాలు, రాణి దంపతుల ఐదేండ్ల కొడుకు అభిలాశ్ మంగళవారం సాయంత్రం ఆరుబయట ఆడుకుంటూ సంపులో పడి ప్రమాదవశాత్తు మృతి చెందాడు.

మోడల్ స్కూల్‌లో విద్యార్థిని ఆత్మహత్య

పర్వతగిరి: వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరిలోని మోడల్ స్కూల్ విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పర్వతగిరికి చెందిన మడ్డి వెంకటేశ్వర్లు కూతురు ప్రసన్న (15) స్థానిక మోడల్‌స్కూల్‌లో పదోతరగతి చదువుతున్నది. బుధవారం ఆరోగ్యం బాగోలేదంటూ స్కూల్ ఆవరణలోని హాస్టల్ గదిలోకి వెళ్లి అనుమానాస్పదంగా ఫ్యాన్‌కు ఉరేసుకుంది. గమనించిన ప్రిన్సిపాల్ అనిత.. ఆ విద్యార్థినిని దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

భర్త మరణాన్ని తట్టుకోలేక భార్య మృతి

నాగారం: భర్త మృతిని తట్టుకోలేక భార్య కన్నుమూసిన ఘటన బుధవారం సూర్యాపేట జిల్లా నాగారం మండలం పస్తాలలో చోటుచేసుకున్నది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పస్తాలకు చెందిన బొజ్జ చిన అబ్బయ్య (60) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం అబ్బయ్య దశదినకర్మ సందర్భంగా ఆయన భార్య బొజ్జ ఎల్లమ్మ(55) అకస్మాత్తుగా స్పృహ కోల్పోయి పడిపోయారు. దీంతో బంధువులు హుటాహుటిన దవాఖానకు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యంలో ప్రాణాలు వదిలింది.

నుమాయిష్‌లో భారీ అగ్నిప్రమాదం



బుధవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఎగిసిపడుతున్న మంటలు



స్టాళ్లనుంచి మిగిలిన వస్తువులను తీసుకెళుతున్న యజమానులు



సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్న మేయర్ బొంతు రామ్మోహన్, కమిషనర్ దానకిశోర్

- 200 స్టాళ్లు ఆహుతి.. కోట్లలో ఆస్తినష్టం
- సకాలంలో స్పందించిన యంత్రాంగం
- ప్రాణ నష్టం లేకుండా నియంత్రణ
- మంటలు ఆర్పిన 20కిపైగా ఫైరింజన్లు
- భయాందోళనకు గురైన సందర్శకులు
- సురక్షితంగా బయటికి పంపిన పోలీసులు
- ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన మెట్రో
- బాధితులను ఆదుకుంటాం: హోంమంత్రి మహమూద్ అలీ

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆబిడ్స్, బేగంబజార్, బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని చారిత్రాత్మక ఎగ్జిబిషన్ (నుమాయిష్)లో బుధవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రాత్రి 8.30 గంటలకు మొదలైన అగ్నికీలలు.. పదినిమిషాలపాటు కొనసాగాయి. ఈ ప్రమాదంలో దాదాపు 200 స్టాళ్లు ఆహుతయ్యాయి. కోట్ల రూపాయల్లో ఆస్తినష్టం సంభవించింది. అగ్నిమాపకశాఖ, జీహెచ్‌ఎంసీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు సకాలంలో స్పందించి, పెను ముప్పును తప్పించాయి. నింగికి ఎగిసిపడుతున్న మంటలను 20కిపైగా ఫైరింజన్లు శ్రమించి ఆర్పివేశాయి. దాదాపు 60 వాటర్ ట్యాంకర్లు ఫైరింజన్లకు ఎప్పటికప్పుడు నీటిని సరఫరాచేశాయి. అధికారులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడం, సందర్శకులను పోలీసులు సురక్షితంగా బయటకు పంపించడంతో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. అయితే.. పొగ కారణంగా ఏడుగురు ఊపిరి ఆడక ఇబ్బందికి గురయ్యారు. వారిలో ముగ్గురిని నాంపల్లి కేర్ దవాఖానకు తరలించినట్టు సమాచారం. అగ్నిప్రమాదంతో నుమాయిష్‌లో వేల సంఖ్యలో ఉన్న ప్రజలు ఒక్కసారిగా తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఎగ్జిబిషన్‌లోని మహేశ్‌బ్యాంక్ స్టాల్‌లో చోటుచేసుకున్న విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో రాజుకున్న మంటలు క్రమంగా పక్కనే ఉన్న స్టాళ్లకు పాకాయని ప్రాథమికంగా తెలుస్తున్నది. మంటలకు గాలులు తోడవడంతో కొద్ది నిమిషాల వ్యవధిలోనే అగ్నికీలలు ఇతర స్టాళ్లను చుట్టుముట్టాయి. విషయం తెలియగానే ఘటనాస్థలానికి చేరుకున్న మేయర్ బొంతు రామ్మోహన్ అధికారులను అప్రమత్తం చేసి, ప్రమాద తీవ్రత తగ్గించేందుకు కృషిచేశారు. హోంమంత్రి మహమూద్‌అలీ, మాజీ మంత్రులు ఈటల రాజేందర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌లు ఘటనా స్థలానికి వచ్చి పరిస్థితి సమీక్షించారు. ఎగ్జిబిషన్‌లో ఉత్తరప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు కూడా స్టాళ్లు ఏర్పాటుచేశారు. వారంతా భోజన సదుపాయంకోసం తెచ్చుకున్న గ్యాస్‌సిలిండర్లను స్టాళ్లలోనే ఉంచడంవల్ల ప్రమాద తీవ్రత ఎక్కువ ఉన్నట్టు సమాచారం. అగ్నిప్రమాదం నేపథ్యంలో ఎగ్జిబిషన్‌కు ఒక రోజు సెలవు ప్రకటించారు.

సందర్శకులకు మెట్రో రైల్ సేవ

నుమాయిష్‌కు వచ్చిన సందర్శకులు వెంటనే ఈ ప్రాంతం వీడి వెళ్లేందుకు హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు సహకరించారు. రాత్రి వరకు సందర్శకులు మెట్రోరైల్లో ఉచితంగా ప్రయాణించేసే వీలు కల్పించారు. దీంతో నాంపల్లిలో ట్రాఫిక్ నియంత్రణ సులువుగా మారింది. మెట్రోస్టేషన్‌లో జనసందోహాన్ని నియంత్రించగలిగారు.

బాధితులను ఆదుకుంటాం: మహమూద్ అలీ, హోంమంత్రి


అగ్నిప్రమాద స్థలాన్ని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ రాత్రి 11.20 గంటల సమయంలో సందర్శించారు. దగ్ధమైన స్టాళ్లను పరిశీలించారు. సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ప్రమాదానికి కారణాలు తెలుసుకుంటామని, పూర్తిస్థాయిలో విచారణ చేయిస్తామని చెప్పారు. భారీగా ఆస్తి నష్టం జరిగినందున బాధితులకు సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దుస్తుల కారణంగా ఎగిసిపడిన మంటలు

మహేశ్‌బ్యాంకు స్టాల్‌లో షార్ట్‌సర్క్యూట్‌తోనే మంటలు చెలరేగాయని, స్టాల్‌లో ఉన్న క్లాత్ కారణంగా నిమిషాల వ్యవధిలోనే పక్క స్టాళ్లకు కూడా మంటలు వ్యాపించాయని రీజనల్ ఫైర్ ఆఫీసర్ పాపయ్య చెప్పారు. పొగ కారణంగా ఫైర్ సిబ్బందితోపాటు ఒక పౌరుడు అస్వస్థత గురయ్యారని, వారిని వెంటనే దవాఖానకు తరలించామని తెలిపారు. అగ్నిప్రమాదం నష్టంపై అంచనా వేయాల్సి ఉందన్నారు.

అన్ని డిగ్రీ కాలేజీలకు జియో ట్యాగింగ్ తప్పనిసరి

- వాటినే 'దోస్త్' జాబితాలో చేర్చుతాం
- రిజిస్ట్రార్ల సమావేశంలో తుదినిర్ణయం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రైవేటు డిగ్రీ కాలేజీలు ఒక చోట ఉంటే.. వాటి అడ్రసులు మరో చోట ఉంటున్నాయి. దీంతో ఆయా కాలేజీల్లో చేరేందుకు దోస్త్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసుకొనే విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారు. దీంతో ఏ కాలేజీలో చేరాలో తెలియక సతమతమవుతున్నారు. పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసిన సందర్భంలోనూ ఈ సమస్య ఎదురవుతున్నది. ఇలాంటి వాటికి చెక్ పెట్టడం కోసం రాష్ట్ర ఉన్నత విద్యామండలి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలలన్నింటికీ జియో ట్యాగింగ్ చేయాలని గతంలో జరిగిన రిజిస్ట్రార్ల సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ రిక్క లింబాద్రి తెలిపారు. డిగ్రీ కాలేజీలకు జియో ట్యాగింగ్ ఉండాలన్న అంశంపై గత ఏడాదిలో కొంత వెసులుబాటు కల్పించామని, 2019-20 విద్యా సంవత్సరం నుంచి తప్పనిసరి చేశామని ఆయన 'నమస్తే తెలంగాణ'తో పేర్కొన్నారు. విద్యాప్రమాణాలతో పాటు జియో ట్యాగింగ్ చేసిన ప్రైవేటు డిగ్రీ కాలేజీలలో ప్రవేశాలకు అనుమతి ఇస్తామని, వాటినే దోస్త్ జాబితాలో చేర్చుతామని లింబాద్రి స్పష్టం చేశారు. విద్యా ప్రమాణాలు, జియోట్యాగింగ్ లేని కాలేజీలలో ప్రవేశాలు కల్పించేది లేదని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా డిగ్రీ కళాశాలలకు జియోట్యాగింగ్ చేయాలని దోస్త్ అధికారులు తీసుకున్న నిర్ణయానికి తాము కట్టుబడి ఉన్నామని తెలంగాణ ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజమాన్యాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీసీ ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి పరమేశ్వర్ తెలిపారు. నాణ్యమైన విద్యనందించే కళాశాలలకు మాత్రమే అఫిలియేషన్లు ఇవ్వాలని ఉన్నత విద్యా మండలి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు వారు తెలిపారు.

కేంద్రం సహాయ నిరాకరణ

- ఏపీ బడ్జెట్ సమావేశాల ప్రసంగంలో గవర్నర్ నరసింహన్

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం తోడ్పాటు అందించడం లేదని గవర్నర్ నరసింహన్ పేర్కొన్నారు. వెనుకబడిన జిల్లాలకు ఇచ్చిన రూ.350 కోట్లను కేంద్రం వెనక్కి తీసుకోవడం ఊహించని పరిణామమన్నారు. ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వకపోవడంతో అభివృద్ధికి విఘాతం కలుగుతున్నదని పేర్కొన్నారు. అయినా ఏపీ విభజన నష్టాల నుంచి కోలుకుని అభివృద్ధి పథంలో పయనిస్తున్నదని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని వెల్లడించారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో 11 శాతం వృద్ధిరేటు నమోదుచేశామన్నారు. సగటున రాష్ట్ర వృద్ధిరేటు 10.66 శాతంగా ఉన్నదని వివరించారు. పోలవరం ప్రాజెక్టుకు ఇప్పటివరకు రూ.15,585 కోట్లు ఖర్చు చేశామన్నారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకంతో 263 టీఎంసీల నీటిని డెల్టాకు మళ్లించామని గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఉభయసభల సభ్యులు నివాళులర్పించారు.

తెలంగాణలో నా అంచనాలు తప్పాయి

- ఇకపై పోలింగ్ తర్వాతే సర్వే వివరాలు చెప్తా: లగడపాటి



న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో తన అంచనాలు తలకిందులయ్యాయని, మొదటిసారి తన సర్వే ఫలితాలు తారుమారయ్యాయని మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ పేర్కొన్నారు. రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్‌కు ముందు సర్వే వివరాలు చెప్పనన్నారు. బుధవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. కొన్ని రోజులుగా తన వ్యక్తిత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని, దీంతో మీడియా ముందుకు వచ్చానని చెప్పారు. తాను 2003 నుంచి అనేక రాష్ట్రాల్లో సర్వేలు చేశానని, ఎప్పుడూ పెద్దగా తేడా రాలేదని చెప్పారు. తన బృందం చేసిన సర్వే ఫలితాలు మొదటిసారి తారుమారయని పేర్కొన్నారు. ఎందుకు తప్పాయనే దానిపై సమీక్ష చేసుకుంటున్నానని వెల్లడించారు. పోలింగ్‌కు సంబంధించి రాజకీయ పార్టీలకు అనేక అనుమానాలు ఉన్నాయని చెప్పారు. పోలింగ్ శాతం వివరాలు చెప్పడానికి ఈసీకి ఒకటిన్నర రోజులు ఎందుకు పట్టిందని ప్రశ్నించారు. పంచాయతీ ఎన్నికల్లో పతిపక్షం బలం గణనీయంగా పెరిగిందన్నారు. తాను ప్రలోభాలకు లొంగే వ్యక్తిని కాదని, చెప్పిన మాటకు కట్టుబడి రాజకీయాల నుంచి తప్పుకున్నానని, ఎంతోమంది ఒత్తిడి చేసినా మళ్లీ రాలేదని పేర్కొన్నారు. రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్‌కు ముందు సర్వే వివరాలు చెప్పనని, పోలింగ్ తర్వాతే వివరాలు వెల్లడిస్తానన్నారు.

త్వరలో భాషా పండితులకు తీపికబురు

- స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు
- శాసనమండలి చీఫ్ విప్ పాతూరి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న భాషా పండితులు త్వరలో తీపికబురు వింటారని శాసనమండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్ రెడ్డి తెలిపారు. భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్ టీచర్లుగా పదోన్నతి కల్పిస్తామని ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందని పేర్కొన్నారు. సీఎం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ్‌కుమార్‌తో బుధవారం ఈ అంశంపై లోతుగా చర్చించామని పాతూరి చెప్పారు. తమ ప్రతిపాదనలు వెంటనే ప్రభుత్వానికి నివేదిస్తానని డైరెక్టర్ విజయ్‌కుమార్ హామీ ఇచ్చారన్నారు.

45 టీఎంసీల అదనపు వాటా ఇవ్వండి

- కృష్ణానదీ యాజమాన్య బోర్డుకు తెలంగాణ నీటిపారుదలశాఖ లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు గోదావరి జలాలను తరలిస్తున్నందున బచావత్ ట్రిబ్యునల్ అవార్డును అనుసరించి తెలంగాణకు కృష్ణాజలాల్లో 45 టీఎంసీల అదనపు వాటాను కేటాయించాలని రాష్ట్ర నీటిపారుదలశాఖ కృష్ణానదీ యాజమాన్య బోర్డును కోరింది. కొన్ని సంవత్సరాలుగా ఇదేరీతిన లేఖ రాస్తున్నా, అటు కేంద్ర జల వనరులశాఖ, ఇటు కృష్ణాబోర్డు ఆ మేరకు వాటాను కేటాయించడం లేదు. తుది నిర్ణయం తీసుకోవడం లేదు. ఈ నేపథ్యంలో తాజాగా మరోసారి అధికారులు బోర్డుకు లేఖ రాశారు.

10న గుంటూరులో మోదీ పర్యటన

- నాలుగో తేదీన అమిత్‌షా వస్తారు: కన్నా

అమరావతి, నమస్తే తెలంగాణ: ఫిబ్రవరి 10వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో పర్యటించనున్నారని ఏపీ బీజేపీ శాఖ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ చెప్పారు. మోదీ రాకకు ముందు ఫిబ్రవరి నాలుగో తేదీన బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షా పర్యటిస్తారని తెలిపారు. బుధవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా కియా మోటర్స్ ప్రతినిధులతో ప్రధాని మోదీ భేటీ కావడం వల్లనే ఆ కంపెనీ కార్ల తయారీ కేంద్రం ఏపీకి వచ్చిందని, తన వల్లే కియా మోటర్స్ ఏపీకి వచ్చిందని చంద్రబాబు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయమని చెప్పిన చంద్రబాబు.. స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) కింద వచ్చే రూ.16,500 కోట్ల నిధులను సాధించకుండా కేంద్రంపై గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు.

అసోం పేలుళ్ల కేసులో ఎన్‌డీఎఫ్‌బీ చీఫ్‌కు జీవితఖైదు

గువాహటి, జనవరి 30: 2008లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అసోం వరుస బాంబు పేలుళ్ల కేసులో నేషనల్ డెమోక్రటిక్ ఫ్రంట్ ఆఫ్ బోడోల్యాండ్ (ఎన్‌డీఎఫ్‌బీ) అధినేత రంజన్ డైమరీతోపాటు మరో 9 మందికి జీవిత ఖైదు విధిస్తూ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం బుధవారం తీర్పు వెలువరించింది. మరో ముగ్గురు నిందితులు జరిమానా చెల్లించిన అనంతరం విడుదల కానున్నారు. ఇప్పటికే శిక్ష అనుభవించిన నేపథ్యంలో మరో ఇద్దరిని కోర్టు విడుదల చేసింది. కోర్టు తీర్పుపై హైకోర్టులో అప్పీల్ చేస్తామని రంజన్ డైమరీ తెలిపారు. తీర్పు సందర్భంగా కోర్టు పరిసరాల్లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేశారు. తీర్పు నేపథ్యంలో కోర్టుకు తరలివచ్చిన రంజన్ మద్దతుదారులు ప్రత్యేక బోడోల్యాండ్ మద్దతుగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. 2008 అక్టోబర్ 30న అసోంలో ఎన్‌డీఎఫ్‌బీ తొమ్మిది వరుస బాంబు పేలుళ్లకు పాల్పడడంతో 88 మంది ప్రాణాలు కోల్పోగా, 540 మంది గాయపడ్డారు.

హైకోర్టు చీఫ్ జస్టిస్‌తో బీసీ కమిషన్ భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ టీబీ రాధాకృష్ణన్‌తో తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఈ ఆంజనేయగౌడ్ బుధవారం హైకోర్టులోని ఆయన చాంబర్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీసీ నోట్‌బుక్ ఆంగ్లప్రతితో పాటు, ఎన్‌కే మురళీధర్‌రావు, ఓ చిన్నపరెడ్డి నివేదికల తెలుగు తొలి ప్రతులను చీఫ్ జస్టిస్‌కు అందజేశారు. బీసీ రిజర్వేషన్ పెంపుదలకు ప్రభుత్వానికి చేసిన ప్రతిపాదనల్లోని పలు అంశాలను ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ దృష్టికి తీసుకువెళ్లినట్టు బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు తెలిపారు.



హైకోర్టు చీఫ్ జస్టిస్ టీబీ రాధాకృష్ణన్‌కు బీసీ నోట్‌బుక్‌ను అందజేస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు వకుళాభరణం, ఆంజనేయగౌడ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్‌పీఎస్సీ సభ్యులు

టీఎస్‌పీఎస్సీలో స్థలాభావం

- ఏపీపీఎస్సీని ఏపీకి తరలించినా వారి ఆధీనంలోనే రెండు ఫ్లోర్లు
- సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వానికి ఉద్యోగుల వినతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నిత్యం రద్దీగా ఉండే టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో స్థల సమస్య తీవ్రంగా ఉన్నదని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కమిషన్ ఉద్యోగుల సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన నిర్ణయాలపై చర్చించేందుకు ఉద్యోగుల సంఘం నాయకులు బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు జీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఏపీపీఎస్సీ విజయవాడకు తరలిపోయినా వారి ఆధీనంలో ఉన్న రెండు ఫ్లోర్లను టీఎస్‌పీఎస్సీకి అప్పగించకపోవడంతో ఉద్యోగులం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో టీఎస్‌పీఎస్సీ ఉద్యోగుల సంఘం కార్యదర్శి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేను పెయిటింగ్‌లు అమ్ముకున్నట్లు నిరూపించు

- మోదీకి పశ్చిమబెంగాల్ సీఎం మమత సవాల్

బిర్భుం (పశ్చిమబెంగాల్), జనవరి 30: తన పేయిటింగ్‌లను అమ్ముకున్నట్లు బీజేపీ చేస్తున్న ఆరోపణలు పచ్చి అబద్ధాలని, దమ్ముంటే ప్రధాని మోదీ నిరూపించాలని పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీ సవాల్ విసిరారు. మమతాబెనర్జీ తన పేయిటింగ్‌లను చిట్‌ఫండ్ కంపెనీల యజమానులకు కోట్ల రూపాయలకు అమ్ముకున్నారంటూ మంగళవారం బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఆరోపించిన నేపథ్యంలో బుధవారం ఆమె స్పందించారు. బీజేపీ నాయకులకు కనీస మర్యాద కూడా తెలువదని, తనపై నిరాధార ఆరోపణలు చేసినందుకు పరువునష్టం దావా వేసే ఆలోచనను చేస్తున్నానని చెప్పారు. 'మోదీ బాబు.. పేయిటింగ్‌లను అమ్ముకొని నేను ఒక్కపైసా సంపాదించినట్లు నిరూపించు. మీకు కనీస మర్యాద కూడా తెలువదు. అనాగరికుడిలా మాట్లాడుతున్నారు' అని మమతాబెనర్జీ పేర్కొన్నారు.

బీసీసీఐకి ఎందుకు చెప్పలేదు?

శ్రీశాంత్‌ను ప్రశ్నించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: స్పాట్ ఫిక్సింగ్ అంశాన్ని బీసీసీఐ దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదని క్రికెటర్ శ్రీశాంత్‌ను.. సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ విషయంలో క్రికెటర్ ప్రవర్తన సరిగా లేదని చివాట్లు పెట్టింది. తనపై విధించిన జీవితకాల నిషేధాన్ని ఎత్తివేయాలని శ్రీశాంత్ దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం మరోసారి విచారించిన సుప్రీం పై విధంగా వ్యాఖ్యానించింది. 2013లో రాజస్థాన్, పంజాబ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో స్పాట్ ఫిక్సింగ్ జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లేవని శ్రీశాంత్ తరఫు న్యాయవాది సల్మాన్ ఖుర్షీద్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. క్రికెటర్ డబ్బులు తీసుకున్నట్లు ఎలాంటి సాక్ష్యాలూ లేవన్నారు. ఢిల్లీ పోలీసుల టార్చర్ భరించలేకనే క్రికెటర్ నింద మోసాడని వాదించారు. బుకీలతో మలయాళంలో జరిగిన సంభాషణను ఖుర్షీద్ కోర్టు ముందుంచారు. దీనిని పరిశీలించిన జస్టిస్ అశోక్ బాను, జస్టిస్ కేఎం జోసెఫ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం.. ఈ విషయాన్ని అప్పుడే బీసీసీఐ దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించింది. ఈ మొత్తం ఎపిసోడ్‌లో క్రికెటర్ ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపిస్తున్నదని గుర్తు చేసింది. దీనిపై ప్రతివాదనలు చేసిన ఖుర్షీద్.. ఒకవేళ క్రికెటర్ ఫిక్సింగ్ అంశాన్ని దాచిపెట్టినా గరిష్ఠంగా ఐదేండ్ల నిషేధమే పడుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇలాంటి కేసుల్లో ఒక్క క్రానే మినహా మిగతా క్రికెటర్లెవ్వరికీ జీవిత కాల నిషేధం విధించలేదని గుర్తు చేశారు. శ్రీశాంత్‌పై నిషేధం ఎత్తివేసి కనీసం విదేశాల్లో ఆడుకునే అవకాశాన్నైనా కల్పించాలని విజ్ఞప్తి చేశారు.


శ్రీశాంత్


శ్రీధర్

ఫీల్డింగ్‌లో కొత్త పుంతలు!

బ్లైండ్‌ఫోల్డ్ క్యాచ్‌లు, సిమ్యులేషన్ మిషన్‌తో ప్రాక్టీస్

టీమ్ ఇండియా ఫీల్డింగ్ కోచ్ శ్రీధర్ వెల్లడి

హామిల్టన్: 'క్యాచెస్ విన్ మ్యాచెస్'.. క్రికెట్‌లో ఇది అతి ప్రాథమిక సూత్రం. ఇప్పుడు దీన్ని భారత్ జట్టు బాగా వంటబట్టించుకుంది. అందుకే ఈ మధ్యకాలంలో టీమ్‌ఇండియా క్రికెటర్లు కండ్లు చెదిరే స్థాయిలో క్యాచ్‌లు అందుకుంటున్నారు. ఒకప్పుడు ఫీల్డింగ్‌లో చాలా వెనుకబడి ఉన్న భారత్.. ఇంతలా మెరుగుపడటానికి గల కారణాలను ఫీల్డింగ్ కోచ్ ఆర్. శ్రీధర్ వివరించాడు. కొత్త రకం టెక్నిక్‌లతో టీమ్‌ఇండియా ఫీల్డింగ్ ఉన్నతస్థాయికి చేరుకుందన్నాడు. 'కొత్త రకం టెక్నిక్‌ల్లో బ్లైండ్‌ఫోల్డ్ చాలా ముఖ్యమైంది. దీనివల్ల ప్రతి స్పందించే సమయం గణనీయంగా మెరుగవుతుంది. బ్లైండ్‌ఫోల్డ్ టెక్నిక్ అంటే.. కర్టెన్ వెనుక ఓ బంతి ఉంటుంది. అది ఎక్కడి నుంచి, ఎంత వేగంతో వస్తుందో క్యాచర్‌కు తెలియదు. కర్టెన్‌ను తీసే సమయంలో మెరుపు వేగంతో దూసుకొచ్చే బంతి కోసం అంతకంటే వేగంగా ప్రతి స్పందించాలి. దీని వల్ల క్యాచర్ ప్రతిస్పందించే తీరు, వేగం గణనీయంగా పెరుగుతుంది. ఇంగ్లండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్ మొత్తం ఇది బాగా ఫలితాన్నిచ్చింది' అని శ్రీధర్ పేర్కొన్నాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో మరో కొత్త రకం టెక్నిక్ అవలంభిస్తున్నామన్నాడు. భిన్న బరువులు కలిగిన తేలు బంతులతో ప్రాక్టీస్ చేస్తున్నామన్నాడు. 'కివీస్‌లో ఫీల్డర్‌కు అతి పెద్ద సవాలు బలంగా వీచే గాలులు. బ్యాటింగ్, బౌలింగ్ ప్రణాళికలు ఎక్కువ శాతం వీటి మీదే ఆధారపడి ఉంటాయి. గాలి వల్ల కొన్నిసార్లు బంతి గమనం మార్చుకుని వేరే దిశలో ప్రయాణిస్తుంది. ఇలా దిశను మార్చుకుని వచ్చే స్కీయర్స్‌ను అందుకోవడం చాలా కష్టం. మేం తేలు బంతులతో ప్రాక్టీస్ చేయడం వల్ల ఇవి గాలిలో ఎక్కువ సేపు ప్రయాణిస్తాయి. భిన్నమైన బరువులు వాడటం వల్ల అవి గాలిలో ఎక్కువసేపు స్వింగ్ అవుతాయి. వాటి దిశకు అనుగుణంగా మా ప్రాక్టీస్ సాగుతుంది' అని కోచ్ వెల్లడించాడు.

'టీమ్‌మెట్'తో ప్రాక్టీస్

బ్లైండ్‌ఫోల్డ్ టెక్నిక్ మీద పట్టు సాధించిన తర్వాత తాము ఆసీస్‌లో పర్యటించాల్సి వచ్చిందన్న శ్రీధర్.. అక్కడ స్లిప్ క్యాచ్‌లు చాలా కీలకమైనవి అని చెప్పాడు. వీటి కోసం సిమ్యులేషన్ మిషన్ (టీమ్‌మెట్)తో ప్రాక్టీస్ చేశామన్నాడు. 'స్లిప్‌లో వచ్చే భిన్నమైన క్యాచ్‌ల కోసం మేం సిమ్యులేషన్ మిషన్ సహకారం తీసుకున్నాం. దీని నుంచి విడుదలయ్యే బంతి రకరకాల వేగం, స్వింగ్, బౌన్స్‌తో వస్తుంది. దానిని అందుకోవడానికి ఫీల్డర్ అన్ని కోణాల్లో శరీరాన్ని వంచాలి.. దీనితో ప్రాక్టీస్ చేయడం వల్లే విరాట్ కొన్ని అద్భుతమైన క్యాచ్‌లు పట్టగలిగాడు' అని క్యాచ్‌ల వెనుక ఉన్న రహస్యాన్ని శ్రీధర్ బయటపెట్టాడు. ఫీల్డింగ్ కోసం ఫాలో అప్ శిక్షణను కూడా కొనసాగిస్తున్నట్లు కోచ్ చెప్పాడు. ఇందుకోసం ఐపీఎల్ జట్లతో కలిసి పని చేస్తానన్నాడు.


గిల్


ఖలీల్

విరాట్, రోహిత్ స్ఫూర్తి

ఫిట్‌నెస్ కాపాడుకుంటామన్న యువ క్రికెటర్లు

హామిల్టన్: సీనియర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ మాదిరిగా తాము కూడా అత్యుత్తమ ఫిట్‌నెస్‌ను సాధించాలని కోరుకుంటున్నట్లు యువ క్రికెటర్లు శుభ్‌మన్ గిల్, ఖలీల్ అహ్మద్ అన్నాడు. ఆ ప్రమాణాలను కొనసాగించేందుకు వాళ్లను స్ఫూర్తిగా తీసుకుంటామన్నారు. చైనామన్ కుల్దీప్ యాదవ్ కూడా.. గిల్, ఖలీల్ వ్యాఖ్యలతో ఏకీభవించాడు. చాహల్‌తో కలిసి బీసీసీఐ. టీవీ చేపట్టిన ఓ చర్చలో వీళ్లు ఈ వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ క్రికెట్‌లో తాను ఇంత త్వరగా ఎదుగడానికి టీమ్‌ఇండియా పాటిస్తున్న కఠినమైన ఫిట్‌నెస్ నిబంధనలే కారణమన్నాడు. 'నేను చాలా వర్కౌట్లు చేస్తా. మంచి ఫిట్‌నెస్ కోసం చాలా శ్రమిస్తా. మాకు ఇచ్చిన ప్రణాళికల కంటే ఎక్కువగానే కసరత్తులు చేస్తాం. ఇది మాకు చాలా ఉపయోగపడింది. విరాట్, రోహిత్ బాయ్.. యువకులను బాగా ప్రోత్సహిస్తారు. వాళ్లు ఏదైతే చేస్తారో దానిని చూసి స్ఫూర్తిపొందుతాం. మా శక్తి మేరకు మరింత ఎక్కువగా కష్టపడేందుకు ప్రయత్నిస్తాం' అని కుల్దీప్ వెల్లడించాడు. జట్టుకు అవసరమైనప్పుడల్లా బరిలోకి దిగేందుకు ప్రస్తుతం ఉన్న ఫిట్‌నెస్ నిబంధనలు బాగా ఉపయోగపడుతున్నాయని ఖలీల్ చెప్పాడు. 'అవకాశం వచ్చిందంటే మ్యాచ్ ఆడేందుకు సిద్ధంగా ఉండాలి. అందుకోసం మనం కూడా ఫిట్‌నెస్ కాపాడుకోవాలి. వర్కౌట్లను ఓ హాబీ లాగా మార్చుకోవాలి. నిత్యం మనం శరీరాన్ని కాపాడుకుంటేనే ఓ ఆటగాడిగా సుదీర్ఘ కాలం ఆటలో కొనసాగుతాం' అని ఖలీల్ పేర్కొన్నాడు. టీమ్‌ఇండియాలోకి వచ్చినప్పట్నించి తన ఫిట్‌నెస్ స్థాయి మరింత మెరుగుపడిందని గిల్ అన్నాడు.

భారత్‌ను ఆపతరమా

నేడు న్యూజిలాండ్‌తో నాలుగో వన్డే ■ 4-0తో గెలిస్తే అతిపెద్ద సిరీస్ విజయంగా రికార్డు
కుర్రాళ్లకు అవకాశం దక్కేనా? ■ పరువు కోసం కివీస్ పాకులాట

న్యూజిలాండ్ గడ్డపై ఇప్పటికే సిరీస్ గెలిచి జోరుమీదున్న భారత్ జట్టు మరో పే..ద్ద విజయంపై గురి పెట్టింది. 56 ఏండ్ల చరిత్రలో ఇప్పటివరకు టీమ్‌ఇండియా 4-0 ఆధిక్యంతో (ఏ ఫార్మాట్‌లోనైనా) సిరీస్ గెలిచిన దాఖలాల్లేవు. ఇప్పుడు ఆ అరుదైన ఫీట్‌ను సాధించే సువర్ణావకాశం వచ్చింది. విరాట్ గైర్హాజరీతో తాత్కాలిక కెప్టెన్‌గా పగ్గాలు చేపట్టిన రోహిత్ కూడా మరో అరుదైన రికార్డుపై కన్నేశాడు. తన కెరీర్‌లో ఇది 200ల మ్యాచ్ కావడంతో.. నీళ్లు తాగినంత సులువుగా 'డబుల్‌సెంచరీ'లు కొట్టే ఈ హిట్‌మ్యాన్ ఈ మ్యాచ్‌లో నాలుగో 'ద్విశతకం' బాదేయాలని చూస్తున్నాడు. మరోవైపు ప్రపంచకప్‌నకు పెద్దగా సమయం లేకపోవడం, మ్యాచ్‌ల సంఖ్య కూడా తక్కువగా ఉండటంతో ఇప్పడైనా కుర్రాళ్ల అవకాశం ఇస్తారా? లేదా? అన్నది తేలాల్సి ఉంది.

ఉదయం 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్-1లో


రోహిత్

హామిల్టన్: స్టార్ ఆటగాళ్లు అందుబాటులో ఉన్నా.. సమిష్టితత్వం లోపించిన న్యూజిలాండ్ ఇప్పుడు పరువు కాపాడుకునే పనిలో పడింది. సొంతగడ్డపై భారత్‌ను ఎదుర్కోలేక సిరీస్‌ను చేజార్చుకున్న విలియమ్సన్ బృందం కనీసం చివరి రెండు మ్యాచ్‌ల్లోనైనా గెలిచి ఊరట పొందాలని భావిస్తున్నది. ఈ నేపథ్యంలో గురువారం సెడాన్ పార్క్‌లో జరిగే నాలుగో వన్డేలో టీమ్‌ఇండియాతో అమీతుమీకి సిద్ధమైంది. ఇప్పటికే 3-0తో సిరీస్‌ను సాధించిన భారత్ ఈ మ్యాచ్‌లోనూ గెలిచి ఓ పెద్ద సిరీస్ విజయాన్ని ఖాతాలో వేసుకోవాలని భావిస్తున్నది. 1967 నుంచి కివీస్‌లో పర్యటిస్తున్న టీమ్‌ఇండియా ఇప్పటి వరకు 4-0 ఆధిక్యంతో సిరీస్‌ను గెలిచిన దాఖలాల్లేవు. దీంతో ఈ సిరీస్‌ను 5-0తో క్లీన్‌స్వీప్ చేసి గతంలో ఎన్నడూ సాధించని ఘనతను అందుకోవాలని ప్రణాళికలు రచిస్తున్నది. అలాగే ఈ చివరి రెండు మ్యాచ్‌ల్లో కుర్రాళ్లకు అవకాశం ఇచ్చి ప్రపంచకప్‌నకు ముందు మంచి ప్రాక్టీస్ కల్పించాలని కూడా యోచిస్తున్నది. ఓవరాల్‌గా ఈ టూర్‌ను చరిత్రలో నిలిచిపోయేలా ముగించాలని అటు ఆటగాళ్లు, ఇటు మేనేజ్‌మెంట్ సిద్ధమవుతున్నది.

గిల్ వస్తాడా?

తొడ గాయంతో మూడో వన్డేకు దూరమైన ధోనీ పరిస్థితి ఇంకా తేలకపోవడంతో కుర్రాళ్లను తీసుకునే అంశంపై సందిగ్ధత కొనసాగుతున్నది. అయితే మహీ గాయం పెద్దది కాదని, నెట్స్‌లో తీవ్రంగా శ్రమించాడని జట్టు వర్గాలు వెల్లడిస్తున్నా.. టాస్‌కు ముందే అతనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ధోనీ అందుబాటులో ఉంటే జట్టులో పెద్దగా మార్పులు ఉండకపోవచ్చు. కోహ్లీ స్థానంలో నేరుగా శుభ్‌మన్ గిల్‌కు అవకాశం ఇవ్వాలనుకున్నా కేదార్ జాదవ్‌ను పక్కనబెట్టే పరిస్థితి లేదు. ఒకవేళ ధోనీ, గిల్ ఇద్దర్ని తీసుకోవాలనుకుంటే దినేశ్ కార్తీక్‌కు విరామం తప్పదు. అప్పుడు రాయుడు, గిల్ వరుసగా మూడు, నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగుతారు. బౌలింగ్‌లో కుల్దీప్, చాహల్ స్థానాలు ఖాయం. ఈ ఇద్దరు కలిసి మూడు మ్యాచ్‌ల్లో 14 వికెట్లు తీశారు. ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్ నుంచి విరామం లేకుండా ఆడుతున్న షమీకి విశ్రాంతి ఇవ్వాలని మేనేజ్‌మెంట్ భావిస్తున్నది. ఇదే జరిగితే హైదరాబాదీ సిరాజ్, ఖలీల్ అహ్మద్‌లో ఒకరికి మరో అవకాశం దక్కుతుంది. వరల్డ్‌కప్ జట్టులో రిజర్వ్ పేసర్ స్థానం కోసం ఈ ఇద్దర్ని పరీక్షించాలనుకుంటున్నారు. స్ట్రయిక్ పేసర్‌గా భువనేశ్వర్, ఆల్‌రౌండర్‌గా పాండ్యా స్థానాలు పదిలం. ఓవరాల్‌గా తుది జట్టు కూర్పుపై ఇప్పటికే ఓ అంచనాకు వచ్చిన మేనేజ్‌మెంట్ ఇప్పుడు బోనస్‌గా ప్రత్యామ్నాయాలను పరీక్షిస్తే బాగుటుందని విశ్లేషకుల అంచనా.

కుల్దీప్‌ను ఆపేదెలా?

బలమైన బ్యాటింగ్ లైనప్ ఉన్నా.. మణికట్టు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు చెక్ పెట్టకపోవడంపై కివీస్ కెప్టెన్ విలియమ్సన్ తీవ్ర ఆందోళన చెందుతున్నాడు. భారత్ అన్ని రంగాల్లో తమను ఆడుకుందని బహిరంగంగానే అంగీకరించాడు. కాబట్టి ఈ మ్యాచ్‌కు తుది జట్టులో మార్పులు తప్పకపోవచ్చు. ఫామ్‌లో ఉన్న విలియమ్సన్ భారీ స్కోర్లు చేయకపోవడం లోటుగా కనిపిస్తున్నది. భారీ అంచనాలు పెట్టుకున్న గప్టిల్, మున్రో ఇప్పుడైనా గాడిలో పడతారా? వెటరన్ రాస్ టేలర్, లాథమ్ అప్పుడప్పుడు మెరుస్తున్నా.. నిలకడ లోపించింది. మ్యాచ్ పరిస్థితిని తారుమారు చేసే ఇన్నింగ్స్ కివీస్ లైనప్‌లో ఇప్పటి వరకు నమోదు కాలేదు. బ్రాస్‌వెల్, సోధీ స్థానంలో వచ్చిన నీషమ్, ఆస్టల్‌ను నేరుగా తుది జట్టులోకి తీసుకున్నారు. కనీసం వీళ్ల రాకతోనైనా ఆతిథ్య జట్టు విజయాలబాట పడుతుందేమో చూడాలి. బౌలింగ్‌లో పేసర్ ట్రెంట్ బౌల్ట్‌కు సహచరుల నుంచి సహకారం కరువైంది. ఫెర్గుసన్ అంచనాలను అందుకోలేకపోతున్నాడు. బౌలింగ్‌లో తమకు ఆయుధంగా నిలుస్తాడని భావించినా అతిపెద్ద బలహీనతగా తయారయ్యాడు. నికోలస్, సాంట్నెర్ పరిస్థితి మరి ఘోరంగా తయారైంది. కనీసం కొన్ని పరుగులు కూడా చేయలేకపోవడం ప్రతికూలంగా మారింది. పరిస్థితులను బట్టి ఓ స్పిన్నర్ స్థానంలో సౌతీని తీసుకునే అవకాశాలున్నాయి.


ధవన్

రోహిత్ @ 200

తాత్కాలిక కెప్టెన్‌గా మంచి రికార్డు ఉన్న రోహిత్‌కు వన్డే కెరీర్‌లో ఇది 200వ మ్యాచ్. ఇప్పటికే ఈ ఫార్మాట్‌లో మూడు డబుల్ సెంచరీలు బాదిన హిట్‌మ్యాన్ నాలుగో దానిపై కన్నేశాడు. విరాట్ లేని ప్రతిసారి జట్టును అద్భుతంగా నడిపించిన ఈ ముంబైకర్ 5-0తో సిరీస్‌ను గెలిచి కొత్త రికార్డును నెలకొల్పాలని భావిస్తున్నాడు. గతేడాది రోహిత్ సారథ్యంలోనే టీమ్‌ఇండియా ఆసియా కప్ విజేతగా నిలిచిన సంగతి తెలిసింది. వన్డేల్లో అత్యధిక పరుగుల రికార్డు, సిక్సర్ల రికార్డు ఇప్పటికే తన పేరు మీద నమోదు చేసుకున్న రోహిత్.. ఇప్పుడు కివీస్‌పై ఏ రికార్డు సాధిస్తాడో చూడాలి.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), ధవన్, రాయుడు, కార్తీక్, జాదవ్, ధోనీ, పాండ్యా, కుల్దీప్, భువనేశ్వర్, షమీ, చాహల్.
న్యూజిలాండ్: విలియమ్సన్ (కెప్టెన్), గప్టిల్, మున్రో, టేలర్, లాథమ్, నికోలస్, నీషమ్, సాంట్నెర్, ఆస్టల్, ఫెర్గుసన్, బౌల్ట్.

పిచ్, వాతావరణం

సెడాన్ పార్క్ పిచ్ బ్యాటింగ్‌కు స్వర్గధామం. గతంలో జరిగిన చివరి మూడు వన్డేల్లో 260-290 పరుగుల లక్ష్యాన్ని సులువుగా ఛేదించారు. ఈ మూడు మ్యాచ్‌ల్లో స్పిన్నర్లు రాణించారు. వర్షం ముప్పు లేదు.

భారత్ ఏ టెస్ట్ జట్టులోనూ రాహుల్‌కు చోటు



న్యూఢిల్లీ: డాషింగ్ ఓపెనర్ లోకేశ్ రాహుల్ ఇంగ్లండ్ లయన్స్ జట్టుతో జరిగే అనధికార టెస్ట్ మ్యాచ్‌కూ ఎంపికయ్యాడు. వచ్చేనెల 7 నుంచి 10వ తేదీవరకు జరిగే నాలుగురోజుల మ్యాచ్‌లో పాల్గొనే 14 మంది సభ్యుల భారత-ఏ జట్టుకు మహారాష్ట్ర ఆటగాడు అంకిత్ బావ్నే నాయకత్వం వహించనున్నాడు. తనపై విధించిన నిషేధాన్ని తాత్కాలికంగా బీసీసీఐ ఎత్తివేయడంతో ఇప్పటికే రాహుల్ ఇంగ్లండ్ ఏ జట్టుతో జరిగిన రెండు వన్డేల్లో ఆడిన విషయం తెలిసిందే. మహిళలపై టీవీ షోలో అభ్యంతరకర వ్యాఖ్యలతో పాండ్యా, రాహుల్‌పై విచారణ కోసం అంబుడ్స్‌మన్ ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. అంతేకాదు భారత సీనియర్ జట్టు పేసర్లు గాయపడితే వారి స్థానాలను భర్తీ చేయాలన్న ఆలోచనతోయువ పేసర్ అవేశ్‌ఖాన్ , వరుణ్ అరోన్‌కు జట్టులో చోటు కల్పించారు. గాయంతో జట్టుకు దూరమైన అరోన్ మళ్లీ పునరాగమనం చేయాలని తహతహలాడుతుండగా.. ఈ సీజన్‌లో వికెట్లవేట కొనసాగిస్తున్న అవేశ్ ఖాన్‌కు ఏ టెస్ట్ జట్టులో బెర్త్ ఖాయమైంది. వచ్చేనెల 7వ తేదీన రంజీ ఫైనల్ జరుగుతుండడంతో ఈ సీజన్‌లో ఫైనల్ చేరిన సౌరాష్ట్ర, విదర్భ జట్లకు చెందిన ఆటగాళ్లను జట్టులోకి ఎంపిక చేయలేదు.

భారత ఏ జట్టు : అంకిత్ బావ్నే(కెప్టెన్), కేఎల్ రాహుల్, ఏఆర్ ఈశ్వరన్, ప్రియాంక్ పంచాల్, రికీభుయ్, సిద్దేశ్ లాడ్, కేఎస్ భరత్(వికెట్ కీపర్)జలజ్ సక్సేనా, ఎస్ నదీం, మయాంక్ మర్కండే, నవదీప్ సైనీ, శార్దూల్ ఠాకూర్, అవేశ్‌ఖాన్, వరుణ్ అరోన్

మిడిల్ ఓవర్లలో వికెట్లు తీయాలి

సాంట్నెర్

హామిల్టన్: మ్యాచ్ మిడిల్ ఓవర్లలో వికెట్లు తీసే సత్తా లేకపోవడం వల్లే వన్డే సిరీస్‌ను కోల్పోయామని న్యూజిలాండ్ స్పిన్నర్ మిచెల్ సాంట్నెర్ అన్నాడు. నాలుగో వన్డేలో గెలిచి టీమ్‌ఇండియాపై ప్రతీకారం తీర్చుకుంటామన్నాడు. 'మా ప్రణాళికలు చాలా పకడ్బందీగా ఉన్నాయి. కానీ అమలు చేయడంలో విఫలమయ్యాం. తొలి ఐదు లేదా పది ఓవర్ల లోపు రెండు వికెట్లు తీస్తే ఫలితం వేరేగా ఉండేది. ప్రతి మ్యాచ్‌లో మంచి ఆరంభమే లభించింది. కానీ దానిని చివరి వరకు కాపాడుకోలేకపోయాం. మరింత దూకుడుగా ఆడుతూ మిడిల్ ఓవర్లలో వికెట్లు తీయాలి. మేం గెలువాలంటే ఈ వ్యూహం పక్కాగా అమలు చేయాలి. మూడో వన్డేలో టేలర్, లాథమ్ మంచి భాగస్వామ్యాలు నెలకొల్పారు. తర్వాతి ఒకటి, రెండు వికెట్లు పడటంతో కోలుకోలేకపోయాం. ప్రత్యర్థులు చాలా బాగా బౌలింగ్ చేశారు. తొలి 10 ఓవర్లలో వికెట్లు కోల్పోకుండా ఉంటే చివర్లో పవర్ హిట్టింగ్ చేసే వాళ్లం. అప్పుడు భారీ స్కోరు వచ్చేది' అని సాంట్నెర్ పేర్కొన్నాడు. టీమ్‌ఇండియా మణికట్టు స్పిన్నర్ల గురించి మాట్లాడుతూ.. ప్రస్తుతం కుల్దీప్-చాహల్ బంతిని స్లో పేస్‌తో బాగా టర్న్ చేస్తున్నారన్నాడు. తాను, సోధీ మరికొంత వేగంగా వికెట్లు తీయాల్సి ఉందన్నాడు. తాము ఎప్పుడు బ్యాటింగ్‌కు దిగినా ఒత్తిడి ఉండేదన్నాడు. తొలి 10 ఓవర్లలోనే రెండు వికెట్లు పడటంతో కుదురుకోవడానికి చాలా సమయం పడుతుందని సాంట్నెర్ వివరించాడు.

ఫైనల్లో హర్యానా హ్యామర్స్

ప్రో రెజ్లింగ్ లీగ్

గ్రేటర్ నోయిడా: స్థానిక కుస్తీ యోధుడు రజనీశ్ రాణించడంతో హర్యానా హ్యామర్స్ జట్టు ప్రో రెజ్లింగ్ లీగ్ 4వ సీజన్ ఫైనల్ చేరుకుంది. బుధవారం ఢిల్లీ సుల్తాన్స్‌తో జరిగిన సెమీఫైనల్లో 5-2 స్కోరుతో గెలిచి తుదిపోరుకు అర్హత సాధించింది. తొలుత 57 కేజీల విభాగంలో హర్యానా హ్యామర్స్ ఆటగాడు రవికుమార్, పంకజ్‌ను ఓడించి జట్టుకు శుభారంభం అందించాడు. మహిళల 76 కేజీల విభాగంలో కిరణ్(హర్యానా) అస్తాసియా శుస్తోవాను ఓడించగా హర్యానా రెజ్లర్ అస్తాసియా నిచితా మహిళల 57 కేజీల విభాగంలో కాథరినా హైడాచివ్‌స్కా (ఢిల్లీ)ను ఓడించింది. సతేందర్ మాలిక్ (ఢిల్లీ) పురుషుల 125 కేజీల విభాగంలో అలక్సేందర్ కోట్సియాన్విస్కీ(హర్యానా)చేతిలో ఓడాడు. సాక్షిమాలిక్ (ఢిల్లీ) 62 కేజీల విభాగంలో తాత్యాన ఓమ్లెంచ్‌కోను చిత్తు చేసింది. రజనీశ్ (హర్యానా) 65 కేజీల విభాగంలో ఆండ్రీ క్వియాత్కోవ్‌స్కీపై గెలిచాడు. చివరగా అలీ శబనోవ్(హర్యానా) 86 కేజీల విభాగంలో సంజీత్ కుందును ఓడించాడు.

డేవిస్ కప్‌లో ఇటలీని ఓడిస్తాం

మహేశ్ భూపతి


మహేశ్ భూపతి
జీషన్ అలీ
రామ్‌నాథన్

కోల్‌కతా: లియాండర్ సేవలను భారత జట్టు వినియోగించుకుంటుందని భారత డేవిస్‌కప్ జట్టు నాన్ ప్లేయింగ్ కెప్టెన్ మహేశ్ భూపతి స్పష్టం చేశాడు. డేవిస్‌కప్‌లో రికార్డుస్థాయిలో 43 విజయాలను పేస్ నమోదు చేసి ప్రపంచ రికార్డు సాధించారు. గతేడాది ఏప్రిల్‌లో జరిగిన ఆసియా-ఓషియానా గ్రూప్ రెండోరౌండ్‌లో లియాండర్ పేస్ లేకుండానే 3-2 స్కోరుతో చైనాను భారత్ ఓడించిన సంగతి తెలిసిందే. డేవిస్‌కప్ అర్హత మ్యాచ్‌లో భాగంగా వచ్చే శుక్రవారం నుంచి ఆదివారం వరకు ఇటలీ జట్టుతో భారతజట్టు తలపడనుంది. ఈ సందర్భంగా భారత జట్టులోని సింగిల్స్ ఆటగాళ్లు రామ్‌కుమార్ రామనాథన్, యువ ప్రజ్నేశ్‌లపై భూపతి ప్రశంసల వర్షం కురిపించాడు. 'రామ్‌నాథన్ కుడి చేతివాటం ఆటగాడు కాగా.. ప్రజ్నేశ్ ఎడమచేతి వాటం ఆటగాడు. వీరిద్దరి కలయిక అద్భుతం. అంతే కాదు సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో ప్రజ్నేశ్ 102వ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. అతని భారీ సర్వీసులతో ప్రత్యర్థులను కంగారు పెడతాడు. ఇలాంటి కలయికతో కూడిన సింగిల్స్ ఆటగాళ్లు జట్టులో ఉండాలని ఏ కెప్టెన్ అయినా కోరుకుంటాడు' అని భూపతి అన్నాడు. కుడి, ఎడమల కలయికతో క్రికెట్‌లో ఎలాంటి లాభం ఉంటుందో టెన్నిస్‌లోనూ అలాగే ప్రత్యర్థులపై పై చేయి సాధించేందుకు వీరిద్దరి కాంబినేషన్ ఉపయోగపడుతుందని చెప్పాడు.

సాకులు చెప్పే అవకాశం లేదు!

సొంతగడ్డపై పచ్చికతో కూడిన కోర్టుపై ఆడడంతో ఇటలీపై విజయం సాధించేందుకు భారత్‌కు అవకాశాలు పెరిగాయన్నాడు. ఇన్ని అనుకూలతలున్న సమయంలో ఓటమికి సాకులు చెప్పే అవకాశం ఎంతమాత్రం ఉండదని మహేశ్ భూపతి స్పష్టంగా చెప్పాడు. 'హార్డ్‌కోర్టు లేదా క్లే కోర్టులో ఇటలీ ఆటగాళ్లు చాలా అద్భుతంగా రాణిస్తారు. ఈ సమయంలో పచ్చని పచ్చికపై జరిగే అర్హత మ్యాచ్‌లో విజయాన్ని అందుకోవడం కష్టమనుకోను. ఇటలీని ఓడించేందుకు ఇది అత్యుత్తమ అవకాశమని నేను భావిస్తున్నాను' అని భూపతి ఆత్మ విశ్వాసం వ్యక్తం చేశాడు.

గడ్డిపై మాకు కష్టమే: బరాజ్జుటి



గ్రాస్‌కోర్టులపై భారత్‌తో తలపడాల్సి రావడం కొంచెం కష్టమేనని ఇటలీ డేవిస్‌కప్ జట్టు కెప్టెన్ బరాజ్జుటి అభిప్రాయం వ్యక్తం చేశాడు. బుధవారం కోల్‌కతాలో జరిగిన మీడియా సమావేశంలో అతను మాట్లాడుతూ గ్రాస్‌కోర్టుపై ఎలాంటి అసంతృప్తి లేదని స్పష్టంగా చెప్పాడు.'మా జట్టు గ్రాస్ కోర్టులపై తడబడుతుందన్న ఉద్దేశంతో భారత్ ఇలాంటి నిర్ణయం తీసుకుంది. మా జట్టు గ్రాస్‌కోర్టులపై ఎక్కువగా ఆడకపోయినా మాకు సమస్యగా మాత్రం మారదు. మేం అద్భుతంగా ఆడుతామని మాకు తెలుసు. భారత ఆటగాళ్లపై గౌరవాన్ని ప్రదర్శిస్తూనే మేం ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తాం' అని బరాజ్జుటి అన్నాడు. ప్రస్తుతం భారత్‌తో తలపడే ఇటలీ ఆటగాళ్లు డేవిస్‌కప్‌లో ఇప్పటివరకు గ్రాస్‌కోర్టుల్లో ఆడలేదు. అంతేకాదు భారత నయా స్టార్ ప్రజ్నేశ్ గుణేశ్వరన్, దివిజ్‌శరణ్ కూడా గ్రాస్ కోర్టుల్లో ఆడకపోవడం విశేషం. కాగా, గ్రాస్ కోర్టుల్లో బంతి విపరీతమైన బౌన్స్ కలిగి ఉంటుందని, ఇది ఆడేందుకు చాలా ఇబ్బందిని కలిగిస్తుందని బరాజ్జుటి తెలిపాడు. ప్రాక్టీస్ మ్యాచ్‌లకు ఉపయోగించే మైదానాలతో పోలిస్తే బంతి బౌన్స్ అయ్యే సెంటర్ కోర్ట్‌లో ఆడటం తమ జట్టుకు సవాల్ వంటిదని బరాజ్జుటి పేర్కొన్నాడు.

కొచ్చర్ తప్పు చేశారు!



- సంస్థ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారు
- స్వప్రయోజనాలకు పెద్దపీట వేశారు
- తేల్చిన జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ
- రాజీనామాను తొలగింపుగా ప్రకటించిన ఐసీఐసీఐ బ్యాంక్

న్యూఢిల్లీ, జనవరి 30: ఏండ్ల తరబడి విశ్వసనీయత మంటగలిసింది. సంస్థ చూపిన నమ్మకానికి విలువే లేకుండా పోయింది. నీతి, నిజాయితీలకు మారుపేరని అందలం ఎక్కిస్తే.. స్వప్రయోజనాలకే పెద్దపీట వేసినట్లు నిర్ధారణైంది. విజిల్‌బ్లోవర్ క్విడ్‌ప్రోకో (నీకిది-నాకది) ఆరోపణలే చివరకు నిజాలని తేలింది. అవును.. చందా కొచ్చర్ తప్పు చేశారని తేల్చింది జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ. ఐసీఐసీఐ బ్యాంక్-వీడియోకాన్ రుణం కేసులో బ్యాంక్ ఎండీ, సీఈవో హోదాలో కొచ్చర్ అక్రమాలకు పాల్పడ్డారని కమిటీ స్పష్టం చేసింది. బ్యాంక్ ప్రవర్తనా నియమావళిని కొచ్చర్ ఉల్లంఘించారని పేర్కొన్నది. కొచ్చర్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలపై సుప్రీం కోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి బీఎన్ శ్రీకృష్ణ నేతృత్వంలో ఓ కమిటీని వేసి ఐసీఐసీఐ బ్యాంక్ స్వతంత్ర విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. నిరుడు జూన్ 6న ఐసీఐసీఐ బ్యాంక్ ఆడిట్ కమిటీ.. దీన్ని నియమించిన సంగతీ విదితమే. ఈ క్రమంలో ఐసీఐసీఐ బ్యాంక్‌కు బుధవారం శ్రీకృష్ణ కమిటీ నివేదిక అందింది. నివేదికను క్షుణ్ణంగా పరిశీలించిన బ్యాంక్ బోర్డు.. వెనువెంటనే సమావేశమవగా, కొచ్చర్ గతంలో సమర్పించిన రాజీనామాను ఈ నివేదిక ఆధారంగా బ్యాంక్ అంతర్గత విధానాల కింద తొలగింపుగా ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

బోనస్‌లన్నీ ఇచ్చేయాల్సిందే

తాజా నివేదిక నేపథ్యంలో కొచ్చర్‌కు బ్యాంక్ నుంచి రావాల్సిన అన్ని ప్రయోజనాలు దూరమయ్యాయి. ప్రస్తుతం అందుతున్న, భవిష్యత్తులో రావాల్సిన నగదు మొత్తాలు, బోనస్ బకాయిలు లేదా ఇంక్రిమెంట్లు, ఇతరత్రా స్టాక్స్ లాభాలు, వైద్య సదుపాయాలను రద్దు చేస్తున్నట్లు ఐసీఐసీఐ బ్యాంక్ బోర్డు ప్రకటించింది. ఏప్రిల్ 2009 నుంచి మార్చి 2018 వరకున్న కాలానికి ఈ నిర్ణయం వర్తిస్తుందని ఓ ప్రకటనలో స్పష్టం చేసిన బోర్డు.. ఈ తొమ్మిదేండ్లలో పొందిన బోనస్‌లన్నీ కూడా తిరిగిచ్చేయాలనడం గమనార్హం. దీంతో ఇప్పటిదాకా తీసుకున్న 9 కోట్ల 61 లక్షల 65,140 రూపాయలను వెనుకకు ఇవ్వాల్సి వస్తున్నది. పదవీ విరమణ ప్రయోజనాలనూ నిలిపివేస్తున్నట్లు బోర్డు తేల్చిచెప్పింది. 56 ఏండ్ల కొచ్చర్.. తనపై వచ్చిన అవినీతి ఆరోపణల మధ్య నిరుడు జూన్ నుంచి సెలవులో ఉండగా, అక్టోబర్ 4న బ్యాంక్ ఎండీ, సీఈవో పదవుల నుంచి తప్పుకున్నారు. 1984లో ఐసీఐసీఐ బ్యాంక్‌లోకి మేనేజ్‌మెంట్ ట్రైనీగా ప్రవేశించిన కొచ్చర్.. అంచెలంచెలుగా ఎదుగుతూ 2009లో ఎండీ, సీఈవోగా నియమితులయ్యారు.

ఏం జరిగింది?

ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కమిటీలో ఉన్న చందా కొచ్చర్.. 2012లో వీడియోకాన్ గ్రూప్‌నకు రూ.3,250 కోట్ల రుణాన్ని మంజూరు చేశారు. ఇందుకుగాను ఆమె భర్త దీపక్ కొచ్చర్‌కు చెందిన సంస్థల్లో వీడియోకాన్ గ్రూప్ అధినేత వేణుగోపాల్ ధూత్ పెట్టుబడులు పెట్టారు. 2008లో దీపక్ కొచ్చర్, చందా కొచ్చర్ ప్రమోటర్లుగా వ్యవహరిస్తున్న నూపవర్ రెన్యువబుల్స్‌లో తొలుత పెట్టుబడులు పెట్టినవారిలో ధూత్ కూడా ఉన్నారు. అలా వచ్చిన షేర్లను ఆ తర్వాత చాలా తక్కువ ధరకు కొచ్చర్ కుటుంబానికే ధూత్ అమ్మేశారని విచారణల్లో తేలింది. ఒకప్పుడు అత్యంత సెలబ్రిటీ బ్యాంకరైన కొచ్చర్.. ఫోర్బ్స్ శక్తిమంత మహిళల స్థాయిలో వెలుగొందిన కొచ్చర్ చరిత్ర ఇప్పుడిలా మసకబారి దోషిగా నిలబడింది.

నివేదికలో ఏమున్నది?

సంస్థలో అత్యున్నత పదవిలో ఉంటూ.. తనకు అప్పగించిన విశ్వసనీయమైన విధుల్లో కొచ్చర్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డట్లు జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ గుర్తించింది. బ్యాంక్ ప్రయోజనాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలకు పెద్దపీట వేశారని పేర్కొన్నది. సంస్థ ప్రవర్తనా నియమావళిని తుంగలోతొక్కి, నష్టం చేకూర్చారన్నది. కొచ్చర్ నిర్ణయాలు బ్యాంక్ అంతర్గత విధానాలకు తూట్లు పొడిచాయని వివరించింది. కాగా, ఈ సమగ్ర దర్యాప్తు నేపథ్యంలో కొచ్చర్‌పై మరిన్ని ఏజెన్సీల దర్యాప్తులు మొదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే సీబీఐ ఎఫ్‌ఐఆర్ నమోదు చేసింది కూడా.

దారుణం: కొచ్చర్

ఐసీఐసీఐ బ్యాంక్ తనపట్ల తీసుకున్న నిర్ణయం చాలా బాధాకరమని, దిగ్భ్రాంతిని కలిగించిందని చందా కొచ్చర్ ఆవేదన వ్యక్తం చేశారు. 34 ఏండ్లుగా ఐసీఐసీఐ గ్రూప్‌లో పనిచేశానన్న ఆమె.. ఎంతో అంకితభావంతో, కష్టపడి పనిచేశానన్నారు. దశాబ్దకాలంపాటు బ్యాంక్‌కు సారథ్యం వహించిన కొచ్చర్.. దేశీయ బ్యాంకింగ్ రంగంలోనే తొలి మహిళా సీఈవో కావడం విశేషం. 'ఈ నిర్ణయం చాలా అసంతృప్తికరం. దిగ్భ్రాంతికి గురిచేసింది. నేను చా లా బాధపడుతున్నాను' అన్నారు. 1961 నవంబర్ 17న రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో జన్మించిన కొచ్చర్‌ను 2011లో కేంద్రం పద్మభూషణ్‌తో సత్కరించిన విషయం తెలిసిందే.

తగ్గిన ఐసీఐసీఐ బ్యాంక్ లాభం

దేశంలో అతిపెద్ద ప్రైవేట్ రంగ ఆర్థిక సేవల సంస్థయైన ఐసీఐసీఐ బ్యాంక్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.1,604.91 కోట్ల నికర లాభాన్ని మాత్రమే ఆర్జించింది. 2017-18 సంవత్సరం ఇదే కాలంలో వచ్చిన రూ.1,650 కోట్లతో పోలిస్తే 2.7 శాతం పతనం చెందింది. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం మాత్రం రూ.16,832.22 కోట్ల నుంచి రూ.20,163.25 కోట్లకు ఎగబాకింది. ఆస్తుల నాణ్యత ప్రమాణాలు స్వల్పంగా మెరుగుపడటంతో బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 7.75 శాతానికి తగ్గగా, నికర ఎన్‌పీఏ 2.58 శాతానికి తగ్గింది. అయినప్పటికీ మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ రూ.4,244.15 కోట్ల నిధులను వెచ్చించింది. విలువ పరంగా చూస్తే డిసెంబర్ 31, 2018 నాటికి బ్యాంక్‌కు రూ.51,591.47 కోట్ల మొండి బకాయిలు ఉన్నాయి. కన్సాలిడేటెడ్ బేసిక్‌గా చూస్తే బ్యాంక్ నికర లాభం ఒక్క శాతం పతనం చెంది రూ.1,874 కోట్లకు పరిమితమవగా, ఆదాయం రూ.33,433 కోట్లకు చేరుకున్నది. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి బ్యాంక్ షేరు ధర 5.29 శాతం లాభపడి రూ.365.25 వద్ద ముగిసింది.



ఆవహించిన బడ్జెట్ భయాలు

వెలుగులో బ్యాంకులు, మెటల్స్ ▪ ఫ్లాట్‌గా ముగిసిన ప్రధాన సూచీలు

బడ్జెట్ దగ్గర పడే కొద్దీ మార్కెట్లో అనిశ్చితి పెరుగుతూ వస్తున్నది. దానికితోడు జనవరి డెరివేటివ్స్ సిరీస్ సెటిల్‌మెంట్, అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశం నేపథ్యంలో ట్రేడర్లు కొత్త పొజిషన్లను తీసుకోవడానికి ఏ మాత్రం ఆసక్తి చూపలేదు. దీంతో ప్రధాన సూచీలు దాదాపు క్రితం స్థాయిలోనే ముగిశాయి. సెన్సెక్స్ కేవలం 1.25 పాయింట్ల నష్టంతోనూ, నిఫ్టీ కేవలం 0.4 పాయింట్ల లాభంతో ముగిశాయి. ఇండెక్స్ హెవీవెయిట్ షేర్లు ఐసీఐసీ బ్యాంక్, టాటాస్టీల్ షేర్లు 5 శాతం లాభపడడంతో సూచీల నష్టాలను నిలువరించాయి. అమెరికా, చైనాల మధ్య చర్చలు ఉదయం ప్రారంభం కావడంతో కూడా మార్కెట్లు చాలా అప్రమత్తతో వ్యవహరించాయి. మరో రెండు రోజుల్లో ప్రభుత్వం సంప్రదాయాలకు విరుద్ధంగా పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టవచ్చునన్న అంచనాలతో మార్కెట్లో అనిశ్చితి తారాస్థాయికి చేరుకుంది. బడ్జెట్ ప్రతిపాదనలపై అంచనాలు పెరిగిపోయాయి. మెటల్, బ్యాంకింగ్ షేర్లు పెరగ్గా, ఎఫ్‌ఎంసీజీ షేర్లు భారీ నష్టాలను చవిచూశాయి. స్మాల్‌క్యాప్ షేర్లు వెలుగులో ఉన్నాయి. మెటల్ ఇండెక్స్ 1.90 శాతం లాభపడగా, మీడియా 1.71 శాతం, బ్యాంక్ నిఫ్టీ 0.92 శాతం మేర లాభపడ్డాయి. కాగా, ఎఫ్‌ఎంసీజీ 0.99 శాతం నష్టపోగా, రియల్టీ 0.74 శాతం నష్టపోయింది. మిడ్‌క్యాప్-100 ఇండెక్స్ 0.51 శాతం, స్మాల్‌క్యాప్-100 ఇండెక్స్ 0.58 శాతం లాభాలతో ముగిశాయి. ఎన్‌ఎస్‌ఈలో 984 షేర్లు లాభాల్లో ముగిస్తే 809 షేర్లు నష్టాలపాలయ్యాయి. 28షేర్లు నష్టపోగా, 22 షేర్లు లాభపడ్డాయి. ఐసీఐసీఐ 6.21 శాతం, టాటాస్టీల్ 5.61 శాతం, యాక్సిస్‌బ్యాంక్ 4.58 శాతం, హిండాల్కో 2.91 శాతం లాభంతో ముగిశాయి. ఇండియాబుల్స్ హౌజింగ్ ఫైనాన్స్ 4.81 శాతం, ఆదానీ పోర్ట్స్ 3.22 శాతం, బజాజ్ ఆటో 2.95 శాతం, కోటక్ బ్యాంక్ 2.59 శాతం నష్టపోయాయి. ఎఫ్‌ఐఐలు రూ.130.25 కోట్లు, డీఐఐలు రూ. 502.26 కోట్ల విలువైన షేర్లు కొనుగోలు చేశారు.

ఎన్‌టీపీసీ 1:5 బోనస్

- రూ.3.58 మధ్యంతర డివిడెండ్ ప్రకటన
- మూడో త్రైమాసికంలో రూ.2,385 కోట్ల లాభం

న్యూఢిల్లీ, జనవరి 30: ప్రభుత్వరంగ విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎన్‌టీపీసీ నిరాశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్ 31తో ముగిసిన మూడు నెలలకాలంలో కంపెనీ రూ.2,385.41 కోట్ల లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.2,360.81 కోట్లతో పోలిస్తే ఫ్లాట్‌గా ముగిసింది. ఇంధన ధరలు పెరుగడం, తీసుకున్న రుణాలకు వడ్డీల చెల్లింపులు అధికమవడం కంపెనీ ఫలితాలపై ప్రతికూల ప్రభావం చూపింది. మరోవైపు బుధవారం సమావేశమైన కంపెనీ బోర్డు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నది. మధ్యంతర డివిడెండ్‌తోపాటు వాటాదారులకు బోనస్ షేరును ప్రకటించింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 15.27 శాతం ఎగబాకి రూ.24,308.01 కోట్లుగా నమోదైంది. 2017-18 వార్షిక సంవత్సరంలో ఇది రూ.21,087.84 కోట్లుగా ఉన్నది. ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్యకాలంలో రూ. 69,633.95 కోట్ల ఆదాయంపై రూ. 7,399.57 కోట్ల లాభాన్ని గడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు 35.8 శాతం లేదా రూ.3.58 మధ్యంతర డివిడెండ్ ప్రతిపాదనకు బోర్డు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. వచ్చే నెల 14న ఈ డివిడెండ్ చెల్లింపులు జరుపనున్నది. దీంతోపాటు 1:5 రేషియోలో బోనస్ షేరును ప్రకటించింది సంస్థ. అంటే ప్రతి ఐదు షేర్లు కలిగిన వారికి మరో షేరు ఉచితంగా లభించనున్నదన్న మాట. మొత్తంమీద గత త్రైమాసికంలో సంస్థ 70.07 బిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసింది. విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి 1.9 లక్షల టన్నుల బొగ్గును దిగుమతి చేసుకున్నది.

ఫాక్స్‌కాన్ టెక్నాలజీ కేంద్రం

- తెలంగాణ ఎలక్ట్రానిక్స్ విభాగంతో ఒప్పందం
- హైదరాబాద్ కేంద్రంగా ఇండియా ఆర్ అండ్ డీ సెంటర్



హైదరాబాద్‌లో అడ్వాన్స్‌డ్ ఇండస్ట్రియల్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సెంటర్ ఏర్పాటు కోసం రాష్ట్ర ఐటీ విభాగంతో ఒప్పందం కుదుర్చుకుంటున్న ఫాక్స్‌కాన్ సంస్థ ప్రతినిధులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్ టెక్నాలజీ గ్రూపు నగరంలో అడ్వాన్స్డ్ ఇండస్ట్రీయల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అధ్యయనం, అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ మేరకు ఫాక్స్‌కాన్ డైరెక్టర్ మైకేల్ యాంగ్, తెలంగాణ ఐటీ శాఖకు చెందిన ఎలక్ట్రానిక్స్ విభాగ డైరెక్టర్ సుజయ్ కారంపురిలు బుధవారం ఒప్పంద పత్రాల మీద సంతకాలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ మాట్లాడుతూ.. ఇండస్ట్రీయల్ ఏఐ (కృత్రిమ మేధస్సు), ఇండస్ట్రీయల్ ఐవోటీ (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్)లకు హైదరాబాద్ గ్లోబల్ హబ్‌గా మారనున్నదని అభిప్రాయపడ్డారు. భాగ్యనగరంలో విద్యాధికులకు, టెక్నాలజీ నిపుణులకు కొదవలేదని అన్నారు. అందుకే, హైదరాబాద్‌లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ విభాగానికి చక్కటి ఆదరణ ఉంటుందని అభిప్రాయపడ్డారు. నిపుణులైన యువత సంఖ్యకు కొదవే లేదని, దీనికి పరిశ్రమ సాయం లభిస్తే మరింత మెరుగ్గా అభివృద్ధి చెందుతున్నదని అన్నారు. అధ్యయన, అభివృద్ధి కేంద్రం ద్వారా ఫాక్స్‌కాన్ టెక్నాలజీ సేవల్ని అందిస్తుందన్నారు. క్లౌడ్ కంప్యూటింగ్, మొబైల్ పరికరాలు, ఐవోటీ, బిగ్ డేటా, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, నెట్‌వర్క్ ట్రాన్స్‌మిషన్, 8కే+5జీ ఆటోమేటెడ్ రోబోటిక్స్ వంటి విభాగాల్లో సేవలను అందజేస్తుందని వెల్లడించారు. ఈ సంస్థ భారత్‌లో చేపట్టే కార్యకలాపాల్ని హైదరాబాద్ నుంచి నిర్వహిస్తుందని తెలిపారు. తెలంగాణ ఐటీ శాఖకు చెందిన ఎలక్ట్రానిక్స్ విభాగం ఐటీ, టెక్నాలజీ రంగాల్ని అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తున్నది. డిజిటల్ ఇండియాకు సంబంధించిన కార్యక్రమాల్ని చేపట్టడం, ఐటీ పరిష్కారాల్ని కనుగొనడం వంటివి ఈ విభాగమే చేపడుతున్నది.

హోండా స్కిల్ సెంటర్

- పాతబస్తీ ప్రభుత్వ ఐటీఐలో ఏర్పాటు

హైదరాబాద్, జనవరి 30: ప్రముఖ ఆటో రంగ సంస్థ హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (హెచ్‌ఎంఎస్‌ఐఎల్) హైదరాబాద్‌లో ఓ నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభించింది. పాతబస్తీలోని ప్రభుత్వ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (ఐటీఐ)లో దీన్ని ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్‌తో గతేడాది ఆగస్టులోనే ఒప్పందాన్ని (ఎంవోయూ) కుదుర్చుకున్న హోండా.. అందులో భాగంగానే ఈ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఆవిష్కరించింది. యువతలో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని, ఈ క్రమంలోనే నాలుగు నెలల్లో దేశవ్యాప్తంగా 10 కేంద్రాలను నెలకొల్పామని బుధవారం ఓ ప్రకటనలో హెచ్‌ఎంఎస్‌ఐఎల్ కస్టమర్ సర్వీస్ సీనియర్ ఉపాధ్యక్షుడు ప్రదీప్ పాండే తెలియజేశారు. 2020లో బీఎస్-6 నిబంధనల అమలుతో భారతీయ ఆటోమొబైల్ పరిశ్రమ.. ప్రపంచ స్థాయిలో పరుగులు పెట్టగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు

టాప్‌గేర్‌లో బజాజ్

- క్యూ3లో 20 శాతం పెరిగిన లాభం

న్యూఢిల్లీ, జనవరి 30: ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ బజాజ్ ఆటో తన ఆర్థిక ఫలితాల్లో దూసుకుపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.1,220.77 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. 2017-18 ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి ఆర్జించిన రూ.1,013.16 కోట్ల లాభంతో పోలిస్తే 20.49 శాతం వృద్ధి కనబరిచింది. అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 19.49 శాతం పెరిగి రూ.7,879.34 కోట్లుగా నమోదైనట్లు బీఎస్‌ఈకి సమాచారం అందించింది. అమ్మకాల విషయానికి వస్తే 12,59,828 యూనిట్లుగా ఉన్నాయి. వీటిలో దేశవ్యాప్తంగా 6,44,093 యూనిట్లను విక్రయించగా, 5,24,717 యూనిట్లను ఇతర దేశాలకు ఎగుమతి చేసింది సంస్థ.

కార్పొరేట్ పన్ను తగ్గించాలి

- ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని పెంచాలి
- పీహెచ్‌డీ చాంబర్ డిమాండ్

న్యూఢిల్లీ, జనవరి 30: రాబోయే బడ్జెట్‌లో వ్యాపార, పారిశ్రామిక వర్గాలందరికీ కార్పొరేట్ పన్నును 25 శాతానికి తగ్గించాలని పీహెచ్‌డీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు రాజీవ్ తల్వార్ డిమాండ్ చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను శుక్రవారం పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికలుండటంతో ఈసారి బడ్జెట్ మధ్యంతర బడ్జెట్ కానున్న సంగతీ విదితమే. కాగా, అరుణ్ జైట్లీ అమెరికాలో చికిత్స పొందుతుండటంతో తాత్కాలిక ఆర్థిక శాఖ మంత్రి హోదాలో పియూష్ గోయలే ఫిబ్రవరి 1న ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ క్రమంలో వార్షిక ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని కనీసం రూ.3.5 లక్షలకైనా పెంచాలని తల్వార్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇది రూ.2.5 లక్షలుగా ఉన్నది తెలిసిందే. దేశీయ నిర్మాణ రంగ దిగ్గజం డీఎల్‌ఎఫ్ సీఈవోగా కూడా ఉన్న తల్వార్.. గృహ, నిర్మాణ రంగాల్లో నిరంతర సంస్కరణలతో నైపుణ్యంలేని, పాక్షిక నైపుణ్యం ఉన్న, నైపుణ్యం కలిగిన లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టించవచ్చన్నారు.

ద్రవ్య లక్ష్యాలు నెరవేరవచ్చు: ఎస్‌బీఐ రిసెర్చ్

గత బడ్జెట్‌లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2018-19)గాను నిర్దేశించిన ద్రవ్యలోటు లక్ష్యాలు నెరవేరవచ్చన్న అభిప్రాయాన్ని ఎస్‌బీఐ రిసెర్చ్ వెలిబుచ్చింది. జీడీపీలో 3.3 శాతానికి ద్రవ్యలోటును కట్టడి చేస్తామని మోదీ సర్కారు నిరుడు లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో చాలా రేటింగ్ ఏజెన్సీలు ఇది సాధ్యం కాకపోవచ్చన్న అంచనాలను వ్యక్తం చేయగా, ఎస్‌బీఐ రిసెర్చ్ మాత్రం సాధ్యపడవచ్చని అంటున్నది. అలాగే ఈసారి బడ్జెట్‌లో ద్రవ్యలోటును జీడీపీలో 3.2 శాతానికి కట్టడి చేస్తామన్న లక్ష్యాన్ని ప్రభుత్వం పెట్టుకోవచ్చని చెప్పింది. ఇదిలావుంటే భారతీయ సావరిన్ బాండ్ల రాబడి 7.6 శాతాన్ని తాకవచ్చని డీబీఎస్ గ్రూప్ అంచనా వేసింది.

పసిడి పరుగులు

- రూ.34 వేలు దాటిన తులం బంగారం ధర



న్యూఢిల్లీ, జనవరి 30: పసిడి మరింత పరుగులు పెట్టింది. బంగారం ధర బుధవారం రూ.34 వేల మార్క్‌ను దాటింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర మరో రూ.320 పెరిగి రూ.34,070కి చేరుకున్నది. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు అనూహ్యంగా మద్దతు లభించడంతో దేశీయంగా ధరలు పుంజుకున్నాయని ఆల్ ఇండియా సరాఫ్ అసోసియేషన్ ఒక ప్రకటనలో వెల్లడించింది. పసిడితోపాటు వెండి మరింత బలపడింది. కిలో వెండి ధర రూ.330 పెరిగి రూ.41,330గా నమోదైంది. ముంబైలో రూ.33,110 పలికిన బంగారం ధర, వెండి రూ.40,075గా నమోదైంది. వాణిజ్య యుద్ధంపై అమెరికా-చైనా దేశాల మధ్య జరుగుతున్న చర్చల్లో ఎలాంటి పురోగతి లేకపోవడం, చైనాకు చెందిన టెలికం సంస్థ హువావీ కంపెనీ ప్రతినిధిపై క్రిమినల్ కేసు నమోదుకావడంతో పెట్టుబడిదారులు సురక్షితమైన అతి విలువైన లోహాలవైపు మళ్లించడం ధరలు ఎగువముఖం పట్టడానికి ప్రధాన కారణమని ట్రేడర్ విశ్లేషించారు.

మరో రెండు లాజిస్టిక్ పార్కులు



ఫిక్కీ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఐటీ కార్యదర్శి జయేష్ రంజన్, ఆర్బీఐ మాజీ గవర్నర్ వై వీ రెడ్డి

- రాష్ట్రంలో ఏర్పాటు చేయబోతున్న అదానీ, వెల్‌స్పన్
- నాలుగున్నరేండ్లలో రూ.1.55 లక్షల కోట్ల పెట్టుబడులు
- పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ర్టానికి గత నాలుగున్నర సంవత్సరాల్లో 8500 పరిశ్రమల ద్వారా 21 బిలియన్ డాలర్ల(రూ.1.5 లక్షల కోట్లు) పెట్టుబడులు వచ్చాయని రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. హైదరాబాద్‌లో ఇండస్ట్రీ బాడీ ఫిక్కీ ఏర్పాటు చేసిన జాతీయ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం లాజిస్టిక్ పార్క్‌లకు అనువైనదిగా కొనసాగుతున్నదని, ఇప్పటికే జాతీయ సంస్థలు ఇక్కడే పార్క్‌లను ఏర్పాటు చేయగా..తాజాగా అదానీ, వెల్‌స్పన్ సంస్థలు రెండు లాజిస్టిక్‌లు ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చాయని ఆయన వివరించారు. వీటి ఏర్పాటుకు సంబంధించి ప్రక్రియ కొనసాగుతుందన్న ఆయన... రెండు సంస్థలు వేరు వేరుగా లాజిస్టిక్ పార్కులు ఏర్పాటు చేస్తాయన్నారు. లాజిస్టిక్ పార్క్‌ల ఏర్పాటుకు హైదరాబాద్ ఎంతో అనుకూలమైనదన్నారు. భౌగోళికంగా ఉన్న అనుకూలతలు ఇక్కడ లాజిస్టిక్ పార్కులు ఏర్పాటుకు అనుకూలమైనవన్నారు. అలాగే ఆతిథ్య సేవల సంస్థయైన ఓయో...బిజినెస్ టూ బిజినెస్(బీ2బీ)ను మరింత విస్తరించడంలో భాగంగా వెడ్డింగ్, హాలీడే ప్యాకేజ్ సేవలకోసం ఇక్కడే టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ఉత్సుకత చూపుతుందన్నారు. వీటితో పాటు ప్రపంచ ఈ-కామర్స్‌లో దిగ్గజం అమెజాన్ ఆసియాలోనే అతి పెద్ద ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించబోతున్నదని అన్నారు. సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలను ఆదుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దండు మల్కాపూర్ వద్ద 375 ఎకరాల్లో గ్రీన్ ఇండస్ట్రీయల్ పార్కును ఏర్పాటు చేస్తున్నామన్న ఆయన..దీనితో పాటుగా ప్లాస్టిక్ పార్క్‌ను వంద ఎకరాల్లో నెలకొల్పుతున్నది. మెకిన్ తెలంగాణలో భాగంగా ఎలక్ట్రానిక్, ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్ పార్క్‌లను కూడా ఏర్పాటు చేయడానికి ప్రత్యేకంగా రూపకల్పన చేశామన్నారు. ఎగుమతులను ప్రోత్సహించడానికి ఇప్పటికే పలు చర్యలు తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం దీని కోసం డ్రై పోర్టును ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరిశ్రమల స్థాపనలో భాగంగా భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వడానికి ఇతర రాష్ర్టాల్లో అయితే ఆరు నెలల వరకు సమయం పడుతుందని, కానీ తెలంగాణలో స్వీయ ధృవీకరణ పత్రం ద్వారా 15 రోజుల్లోనే అనుమతులు ఇస్తున్నామన్నారు. దేశంలో అత్యధిక ల్యాండ్ బ్యాంక్ ఉన్న రాష్ట్రంగా కొనసాగుతున్న తెలంగాణలో 1.50 లక్షల ఎకరాలు అందుబాటులో ఉందన్నారు. పరిశ్రమల్లో అవసరమైన నైపుణ్య ఉద్యోగుల కోసం టాస్క్ ద్వారా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫిక్కీ జాతీయ అధ్యక్షులు సందీప్ సోమాని, ఆర్బీఐ మాజీ గవర్నర్ డాక్టర్ వైవీ రెడ్డి, తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ టీ పాపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీమా రంగంలోకి తపాలా శాఖ

న్యూఢిల్లీ, జనవరి 30: ఇప్పటికే పేమెంట్ బ్యాంక్ సేవలు ఆరంభించిన ప్రభుత్వరంగ సంస్థ తపాలాశాఖ..తాజాగా జీవిత బీమా రంగంలోకి అడుగుపెట్టబోతున్నది. ఇందుకోసం ప్రత్యేక సంస్థను ఆరంభించనున్నట్లు కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి మనోజ్ సిన్హా తెలిపారు. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థల ఏర్పాటుకు సంబంధించి త్వరలో క్యాబినెట్‌ను నోట్ పంపనున్నట్లు ఆయన వెల్లడించారు. తొలి విడుతలో ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయడం జరుగుతుందని, రెండో విడుతలో పూర్తి స్థాయిలో బీమా పనులను ప్రారంభించనున్నట్లు ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్(ఐపీపీబీ) రెండో వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ఈ విషయాలు వెల్లడించారు. ఈ బీమా రంగ సంస్థల ఏర్పాటుకు సంబంధించి వచ్చే పదిహేను రోజుల్లో క్యాబినెట్ అనుమతించే అవకాశం ఉందని ఆయన సూచనప్రాయంగా చెప్పారు. గడిచిన ఐదు నెలల్లోనే ఐపీపీబీ 1.26 లక్షల యాక్సిస్ పాయింట్లు ఏర్పాటు చేయడం జరిగిందని, వచ్చే పదిరోజుల్లో మరో పదివేల పాయింట్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు.

కోబ్రాపోస్ట్ వార్తల్లో నిజం లేదు

- ఆరోపణల్ని కొట్టిపారేసిన డీహెచ్ఎఫ్ఎల్

ముంబై, జనవరి 30: ఆన్‌లైన్ న్యూస్ పోర్టల్ కోబ్రాపోస్ట్‌లో వచ్చిన కథనం.. నిజం కాదని డీహెచ్ఎఫ్ఎల్ వ్యవస్థాపకుడు వాధవాన్ ఖండించారు. రూ.31,000 కోట్లకుపైగా రుణాలు పక్కదారిపట్టాయనడం నిరాధారమన్నారు. బుధవారం ఇక్కడ నిర్వహించిన ఓ ఇన్వెస్టర్ కాల్‌లో డీహెచ్ఎఫ్ఎల్ ఛైర్మన్ కపిల్ వాధవాన్ మాట్లాడుతూ 'డీహెచ్ఎఫ్ఎల్ ఏ షెల్ కంపెనీలకు రుణాలివ్వలేదు. అలాగే ఏ ఒక్కరికో చెందిన సంస్థలకూ అక్రమంగా మంజూరు చేయలేదు. ఇప్పుడిలా చెప్పాల్సి రావడం బాధాకరం. ఒక్కటిమాత్రం స్పష్టం చేయగలను. డీహెచ్ఎఫ్ఎల్ ఓ మచ్చలేని కార్పొరేట్ సంస్థ' అని అన్నారు.

ఎన్నికలకు ముందు

మతఘర్షణలు!

- **అమెరికా నిఘా అధికారి హెచ్చరిక**

వాషింగ్టన్: వచ్చే లోక్‌సభ ఎన్నికలకు ముందు అధికార బీజేపీ హిందూ జాతీయవాద విధానాలను తీవ్రతరం చేస్తే భారత్‌లో మత ఘర్షణలు చోటుచేసుకునేందుకు ఎక్కువ ఆస్కారం ఉందని అమెరికా నిఘా అధికారి హెచ్చరించారు. ఈ ఏడాది ప్రపంచం ఎదుర్కొనబోయే ముప్పుల గురించి అమెరికా జాతీయ నిఘా విభాగం డైరెక్టర్ డాన్ కోట్స్.. సెనేట్ సెలక్ట్ కమిటీకి నివేదిక సమర్పించారు. ఆయనతోపాటు మరికొంత మంది నిఘా అధికారులు కూడా తమ అంచనాలను కమిటీకి అందజేశారు. మోదీ హయాంలో పలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మత ఉద్రిక్తతలు పెరిగాయని కోట్స్ పేర్కొన్నారు. మత ఘర్షణలు పెరుగుతున్న కారణంగా ఇస్లామిక్ టెర్రరిస్టుల ప్రాబల్యం పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వచ్చే మే వరకు భారత్, పాకిస్థాన్ మధ్య సంబంధాలు ఉద్రిక్తంగానే ఉంటాయని పేర్కొన్నారు. పాక్ మద్దతు ఉన్న పలు మిలిటెంట్ సంస్థలు భారత్, ఆఫ్ఘనిస్థాన్‌లపై దాడులు కొనసాగించవచ్చని హెచ్చరించారు.

కర్ణాటకలో మద్య నిషేధం కోరుతూ

మహిళల 400 కిలోమీటర్ల పాదయాత్ర

బెంగళూరు, జనవరి 30: కర్ణాటకలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది మహిళలు 400లకుపైగా కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. ఈ నెల 19న రాయచూర్‌లో ప్రారంభమైన వీరి పాదయాత్ర బుధవారం రాజధాని బెంగళూరుకు చేరుకుంది. రాష్ట్ర విధాన సభను ముట్టడించడానికి వెళ్తున్న వీరిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పాపమ్మ అనే కార్యకర్త మాట్లాడుతూ ప్రభుత్వం మద్యాన్ని ఆదాయ వనరుగా చూడటం సరికాదని, రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మద్యనిషేధ ఆందోళన్ ఆధ్వర్యంలో ఈ పాదయాత్ర జరిగింది.



చలికి గడ్డకట్టిన అమెరికా



చికాగోలో గడ్డ కట్టిన మిచిగన్ సరస్సు

- హిమఖండంలా మారిన మిడ్‌వెస్ట్ ప్రాంతం
- పలు ప్రాంతాల్లో మైనస్ 27 డిగ్రీల ఉష్ణోగ్రత
- మైనస్ 65 డిగ్రీలకు క్షీణిస్తుందని అంచనా
- ఆర్కిటిక్ నుంచి వీస్తున్న శీతల గాలులే కారణం
- ఇండ్ల నుంచి ఎవరూ బయటికి రావద్దని హెచ్చరిక
- పలు రాష్ట్రాల్లో కోల్డ్ ఎమర్జెన్సీ ప్రకటన
- విద్యా, వ్యాపార సంస్థలు, కార్యాలయాలు మూసివేత
- వందల విమాన సర్వీసులు రద్దు

గజగజ వణుకుతున్న జనం

లక్షలాది మంది ప్రాణాలకు ముప్పు


చికాగో: అగ్రరాజ్యం అమెరికాలో ఈ ఏడాది శీతాకాల మంచు దడపుట్టిస్తున్నది. ఉత్తర ధ్రువంలోని ఆర్కిటిక్ నుంచి వీస్తున్న తీవ్ర చలిగాలులతో అమెరికా పశ్చిమ మధ్య (మిడ్ వెస్ట్) ప్రాంతం హిమఖండంలా మారిపోయింది. దీంతో అక్కడి లక్షల మంది ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటున్నారు. డకోటా నుంచి ఓహియో వరకు దాదాపు డజను రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. చలి గతంలో ఎన్నడూ లేనంత రికార్డు స్థాయికి చేరింది. చికాగోతో పాటు పలు ప్రాంతాల్లో మైనస్ 27 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయింది. బుధవారం చలిగాలులు దేశంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తాయన్న నిపుణుల అంచనాతో అధికారులు పాఠశాలలతోపాటు కార్యాలయాలను, వాణిజ్య సముదాయాలను మూసివేశారు. పోస్టల్ సర్వీసులతోపాటు వందల విమాన సర్వీసులను రద్దు చేశారు. పలు కంపెనీలు తమ ఉద్యోగులను ఇండ్లలోనే ఉండాలని సూచించాయి. దేశంలోని చాలా ప్రాంతాల్లో బుధవారం మైనస్ 10 నుంచి మైనస్ 40 సెల్సియస్ డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, మిన్నెసోటాలో ఉష్ణోగ్రత మైనస్ 65 డిగ్రీల వరకు పతనమయ్యే అవకాశమున్నదని జాతీయ వాతావరణ కేంద్రం (ఎన్‌డబ్ల్యూఎస్) అంచనా వేసింది. చికాగోలో చలి అంటార్కిటికాలోని ప్రాంతాల్లో కంటే తీవ్రంగా ఉండవచ్చున్నది. ఈ విపత్కర పరిస్థితులను అధిగమించేందుకు ఇల్లినాయిస్, మిచిగాన్, విస్కాన్సిన్ తదితర రాష్ట్రాల్లో అత్యవసర చర్యలు చేపట్టారు. సాధ్యమైనంత వరకు బుధవారం ఎవరూ బయటికి రావద్దని ప్రజలకు సూచించినట్టు ఇల్లినాయిస్ గవర్నర్ జేబీ ప్రిజ్కర్ తెలిపారు. ఎవరైనా ఇండ్ల నుంచి బయటికి వస్తే కేవలం కొద్ది నిమిషాల్లోనే 'ఫ్రాస్ట్‌బైట్'కు గురై ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుందని ఎన్‌డబ్ల్యూఎస్ హెచ్చరించింది. చికాగోలో చలి తీవ్రత మరింత అధికంగా ఉండటంతో ప్రజల రక్షణకు దాదాపు 160 వార్మింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఆ నగర మేయర్ రహ్మ ఇమాన్యుయేల్ తెలిపారు. చలి నుంచి బయటపడేందుకు వీలుగా మినియాపోలిస్‌లో ప్రజలను పబ్లిక్ బస్సులు, రైళ్లలో ఉండేందుకు అనుమతిస్తున్నారు. వాషింగ్టన్‌లో కోల్డ్ ఎమర్జెన్సీని ప్రకటించడంతోపాటు ఇండ్లు లేనివారి కోసం అదనపు సేవలను ప్రారంభించారు. మంగళవారం చికాగోలో 400కి పైగా విమాన సర్వీసులను, అట్లాంటా లో మరో 300 సర్వీసులను రద్దు చేశారు. కెనడాలోనూ పరిస్థితి అధ్వానంగా మారింది. వెస్టన్ ప్రయిరీస్ ప్రాంతంలోని మనితోబా నుంచి అట్లాంటిక్ సీబోర్ట్ వరకు తీవ్రమైన శీతల పరిస్థితుల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం హెచ్చరించింది. ఒట్టావా ఎయిర్‌పోర్టులో రికార్డు స్థాయిలో మంచు కురువడంతో దాదాపు 50 విమాన సర్వీసులను, టొరంటోలో మరో 200 విమాన సర్వీసులను అధికారులు రద్దు చేశారు.

ఎందుకిలా?

వాతావరణ మార్పులతో ఒక వైపు భూగోళం వేడెక్కుతుంటే మరోవైపు శీతాకాలంలో ఉష్ణోగ్రతలు వేసవి కంటే వేగంగా పెరుగుతున్నాయి. ప్రస్తుత ఉష్ణోగ్రతలు నీరు గడ్డకట్టే స్థాయి కంటే మరింత దిగువకు పడిపోవడం చాలా మందిని ఆశ్చర్యపరుస్తున్నది. భూగోళం వేడెక్కుతుంటే శీతాకాలంలో చలి విపరీతంగా ఎందుకు పెరుగుతున్నదని పలువురు ప్రశ్నిస్తున్నారు. 'అమెరికా పశ్చిమ మధ్య ప్రాంతంలో ప్రస్తుతం ఉష్ణోగ్రతలు మైనస్ 60 డిగ్రీలకు చేరుకోవడంతో అత్యంత శీతల పరిస్థితులు కొనసాగుతున్నాయి. దీంతో ప్రజలు కనీసం ఒక్క నిమిషం కూడా బయట ఉండలేకపోతున్నారు. ముందు అక్కడ చలి తీవ్రత మరింత పెరుగుతుందని నిపుణుల అంచనా. అసలు గ్లోబల్ వార్మింగ్‌తో జరుగుతున్నదేమిటి?' అని ట్రంప్ సోమవారం ట్వీట్ చేశారు. ఈ ప్రశ్నకు సమాధానం వాతావరణానికి (క్లైమేట్‌కు), స్థానిక వాతావరణ పరిస్థితులకు (లోకల్ వెదర్‌కు) మధ్య గల వ్యత్యాసంలో ఇమిడి ఉన్నది. దీర్ఘకాలిక వాతావరణ పరిస్థితులను క్లైమేట్ అని, తాత్కాలిక వాతావరణ పరిస్థితులను వెదర్ అని అంటారు.ఓ కోటీశ్వరుడు తన వాలెట్‌ను (పర్సును) పోగొట్టుకున్నా పేదవాడైపోడని, ఓ పేదవాడికి రాత్రికి రాత్రే భారీ మొత్తంలో సొమ్ము లభించినా దాన్ని ఎంతకాలం నిలబెట్టుకోగలుగుతాడన్న దాన్నిబట్టే అతడు ధనికుడు అవుతాడని, వాతావరణాన్ని కూడా ఇలాగే అర్థం చేసుకోవాలని నిపుణులు అంటున్నారు.

ఆస్ట్రేలియాపై సూర్య ప్రతాపం

- గతంలో ఎన్నడూ లేని విధంగా పెరిగిపోతున్న ఎండలు
- పోర్ట్ అగస్టాలో రికార్డు స్థాయిలో 49.5 డిగ్రీల సెల్సియస్ నమోదు
- లక్షల సంఖ్యలో చేపల మృతి



డార్లింగ్ నదిలో భారీగా చనిపోయిన చేపలు

సిడ్నీ: శీతల దేశం ఆస్ట్రేలియాలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. నాలుగైదు రోజులుగా వాతావరణంలో మార్పులతో ఎండలు మండిపోతున్నాయి. దీంతో ప్రజలు నానాఅవస్థల పాలవుతున్నారు. లక్షల సంఖ్యలో చేపలు మృత్యువాతపడుతున్నాయి. సోమవారం మెల్‌బోర్న్‌లో 42.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇక్కడ 2014 జనవరి 17న 43.9 డిగ్రీల సెల్సియస్, 2009 ఫిబ్రవరి 7న 46.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా.. చాలా ఏండ్ల తర్వాత మళ్లీ అలాంటి ఎండలు మండిపోతున్నాయి. అడిలైట్‌లో దాదాపు 80 ఏండ్ల తర్వాత గత గురువారం 46.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పోర్ట్ అగస్టాలో 49.5 డిగ్రీలు, కాన్‌బెరాలో 39 డిగ్రీలు, పెర్రిత్‌లో 38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా చాలా చోట్ల ఎండలు విపరీతంగా పెరగడంతో కార్చిచ్చు ప్రమాదాలు భయపెడుతుండటంతో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. అధికారులు ముందుజాగ్రత్త చర్యగా అగ్నిమాపక వాహనాలను సిద్ధం చేశారు. ఎండలు మండిపోతుండటంతో నదులు, చెరువుల్లో నీళ్లు అడుగంటుతున్నాయి. వేల కిలోమీటర్లు ప్రవహించే డార్లింగ్ నదిలో భారీగా చేపలు చనిపోయి నీటిపై తేలియాడుతున్నాయి. నీటి మట్టాలు తగ్గి, తగినంత ఆక్సిజన్ అందకే చేపలు చనిపోతున్నట్లు శాస్త్రవేత్తలు చెప్పారు. ఈ అధిక ఉష్ణోగ్రతలు మరికొన్ని రోజులు కొనసాగే అవకాశముందని, వడగాలులు కూడా కొనసాగుతాయన్నారు. అధిక ఉష్ణోగ్రతలతో విద్యుత్ సరఫరాపై ప్రభావం పడటంతో సోమవారం విక్టోరియాలో రెండు లక్షలకుపైగా ఇండ్లు కరెంటు లేక చీకటిలో మగ్గాయి.

స్పైడర్‌మ్యాన్.. బ్యాంకు ఉద్యోగి



న్యూఢిల్లీ, జనవరి 30: స్పైడర్ మ్యాన్ బ్యాంకు ఉద్యోగి ఏంటా అనుకుంటున్నారా? తన చివరి పని దినం చిరకాలం గుర్తుండిపోయేందుకు గాను బ్రెజిల్‌కు చెందిన ఓ బ్యాంకు ఉద్యోగి ఇలా స్పైడర్‌మ్యాన్ వేషధారణలో విధులకు హాజరై సహోద్యోగులను ఆశ్చర్యంలో ముంచెత్తాడు. సహచరులతో మాట్లాడుతూ, కంప్యూటర్ ముందు కూర్చొని పని చేస్తున్న అతడి చిత్రాలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఆయన చివరి పనిదినం రోజున ఆయనతో పాటు ఇతర ఉద్యోగులు కూడా బాగా ఎంజాయ్ చేస్తున్నట్లు అందులో కనిపిస్తున్నది. ఓ వీడియోను యూట్యూబ్‌లోనూ పోస్ట్ చేశారు. సామాజిక మాధ్యమం ఇమ్‌గర్‌లో ఆయన ఫొటోలకు 1.2 లక్షల వ్యూస్ రాగా, వీడియోకు 2.4 లక్షల వ్యూస్ వచ్చాయి.

నమస్తే తెలంగాణ
జిందగీ
గురువారం 31 జనవరి 2019 WWW. NTNEWS.COM /nt.zindagi



ఇప్పుడంతా ఫాస్ట్‌ఫుడ్‌ల కాలం నడుస్తున్నది..
గంటలు గంటలు వంటకు సమయం
కేటాయించే తీరిక ఎవరికీ లేదిప్పుడు..
అందుకే చిటికెలో రెడీ అయిపోయే వంటలకే ఓటేస్తున్నారు..
బయట దొరికే ఫాస్ట్‌ఫుడ్‌తో ఆరోగ్యం పాడు చేసుకోకుండా..
ఇంట్లోనే క్యాబేజీతో చేసుకునే ఫాస్ట్‌ఫుడ్ స్నాక్స్ మీ కోసం
తీసుకొచ్చింది జిందగీ..

క్యాబేజీ.. క్యా టేస్టీ..

హార్లిక్స్ ఓట్స్ క్యాబేజీ ఆమ్లెట్



కావాల్సినవి

హార్లిక్స్ ఓట్స్ : 1 కప్పు, **క్యారెట్ :** అర కప్పు, **క్యాబేజీ :** అర కప్పు, **మిరియాల పొడి :** 1 టీస్పూన్, **కోడిగుడ్డు :** 3, **చీజ్ :** అర కప్పు, **వెన్న, ఉప్పు :** తగినంత

తయారీ :

కడాయిలో హార్లిక్స్ ఓట్స్‌ని దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి. బౌల్ తీసుకొని క్యారెట్, క్యాబేజీ, మిరియాల పొడి, ఉప్పు వేసి బాగా కలుపాలి. అందులోనే కోడిగుడ్ల మిశ్రమం కూడా వేయాలి. ఈ మిశ్రమాన్ని బాగా కలుపాలి. వేయించి పక్కన పెట్టిన హార్లిక్స్ ఓట్స్, చీజ్ వేసి కలుపాలి. తరువాత కడాయిలో వెన్న వేసి, కరిగిన తరువాత ఈ మిశ్రమాన్ని ఆమ్లెట్‌లా వేయాలి. ఆమ్లెట్ మీద కొంచెం చీజ్ వేయాలి. మూడు నిమిషాల తర్వాత నిదానంగా ఆమ్లెట్‌ని తిరగతిప్పి దానిమీద క్యారెట్, చీజ్ చల్లినట్టుగా వేసి మూత పెట్టాలి. ఐదు నిమిషాల తర్వాత ప్లేట్‌లోకి సర్వ్ చేసి నాలుగు ముక్కలుగా కట్ చేసుకంటే చాలు. నోరూరించే హార్లిక్స్ ఓట్స్ క్యాబేజీ ఆమ్లెట్ తయారయినట్లే.

పెసరపప్పు క్యాబేజీ వడ



కావాల్సినవి :

పెసరపప్పు : 1 కప్పు, **క్యాబేజీ :** 1 కప్పు, **పచ్చిమిర్చి :** 3, **జీలకర్ర :** అర టీస్పూన్, **కరివేపాకు :** 1 రెబ్బ, **కొత్తిమీర :** అర కప్పు, **నూనె, ఉప్పు :** తగినంత.

తయారీ :

పెసరపప్పుని నాలుగు గంటలపాటు నానబెట్టాలి. పెసరపప్పు, జీలకర్ర, ఉప్పు, పచ్చిమిర్చి వేసి గ్రైండ్ చేయాలి. క్యాబేజీని చిన్నముక్కలుగా కట్ చేసి పెట్టుకోవాలి. గ్రైండ్ చేసిన పెసరపప్పు పిండిని క్యాబేజీతో కలుపాలి. దీంతోపాటు కొత్తిమీర, కరివేపాకు కూడా వేసి కలుపాలి. ఉప్పు సరిపోయిందో లేదో సరిచూసుకోవాలి. కడాయిలో నూనె వేసి బాగా వేడి చేయాలి. పిండిని చిన్న ముద్దలుగా చేసి వడలుగా చేయాలి. కాగిన నూనెలో వడలను వేయించాలి. బంగారు రంగులోకి మారేంత వరకు వేయించాలి. ప్లేటులో టిష్యూ పేపర్ పెట్టి వడలను సర్వ్ చేసుకోవాలి. వడలను నేరుగా తిన్నా, ఏదైనా చట్నీతో తిన్నా టేస్ట్ అదిరిపోతుంది.

స్టఫ్డ్ క్యాబేజీ రోల్స్



కావాల్సినవి :

కోడిగుడ్డు : 1,
ఉల్లిగడ్డ : 1,
తరిగిన అల్లం,
వెల్లుల్లి : 1 టీస్పూన్,
ఉల్లికాడలు : పావుకప్పు,
కూరగాయల ముక్కలు : పావు కప్పు,
చికెన్ : 250 గ్రా.,
క్యాబేజీ ఆకులు : 7,
మిరియాల పొడి : పావు టీస్పూన్,
సోయా సాస్ : పావు టీస్పూన్,
వెన్న : 1 టేబుల్ స్పూన్

తయారీ :

క్యాబేజీ ఆకులను వేడి నీటిలో మూడు నిమిషాల పాటు ఉడికించాలి. తర్వాత క్యాబేజీ ఆకులను పక్కన పెట్టుకోవాలి. ఒక గిన్నెలో చికెన్, క్యారెట్, బీన్స్ ముక్కలు, ఉల్లికాడలు, తరిగిన అల్లం వెల్లుల్లి, ఉల్లిపాయ ముక్కలు, కోడిగుడ్డు, మిరియాల పొడి, సోయాసాస్, వెన్న పదార్థాలన్నింటినీ వేసి బాగా కలుపాలి. ఉడికించిన క్యాబేజీ ఆకుల్ని ముడత లేకుండా తెరిచి కొంచెం క్యాబేజీ మిశ్రమం పెట్టి రోల్ చెయ్యాలి. ఇప్పుడు క్యాబేజీ రోల్స్‌ని స్టీమర్‌లో పెట్టి మూతపెట్టాలి. 15 నిమిషాల తర్వాత రోల్స్‌ని బయటకు తీసి చిల్లీసాస్ వేసుకొని తింటే చాలా టేస్టీగా ఉంటాయి.

క్యాబేజ్, క్యారెట్, సోయా సాండ్‌విచ్

కావాల్సినవి :

వెన్న : 4 టీస్పూన్లు,
ఉల్లిగడ్డ : 2 టేబుల్ స్పూన్లు,
క్యాబేజీ : 3 టేబుల్ స్పూన్లు,
క్యారెట్ : 2 టేబుల్ స్పూన్లు,
సోయా బీన్స్ : 2 టేబుల్ స్పూన్లు,
మిరియాల పొడి : 1 టేబుల్ స్పూన్,
చీజ్ : అర కప్పు,
బ్రెడ్ : 4, **కొత్తిమీర :** తగినంత.

తయారీ :

కడాయిలో కొంచెం వెన్న వేసి కరుగనివ్వాలి. అందులో క్యాబేజీ, క్యారెట్, తరిగిన ఉల్లిపాయ ముక్కలు, సోయాబీన్ ముక్కలు వేసి దోరగా వేయించాలి. కడాయి దించే ముందు కొత్తిమీర, మిరియాల పొడి, చీజ్ కలిపి పక్కన పెట్టుకోవాలి. బ్రెడ్‌కి రెండువైపులా వెన్న రాసి, పక్కన పెట్టిన మిశ్రమాన్ని రెండు బ్రెడ్‌ల మధ్యలో పెట్టాలి. రెండు వైపులా సరిపడా వెన్న రాసుకోవాలి. గ్రిల్లింగ్ పాన్‌లో బ్రెడ్‌ని వేడి చేసి రెండువైపులా కాల్చాలి. గ్రిల్లింగ్ పాన్‌లోంచి తీసిన బ్రెడ్‌లను సాండ్‌విచ్ మాదిరిగా కట్ చేస్తే మీకు నచ్చిన క్యాబేజీ సాండ్‌విచ్ తయారయినట్లే. దీన్ని గార్నిష్ చేసుకుని తింటే చాలా రుచిగా ఉంటుంది.



చనాదాల్ క్యాబేజీ పరాటా



కావాల్సినవి :

శనగపప్పు : 1 కప్పు,
జీలకర్ర : అర టీస్పూన్,
గోధుమపిండి : 2 కప్పులు,
ఉల్లిగడ్డ : పావు కప్పు,
క్యాబేజీ : 1 కప్పు,
పసుపు : పావు టీస్పూన్,
కారం : 1 టీ స్పూన్,
నూనె, ఉప్పు : తగినంత

తయారీ :

శనగపప్పుని మెత్తగా ఉడికించి పెట్టుకోవాలి. కడాయిలో కొంచెం నూనె వేసి జీలకర్రని వేయించాలి. తర్వాత ఉల్లిపాయ ముక్కలు, ఉప్పు, క్యాబేజీ, పసుపు, కారం వేసి ఐదు నిమిషాల పాటు వేయించాలి. ఉడికించిన శనగపప్పుని కూడా అందులో వేసి కలుపాలి. బాగా వేగిన తర్వాత కడాయిని పక్కన పెట్టి ఈ మిశ్రమాన్ని చల్లారనివ్వాలి. ముందుగా కలిపి పెట్టుకున్న గోధుమ పిండిని తీసుకొని చిన్న పరిమాణంలో గుండ్రంగా చేసుకోవాలి. చల్లారిన క్యాబేజీ మిశ్రమాన్ని చేతితో మెత్తగా కలుపాలి. ఇవి పరాటా ఉండల కంటే చిన్నసైజులో ఉండాలి. క్యాబేజీ పిండిని పరాటా పిండిలో పెట్టి పరాటా రుద్దాలి. కడాయిలో కొంచెం నూనె వేసి కాగిన తర్వాత తయారుచేసిన పిండిని వేసి కాల్చాలి. రెండువైపుల కాలిన తర్వాత ప్లేటులోకి సర్వ్ చేసి గుండ్రంగా ఉన్న పరాటాని నచ్చిన విధంగా కట్ చేసుకొని తినొచ్చు.



సంజయ్ తుమ్మ
సెలబ్రిటీ చెఫ్

వంటగది అందంగా.. ఆకర్షణీయంగా..



వంటగదిని అందంగా ఉంచడం చాలా కష్టం. కానీ చిన్న చిన్న చిట్కాలు పాటిస్తే వంటగదిని అందంగా.. ఆకర్షణీయంగా ఉంచవచ్చు..

వంటింటి మీద కాస్త శ్రద్ధ పెడితే ఈజీగా తీర్చిదిద్దవచ్చు. ఈ గదిలోనే ఎక్కువ సామాగ్రి, వంట దినుసులు ఉంటాయి. టీపొడి, పప్పుదినుసులు, కారం, పసుపు, నూనె లేనిదే రోజు గడవదు. ఇవి రోజూ వాడే వస్తువుల్లో ముఖ్యమైనవి. వీటిని ప్రతిసారి వెతికే పని లేకుండా ట్రాన్స్‌పరెంట్ డబ్బాలు వాడాలి. అవసరమైతే డబ్బా మీద పేరు రాసుకోవాలి. దీని వల్ల గృహిణులు ఇంట్లో లేకపోయినా మగవాళ్లు వంటచేసుకోవడానికి వీలుంటుంది. కిచెన్‌సెట్ కంటైనర్‌లో సరుకులు సర్దుకుంటే ఇంట్లో వారితో పాటు ఎప్పుడైన అతిథులు వస్తే చొరవ తీసుకునేందుకు వీలుంటుంది. పాత్రలను, సరుకులను కలగాపులగంగా పారేయకుండా కప్‌బోర్డులో పెట్టుకుంటే కిచెన్‌లో కొత్తవారికి కూడా ఇబ్బంది ఉండదు. దీంతోపాటు వంటగదిని ఎంత శుభ్రంగా ఉంచితే అంత మంచిది. అయితే రోజూ ఎంత క్లీన్ చేసినా ఎక్కడో ఒకచోట మరకలు కనిపిస్తాయి. అలాంటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా బేకింగ్ సోడాను ఉపయోగించటం ద్వారా ఇలాంటి సమస్యలు రావు. ఇది మరకలను నివారించటంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. సింక్‌డ్రెయినేజీ పాత్‌వేలలో ఒక్కోసారి వ్యర్థాలు జామ్ అయి దుర్వాసన వస్తుంటుంది. దీన్ని నివారించడానికి నిమ్మ, వెనిగర్, సోడాలు ఉపయోగపడతాయి. వీటిని కలిపి పాత్‌వేలలో పోస్తే వ్యర్థాలతోపాటు దుర్వాసన పోయే అవకాశం ఉంది.

ఆమె పాత్రను అర్థం చేసుకోవాలి!

ఆధునిక సమాజంలో నిజమైన సమానత్వాన్ని సాధించడానికి, దేశాభివృద్ధికి పునాది వేసి, చరిత్రలో నిలిచిన మహిళల పాత్రను నేటి తరానికి అందించాలి. ఈ ఉద్దేశ్యంతోనే ఓ తల్లి తన కూతురి కోసం చేస్తున్న ప్రయత్నం ఇది.



'అత్యంత ప్రభావశీల, ఆదర్శమైన మహిళలు మన దేశంలో ఎందుకుండరమ్మా' అని ఓ ఏడేండ్ల పాప తన తల్లిని అడిగిన ప్రశ్నకు ఆ తల్లి చలించిపోయింది. మన దేశంలో గొప్ప మహిళల గురించి ఈ తరానికి ఎలా తెలియాలి అని ఆలోచించింది. అధ్యయనం చేసింది. పుస్తకాలను, వ్యాసాలను, బొమ్మలను సేకరించింది. ఉమెన్ ఇన్ సైన్స్, గుడ్ నైట్‌స్టోరీస్ ఫర్ రెబెల్ గర్ల్స్, రెబల్ లేడీస్ హు రాక్డ్‌ద వరల్డ్ వంటి పుస్తకాలను సేకరించింది. వాటిని పూర్తిగా చదివి తన కూతురికి వివరించింది. ఇలాంటి పుస్తకాలను పిల్లలు చదవాలనుకుంది. ప్రభావశీలురైన మహిళల పెయింటింగ్‌లు, డాక్యుమెంటరీలు, సూక్తులు సేకరించి పిల్లలతో వల్లె వేయించింది. సెలవుల రోజుల్లో వాటితోనే గడిపింది. డాక్టర్ వర్దన శివ, సావిత్రి బాయి, కేసర్బి కేర్కర్, థెస్సి థామ్సన్, శకుంతలాదేవి, మందాకిని, బేగం హజ్రత్ వంటి మహిళల చిత్రాలతో ఆమె కూతురికి అవగాహన కల్పించింది. ఇలా తన ప్రాజెక్ట్‌ను కొనసాగిస్తున్నది. భారతదేశంలో మహిళల గొప్పతనాన్ని నేటి పిల్లలకు వివరించాలనే లక్ష్యంతో ఆమె ముందుకు సాగుతున్నది.

లింగవివక్షపై నిలదీత

'లింగ వివక్ష ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నది. అందులోనూ ప్రముఖ లైబ్రరీలో 'అని ఓ బాలిక సామాజిక మాధ్యమంలో పెట్టిన పోస్ట్ సంచలనం సృష్టిస్తున్నది.



దక్షిణ ముంబైలో ప్రముఖ ఆసియా సొసైటీ గ్రంథాలయం ఉన్నది. ఇందులో టాటా ఇన్సిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టీసీసీఎస్) విద్యార్థులు కేవలం మహిళల విభాగం మాత్రమే ఉపయోగించాలనే నిబంధన ఉన్నది. ఈ నేపథ్యంలో ఇటీవల ఇన్సిట్యూట్‌కు చెందిన అర్బన్ పాలసీ విద్యార్థితో కలిసి అన్నా బ్రిటాస్ అనే బాలిక ఆ గ్రంథాలయానికి వెళ్లింది. అక్కడ ఆడవారికి కేటాయించిన స్థలాన్ని చూసి ఆందోళన చెందింది. మహిళల కోసం కేటాయించిన విభాగం చాలా చిన్నగా ఉన్నది. చారిత్రాత్మక గ్రంథాలయంలో ఇలాంటి వివక్ష ఉండడం తనను కలచివేసిందని, తాము చారిత్రాత్మక స్థలాలకు వెళ్లినప్పుడు ఎదురైన వివక్షల్లో ఇదే మొదటిదని బాధపడింది. విశాలమైన లైబ్రరీలో కేవలం తొమ్మిదో వంతు మాత్రమే ఆడవాళ్లకు కేటాయించడమేంటని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. అంతేకాదు మరింత విస్తరించాలని ఆమె చేసిన పోస్ట్ వైరల్ అవుతున్నది.

గోర్లు రంగు మారుతున్నాయా?



ఎంత ఆరోగ్యంగా ఉన్న గోర్లయినా ఒక్కోసారి రంగుమారుతుంటాయి. ఉన్నట్టుండి పసుపురంగుల్లో లేదా నలుపు రంగులోకి మారుతుంటాయి. మరి ఇలా రంగు మారడం దేనికి సంకేతం..? నెయిల్ పాలిష్‌ల వల్ల ప్రమాదాలేమైనా ఉన్నాయా?

గోర్లు ఉన్నట్టుండి రంగు మారడం అనారోగ్యానికి సంకేతమని డాక్టర్లు చెపుతున్నారు. గోర్లు లేత ఎరుపు రంగులో మిలమిలలాడుతుంటే ఏమీ చింతించాల్సిన పని లేదు. కానీ వేరే రంగులోకి మారితే జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు డాక్టర్లు. ఇలా రంగు మారిన గోర్లు మళ్లీ కోలుకోవడానికి సుమారు నాలుగు నుంచి తొమ్మిది నెలలు పడుతుందట. అసలు ఇలా రంగులెందుకు మారుతాయంటే పలు కారణాలున్నాయి. నెయిల్ పాలిష్‌లోని రసాయనాలు గోరుతోపాటు, పక్కన ఉన్న చర్మంపై కూడా ప్రభావాన్ని చూపుతాయి. శరీరాన్ని శుభ్రపరుచుకున్నట్టే గోర్లను కూడా రోజూ శుభ్రపరుకోవాలి. మెరుగైన హ్యాండ్ క్రీమ్‌లను, సానిటైజర్లను వాడి బ్యాక్టీరియా ఫంగల్‌ను దూరం చేసుకోవచ్చు. దీంతో పాటు నెయిల్ పాలిష్‌లో ఉండే టాల్యూన్ పార్మాల్డిహైడ్, ఎసిటోన్‌పారాబెంజ్ వంటి రసాయనాలు చర్మానికి హాని చేయటంతోపాటు వ్యాధులు రావడానికి కూడా కారణమవుతాయి. అందుకే గోర్లకు రంగులు వేసుకునేప్పుడు జాగ్రత్తలు పాటించాలనీ, లేదా రంగులు వేసుకోకపోవటమే మంచిదని డాక్టర్లు సూచిస్తున్నారు.

ఊరు ఉమ్మెడ.. పేరు ముత్యం



ఎప్పుడైనా గమనించారా? ఎప్పుడైనా ఊహించారా? పర్లేదు ఎప్పుడైనా విన్నారా? సరే చదివారా? సమాధానం అన్నింటికీ లేదు అనే వస్తుంది. కారణం. నిజానికి ఇలాంటి నేపథ్యం ఉన్న ఊర్లు తెలంగాణలో బాగానే ఉన్నాయి. కానీ ఇలాంటి పేర్లున్న ఊరు మాత్రం చాలా అరుదు. ఒకే అక్షరంతో పేర్లు పెట్టుకుంటున్న ఓ ఊరి కథ ఇది.

ఆ ఊర్లో అడుగుపెడితే చాలు.. మ అక్షరంతో మొదలయ్యే పేర్లే వినిపిస్తాయి. ముత్యం, ముత్తెన్న, ముత్యాలు, మహేశ్, మనోజ్, మోహన్..ఇలా ఈ పేర్లు ఉన్న మనుషులు ఎక్కువగా కనిపిస్తారు.ఎందుకని ఆరా తీస్తే.. ఆ ఊరి ముత్యాలమ్మ గుడి మహిమ అని తెలిసివచ్చింది. ముత్యాలమ్మ అమ్మవారి పేరు పెట్టుకుంటే అంతా మంచే జరుగుతుందని వారి నమ్మకం. ప్రగాఢ విశ్వాసం. ఎన్నో ఏండ్లుగా ఈ ఊర్లో ఈ సంప్రదాయం కొనసాగుతూ వస్తున్నది. ఇప్పటి తరం కూడా ఈ ఆచార సంప్రదాయాల్ని పాటిస్తూ ఉన్నది. ఆ ఊరు పేరు ఉమ్మెడ. చిన్న ఊరే. నివాసం ఉంటున్న కుటుంబాల్లో దాదాపుగా ప్రతీ ఒక్కరూ 'మ'తో మొదలయ్యే పేరు పెట్టుకొని ఉన్నవారే ఉంటారు. భోజన్న, భోజవ్వ అనే పేరు కూడా ఉంది. ఇదీ ముత్యాలమ్మకు ప్రతిరూపమైన పేరుగానే భావిస్తారు.

నిజామాబాద్ జిల్లా నందిపేట మండలంలోని ఓ మారుమూల పల్లెటూరు ఉమ్మెడ. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం ముత్యాలమ్మ అమ్మవారంటే అందరికీ ప్రత్యేక నమ్మకం. భక్తి. విశ్వాసం. ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా ఊరు పక్కనే ఉన్న మత్యాలమ్మ గుడి దగ్గరకి వచ్చి అమ్మవారి ఆశీస్సులు తీసుకోవాల్సిందే. సంతానం కలిగితే అమ్మ దగ్గరకు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఐదుగురు ముత్తైదువలకు పెట్టిన తర్వాతే ఏ దావతైనా.. ప్రతీ ఆదివారం ఇక్కడికి ఇతర ప్రాంతాల నుంచి కూడా వచ్చి అమ్మవారి వద్ద కందూరు చేసుకొని పోతారు. మేకపిల్లను కోసుకొని మొక్కు తీర్చుకుంటారు. ఆమె మహిమ వల్లే తాము అనుకున్నది నెరవేరిందని మళ్లీ కొత్త మొక్కులు మొక్కుకుని పోతారు. కొత్తగా ఈ గుడికి వచ్చినవారు ఒక కొబ్బరి కాయ కొట్టి తమ కోరికను కోరితే.. అది నెరవేరడం ఖాయమంటున్నారీ గ్రామస్తులు. కోరిక నెరవేరిన తర్వాత వచ్చి మళ్లీ ఓ కొబ్బరి కాయ కొట్టి పోతే చాలంటున్నారు. అందుకే ఆమె పేరులోని ముందు అక్షరం వచ్చేలా పేర్లు పెట్టుకుంటున్నామని తెలిపారు. ఆ ఊర్లోనే అన్ని కులాలకు చెందిన వారికీ అమ్మవారి మహిమపట్ల విశ్వాసం. ముస్లింలు సైతం అమ్మవారికి వెండి కండ్లు చేపిస్తామని,బొట్టు పెడతామని మొక్కులు మొక్కుకుంటారు. వారు నేరుగా గుడికి వెళ్లకున్నా.. వేరొకళ్లతో ఈ మొక్కులు చెల్లించుకొని సంతృప్తి పడతారు. పర్వీనా అనే ముస్లిం మహిళ తన అనుభవాన్ని చెప్పుకున్నారు. తన కొడుకుకు ఆరోగ్యం బాగలేకపోతే ముత్యాలమ్మ మొక్కుకున్నదట, వెండి కండ్లు చేయించి ఇస్తానని. మొక్కుకున్న మరునాడే తన కొడుకు ఆరోగ్యం బాగుపడిందని, లేదంటే తన కొడుకు తనకు దక్కేవాడు కాదని ఆమె అమ్మవారి మహిమ గురించి చెప్పుకొచ్చింది. ముత్యాలమ్మ గుడికి కుడి పక్కన మహాలక్ష్మమ్మ గుడి ఉంటుంది. ఈ గుడి తలుపులు ఎప్పుడూ మూసే ఉంటాయి. పూజరులుగా పిలువబడే వడ్రంగివాళ్లు ఏడాదికొకసారి తెరిచి పూజలు చేసి మళ్లీ తలుపులు మూస్తారు. అమ్మవారి ప్రతిరూపాలుగా పిలవబడే మహాలక్ష్మి, ముత్తెవ్వ, సందె మహంకాళి, ఎరుకల నాంచారి, బద్ది పోశవ్వ, నల్ల పోశవ్వ, చిల్కల చిన్మమ్మ, నాగవ్వ, ఆరెల్లి మైసవ్వ.. ఇలా విగ్రహప్రతిరూపాలు ఆ గుడిలో కొలువై ఉన్నాయి.

చిన్న పిల్లలకు మొదట ముత్తెన్న పేరు..

ఆనాటి నుంచి వస్తున్న ఆచారాన్ని ఇప్పటికీ ఈ గ్రామ ప్రజలు పాటిస్తున్నారు. పుట్టిన సంతానం మగబిడ్డ అయితే ముత్తన్న, ఆడబిడ్డ అయితే ముత్తెమ్మ అని మొదట నామకరణం చేసిన తర్వాతనే మరో పెట్టుకుంటారు. స్కూల్ రికార్డుల్లో వేరే పేరు నమోదు చేసినప్పటికీ.. ఇంట్లో పేరు మాత్రం ముత్తెన్న, ముత్తెవ్వ అనే పిలుచుకుంటారట. ఆ పేరు పెట్టుకుంటే అన్నీ అమ్మదయతో మంచి జరుగుతాయని, ఆరోగ్యం, సంపద చేకూరుతాయని విశ్వసిస్తారు. ఆ గుడి పక్క నుంచే గ్రామస్తులంతా ఉదయం తమ పంటపొలాలకు వెళ్తారు. ఈ ముత్యాలమ్మ గుడి వద్ద పొద్దున్నే ఓ దండం పెట్టి మరీ తమ దైనందిన కార్యక్రమాలు షురూ చేసే ఆనవాయితీ ఇక్కడ ఉంది.

గోదావరి ఒడ్డున 'గంగ'పేరు

జిల్లాలో గోదావరి నదీ ప్రవాహానికి పక్కనే ఉండే గ్రామాలలో గంగ అర్థం వచ్చే పేర్లను పెట్టుకోవడం కూడా ఈ జిల్లాలో ఎక్కువగా కనిపిస్తది. రెంజల్ మండలం కందకుర్తి వద్ద గోదావరి, హరిదా, మంజీరా నదుల కలియికను త్రివేణీ సంగమంగా చెప్పుకుంటారు. ఇక్కడ నుంచి మొదలుకొని మెండోరా మండలం వరకు గోదావరి పారుతూ వస్తున్న ప్రాంతాల్లో గంగ అర్థం వచ్చే పేర్లు ఎక్కువగా పెట్టుకుంటారు. ఇక్కడ గంగ అంటే గోదారమ్మ. గంగాధర్, గంగారెడ్డి, గంగారం, గంగవ్వ.. ఇలాంటి పేర్లు జిల్లాలో అధికంగా కనిపిస్తాయి. జిల్లాలో ఇపుడున్న ప్రధాన పార్టీల అధ్యక్షులు కూడా ఈ పేర్లతోనే ఉండటం విశేషం. కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు గడుగు గంగాధర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పల్లె గంగారెడ్డి, టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఈగ గంగారెడ్డిలు ఉన్నారు.

... దండుగుల శ్రీనివాస్
నిజామాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ



అదరగొడుతున్న.. ఆరేళ్ల హెయిర్ స్టైలిస్ట్!



ఆరేళ్ల వయసుకే హెయిర్ డ్రెస్సర్‌గా మారి అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాడు ఓ బుడతడు. వినడానికి నమ్మేలా లేకపోయినా ఇది మాత్రం నిజంగా నిజం. ఇంతకీ ఎక్కడా? ఏమిటి? అని తెలుసుకోవాలంటే ఇది చదవాల్సిందే!

చైనా దేశానికి చెందిన జియాంగ్ హాంగ్ అనే పిల్లవాడు అతి చిన్న వయసులో హెయిర్ స్టైలిస్ట్‌గా మారి అబ్బురపరుస్తూ రికార్డులు సృష్టిస్తున్నాడు. కత్తెర అంటే ఎలా పట్టుకోవాలో కూడా తెలియని వయసులో సరికొత్త హెయిర్ స్టైల్స్‌తో కొత్త ట్రెండ్ సృష్టిస్తున్నాడు. జియాంగ్ హంగ్ నాలుగేండ్ల వయసు నుంచే తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కత్తెర పట్టుకుని హెయిర్‌స్టైలిష్ రంగంలో మెళకువలు నేర్చుకున్నాడు. వారు కూడా అదే రంగంలో నిష్ణాతులు కావడంతో జియాంగ్‌కు ప్రత్యేకంగా ట్రైనింగ్ ఇచ్చారు. జియాంగ్ హంగ్ ఎవరి సాయం లేకుండానే షేవింగ్, కటింగ్, డైయింగ్ వంటి పనులు చకచకా చేసేస్తున్నాడు. కస్టమర్ల టేస్ట్‌కి తగ్గట్టుగా కటింగ్ చేస్తూ వారి అభిమానాన్ని పొందుతున్నాడు. డిఫరెంట్ హెయిర్ స్టైల్స్ చేస్తూ గిరాకీని ఆకర్షిస్తున్నాడు. పెద్దవాళ్ల కంటే వేగంగా, అందంగా కటింగ్ చేయడంతో చిన్నాపెద్ద, ఆడ మగ అనే తేడా లేకుండా అందరూ ఈ చిన్నోడితోనే హెయిర్ కటింగ్ చేయించుకుంటున్నారు. సీనియర్ హెయిర్ స్టైలిస్టులకు ఏమాత్రం తీసిపోకుండా అదరగొడుతున్నాడు. తనకు తానే హెయిర్ కట్ చేసుకుంటూ ఔరా అనిపిస్తున్నాడు. జియాంగ్ హంగ్ కటింగ్ చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. జియాంగ్‌ని సోషల్ మీడియాలో ఫాలో అవుతున్న వారి సంఖ్య ఎంతో తెలుసా? అక్షరాలా 1.5 మిలియన్లు.

ఈ కుక్కకు ఓ రోజొచ్చింది!



మనుషలలాగే జంతువులకు కూడా సరైన శిక్షణ ఇస్తే ఏ పనైనా చేస్తాయనడానికి ఈ సంఘటనే ఒక ఉదాహరణ. రికార్డులంటే కేవలం మనుషులే కాదు.. కుక్కలు కూడా సృష్టిస్తాయని నిరూపించిందీ కుక్క. అసలు విషయమేంటంటే...

ఒక కుక్క గాలి బుడగలను పగులగొట్టడంలో విశేషమేముందని మీకు సందేహం రావొచ్చు. కానీ ఈ కుక్క అతితక్కువ సమయంలో 100 గాలి బుడగలను పగులగొట్టి గిన్నిస్ రికార్డ్ కెక్కింది. గోల్డెన్ విప్పెట్ జాతికి చెందిన తొమ్మిదేండ్ల టాబి బెలూన్లు పగులగొట్టే పోటీలో పాల్గొన్నది. అంతకు ముందు 36.53 సెకన్ల వ్యవధిలో ఓ కుక్క వంద బుడగలు పగులగొట్టింది. టాబి ఆ రికార్డును బ్రేక్ చేస్తూ 28.22 సెకన్లలోనే వంద బుడగలు పగులగొట్టింది. ప్రపంచంలో ఇదే రికార్డు అయినందున గిన్నిస్‌బుక్‌లో ఎక్కింది. కెనడాకు చెందిన క్రిస్టీ అనే మహిళ టాబిని పెంచుకుంటున్నది. చిన్నప్పటి నుంచి టాబికి రకరకాల పనుల్లో ట్రైనింగ్ ఇచ్చింది. బెలూన్లను పగులగొట్టడంలో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చింది. అందుకోసం ప్రతిరోజూ ఈత కొలనులో బెలూన్లు వేసి టాబితో ఎలా పగులగొట్టాలో నేర్పించింది. ఈ రికార్డు నెలకొల్పడం కోసం టాబి చాలా శ్రమించిందని క్రిస్టి చెబుతున్నది. తమ ప్రాంతంలో టాబి ఇప్పుడు పెద్ద సెలెబ్రిటీగా మారిందని, తనను చూడడానికి చాలామంది క్యూ కడుతున్నారంటున్నది క్రిస్టీ.

అక్కడ పాముల్ని పెంచుకుంటారు!

చాలామందికి జంతువుల్ని పెంచుకునే అలవాటు ఉంటుంది. కొందరు కుక్కలు, పావురం, పిల్లి, గుర్రం, చిలుక, కుందేలు ఇలా రకరకాల జంతువుల్ని పెంచుకొని ప్రేమగా చూసుకుంటారు. కానీ ఓ ఊర్లో పాములు పెంచుకుంటారు. ఎక్కడో తెలుసా?

గుజరాత్‌లోని 'వడి' అనే గిరిజన జాతి వారి కులదైవం పాము. అందుకే వారికి పాములంటే ఎనలేని భక్తి, ప్రేమ. అంతేకాదు వడి జాతిలో పుట్టిన వారు పాములాడించుకోవడమే జీవనాధారం. ఆ వృత్తిపైనే ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తారు. 10వ శతాబ్దం నుంచి వారికి పాములాడించడమే ఉపాధి మార్గంగా బతుకుతున్నారు. అందుకే వారి ఇంటి నిండా పాములుంటాయి. పుట్టిన రెండు సంవత్సరాల నుంచే పాములు పట్టడం నేర్పిస్తారు. పాములను మచ్చిక చేసుకోవడం, విష నాగులను సైతం ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండానే పట్టుకోవడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. కొత్తవారు వీరి ఇంటికి వెళ్లాలంటేనే జంకుతారు. ముందూ వెనుక చూడకుండా వీళ్ల ఇంట్లోకి అడుగు పెడితే మనుషుల కంటే ముందు బుస్సుమంటూ పాములే స్వాగతం పలుకుతాయి. వందల ఏండ్లుగా ఇదే ఆచారంగా జీవిస్తున్న ఈ తెగలో ఇప్పటి వరకు ఒక్కరు కూడా పాముకాటుతో చనిపోలేదంటే ఆశ్చర్యం వేయక మానదు.



ట్వీట్

స్నేహా ఉల్లాల్
@iamsnehaullal





నువ్వు నీలాగే ఉండు. నీకేం కావాలో అదే తీసుకో. నీకేం చెప్పాలనిపిస్తే అది చెప్పు. నీకేం కావాలో దాని గురించి ఆశపడు. దాన్నే అనుభవించు. అప్పుడే ఎలాంటి సమస్య ఉండదు. ఎలాంటి బాధ కలుగదు.

స్నేహా ఉల్లాల్‌ని ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
410,046

కామన్‌మ్యాన్ వాయిస్

డబ్బులు ఊరికే రావు. బంగారం గూడ తరుగులు, లాభాలు లేంది ఎవరన్న అమ్ముతరా? యాపారానికి నిజాయితీ కలరు ఒకటి.

–Sangh Veer

తెలంగాణ మీద దాడి ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఎప్పుడూ ఉంటది. మన రాష్ట్రం వచ్చేసిందని అనుకోవడం తప్పు. తెలంగాణ పోరాటం ఒక నిరంతర ప్రవాహం. గుర్తింపు ఎంత అవసరమో మనుగడ కూడా అంతే అవసరం. గుర్తింపు కోసం పోరాడుతున్నప్పుడు పరస్పర నష్టం ఉంటది. ఆ నష్టం ఆంధ్రా కావొచ్చు. ఒరిస్సా కావొచ్చు. డార్జిలింగ్ కావొచ్చు. నష్టం గురించి ఆలోచిస్తూ తెలంగాణ మనుగడను వదులుకోవద్దు.

–Thirmal Reddy Sunkari

వైరల్ వీడియో



మరుగైనావా రాజన్నా... పేరుతో విడుదల చేసిన పాట యూట్యూబ్‌లో హల్‌చల్ చేస్తున్నది. యాత్ర సినిమాలోని ఈ పాటను పెంచల్ దాస్ పాడాడు.

Marugainaava Rajanna Full Song Lyrical | Yatra Movie Songs | Mammootty | YSR Biopic | Penchal Das

Total views : 69,099++
Published on Jan 29, 2019

సుడోకు

డైలీ సుడోకు 52 సమాధానం

6	7	1	4	2	8	3	9	5
2	5	4	3	6	9	7	8	1
9	3	8	1	5	7	6	2	4
5	8	9	6	3	4	1	7	2
3	1	6	8	7	2	4	5	9
7	4	2	5	9	1	8	3	6
8	2	5	7	4	6	9	1	3
1	6	3	9	8	5	2	4	7
4	9	7	2	1	3	5	6	8

1. నిలువుగా, అడ్డంగా ప్రతి వరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో


డైలీ సుడోకు -53

7			3	4	2			
	6	2	1		7			
4		5	6					
	7				8			
						6	5	9
							2	
5							7	6
	9							
		1		6		9	3	4

నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం —

సెయిల్‌లో 275 ఖాళీలు

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్) బొకారో స్టీల్ ప్లాంట్‌లో ఆపరేటర్, అటెండెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.



- **పోస్టు:** ఆపరేటర్ కమ్ టెక్నీషియన్ ట్రెయినీ
- ఖాళీల సంఖ్య -95
- **ట్రేడుల వారీగా ఖాళీలు:** ఎలక్ట్రికల్-20, మెకానికల్-25, మెటలర్జీ-35, కెమికల్-5, సిరామిక్స్-5, ఇన్‌స్ట్రుమెంటేషన్-5 ఖాళీలు ఉన్నాయి.
- **అర్హతలు:** పదోతరగతి లేదా తత్సమాన పరీక్షతోపాటు సంబంధిత ట్రేడ్‌లో మూడేండ్ల ఫుల్‌టైం ఇంజినీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణత.
- **పోస్టు:** ఆపరేటర్ కమ్ టెక్నీషియన్ (బాయిలర్)
- ఖాళీల సంఖ్య -10
- **అర్హతలు:** పదోతరగతితోపాటు ఫుల్‌టైం మూడేండ్ల ఇంజినీరింగ్ డిప్లొమాతోపాటు ప్రథమశ్రేణిలో బాయిలర్ కాంపిటెన్సీ సర్టిఫికెట్ ఉత్తీర్ణత.
- **పోస్టు:** అటెండెంట్ కమ్ టెక్నీషియన్ ట్రెయినీ
- ఖాళీల సంఖ్య -121
- **అర్హతలు:** పతోతరగతితోపాటు ఎన్‌సీటీవీ నిర్వహించిన ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్‌లో ఉత్తీర్ణతతోపాటు ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్‌లో అప్రెంటిస్ చేసి ఉండాలి.
- **పోస్టు:** అటెండెంట్ కమ్ టెక్నీషియన్ ట్రెయినీ
- ఖాళీల సంఖ్య -49 (ఎలక్ట్రీషియన్-12, మెషినిస్ట్-8, వెల్డర్-7, ఫిట్టర్-12, రిగ్గర్-10)
- **అర్హతలు:** పదోతరగతితోపాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ నుంచి సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణత.
- **వయస్సు:** ఫిబ్రవరి 18 నాటికి అపరేటర్ కమ్ టెక్నీషియన్, అటెండెంట్ కమ్ టెక్నీషియన్ పోస్టులకు 28 ఏండ్లు, ఆపరేటర్ కమ్ టెక్నీషియన్ (బాయిలర్) పోస్టుకు 30 ఏండ్లు మించరాదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **శారీరక ప్రమాణాలు:** పురుషులు కనీసం 150 సెం.మీ. ఎత్తు, 45 కేజీల బరువు ఉండాలి. మహిళలు కనీసం 143 సెం.మీ. ఎత్తు, 35 కేజీల బరువు ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్‌టెస్ట్/ట్రేడ్ టెస్ట్ ద్వారా చేస్తారు. రాతపరీక్షలో జనరల్ అభ్యర్థులకు 50 పర్సంటైల్ స్కోర్, మిగిలిన క్యాటగిరీలకు 40 పర్సంటైల్ స్కోర్ అర్హతగా నిర్ణయించారు. రాతపరీక్షలో అర్హత సాధించినవారికి స్కిల్‌టెస్ట్ నిర్వహించి తుది ఎంపిక చేస్తారు.
- **ప్రొబేషనరీ పీరియడ్:** ట్రెయినీ పోస్టులకు రెండేండ్లు, ఇతర పోస్టులకు ఏడాది ప్రొబేషనరీ పీరియడ్‌గా పరిగణిస్తారు.
- **స్టయిఫండ్:** శిక్షణ సమంయలో మొదటి ఏడాది నెలకు రూ.10,700/, రెండో ఏడాది రూ.12,200/- స్టయిఫండ్ ఇస్తారు. తర్వాత ఆయా పేస్కేల్స్ ప్రకారం జీతభత్యాలు ఇస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఫీజు:** అపరేటర్ పోస్టులకు రూ.250, అటెండెంట్ పోస్టులకు రూ.150/-చెల్లించాలి.
- **చివరితేదీ:** ఫిబ్రవరి 18
- **వెబ్‌సైట్:** www.sail.co.in.

ఎన్‌ఏబీఐలో

నేషనల్ అగ్రి-ఫుడ్ బయోటెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌ఏబీఐ)లో కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.



- **పోస్టులు-ఖాళీలు:**
- ఫైనాన్స్ ఆఫీసర్-1, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్-1, కంప్యూటర్ ఆపరేటర్-1 ఖాళీ ఉన్నాయి.
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో
- (వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు)
- **చివరితేదీ:** మార్చి 15
- **వెబ్‌సైట్:** www.nabi.res.in

రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్లు

హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ)లో కాంట్రాక్టు ప్రాతిపదికన డాక్టర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

- **పోస్టు:** రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ (జనరల్)
- ఖాళీలు- 2
- ఈ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేస్తారు.
- **అర్హతలు:** ఎంబీబీఎస్‌తోపాటు మెడికల్ కౌన్సిల్‌లో శాశ్వత సభ్యత్వాన్ని కలిగి ఉండాలి. కనీసం పదేండ్ల అనుభవం ఉండాలి.
- **జీతం:** నెలకు రూ.65,000తోపాటు ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం కల్పిస్తారు.
- ఈ పోస్టులు బాలానగర్, షాద్‌నగర్‌లోని ఎన్‌ఆర్‌ఎస్‌సీలో ఉన్నాయి.
- **దరఖాస్తు:** రెజ్యూమేను ఆర్డినరీ పోస్టులో పంపాలి.
- **ఎంపిక:** దరఖాస్తు చేసుకున్నవారిని షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికచేస్తారు.
- **చివరితేదీ:** ఫిబ్రవరి 15
- **వెబ్‌సైట్:** https://www.nrsc.gov.in

రైల్‌వీల్‌లో క్రీడాకోటా పోస్టులు



బెంగళూరులోని రైల్ వీల్ ఫ్యాక్టరీ క్రీడాకోటాలో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **పోస్టు:** గ్రూప్ డీ క్యాడర్
- **పేస్కేల్:** రూ.5,200-20,200+గ్రేడ్ పే రూ.1,800/-
- **వయస్సు:** 18-25 ఏండ్ల మధ్య ఉండాలి.
- **విద్యార్హతలు:** పదోతరగతితోపాటు నేషనల్ అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్ ఉండాలి లేదా పదోతరగతి ఉత్తీర్ణత లేదా సంబంధిత బ్రాంచీలో ఐటీఐ ఉత్తీర్ణత.
- **క్రీడా విభాగాలు:** క్రికెట్ (మెన్), హాకీ (మెన్), ఫుట్‌బాల్ (మెన్), కబడ్డీ (మెన్)
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 23
- **వెబ్‌సైట్:** www.rwf.indianrailways.gov.in

ఐఐఎస్ఈఆర్‌లో

పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (ఐఐఎస్ఈఆర్)లో నాన్ టీచింగ్ స్టాఫ్ భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **పోస్టు:** టెక్నికల్ అసిస్టెంట్-1
- **అర్హతలు:** ఫిజిక్స్/ఎలక్ట్రానిక్స్ లేదా ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో ఎమ్మెస్సీ లేదా బీఈ/బీటెక్‌లో ఎలక్ట్రానిక్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్.
- **వయస్సు:** 30 ఏండ్లు మించరాదు.
- **పోస్టు:** జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ (మల్టీస్కిల్)
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ లేదా ఇంటర్ ఉత్తీర్ణత, సంబంధిత రంగంలో కనీసం మూడేండ్ల అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 33 ఏండ్లు మించరాదు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 15
- **వెబ్‌సైట్:** www.iiserpune.ac.in

III.
నమస్తే తెలంగాణ
రైతుబడి
[కరీంనగర్]
గురువారం 31 జనవరి 2019

raithubadi@ntnews.com

మక్కసాగులో సంరక్షణ

ఈ ఏడాది వానకాలంలో రాష్ట్రంలో మక్క జొన్న ఆశించిన దానికంటే ఎక్కువ మొత్తంలో సాగు అయ్యింది. యాసంగిలో కూడా రైతులు మక్కజొన్న సాగు చేస్తున్నారు. అయితే గతంలో మక్కపంటకు చీడపీడల బెడద, తెగుళ్ల ప్రభావం తక్కువగా ఉండేది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా చీడపీడల బెడద, తెగుళ్ల ప్రభావం ఎక్కువగా కనబడుతున్నది. వీటిలో కాండం తొలిచే పురుగు ప్రధానమైనది. కాబట్టి రైతులు పురుగు ఉధృతి లక్షణాలు గమనించాలి. సకాలంలో తగిన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఖమ్మం జిల్లా వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

జీవిత చక్రం ఇలా..

తల్లి రెక్కల పురుగు మధ్యస్థ పరిణామంలో ముందు రెక్కల పురుగు లేత గోధుమ వర్ణంలోఉంటుంది. ముదురు గోధుమ రంగు గల పురుగు గీత వెనుక ఉంటుంది. తల్లి రెక్కల పురుగు సుమారుగా 80– 300 గుడ్లు పెడుతుంది. 2,3 వారాల వయస్సు ఉన్న మొక్కలో ఆకు అడుగు భాగాన గుడ్లను పెడుతాయి. మొదట తెలుపు రంగులో ఉన్న గుడ్లు పొదుగు దశ వచ్చే సమయంలో గోధుమ రంగులోకి మారుతాయి. గుడ్ల నుంచి పొదిగి వచ్చిన లార్వా సుమారుగా 25 నుంచి 30 మి.మీ పొడవుగా తల భాగం, శరీర పైభాగం తెలుపురంగు వర్ణంలో ఉంటుంది. ఈ పురుగు జీవిత చక్రాన్ని 6 లేదా 7 వారాల్లో పూర్తి చేసుకుంటుంది. ఒక సంవత్సరంలో సుమారుగా 4 నుంచి 5 జీవిత చక్రాలను పూర్తి చేసుకుంటుంది.



నష్టపరుస్తుంది ఇలా..

గుడ్ల నుంచి పొదిగి వచ్చిన లార్వా ఆకు అడుగు భాగాన ఉంటూ కాండం, ఆకు పైభాగాన పత్రహరితాన్ని తింటూ మొక్కను నష్టపరుస్తుంది. ఒక్కో సమయంలో కాండాన్ని కూడా తింటుంది. దీనివల్ల సుడుల నుంచి వచ్చిన ఆకుల్లో చిన్నచిన్న రంధ్రాలు కనబడుతాయి. ఎదిగిన లార్వాలు మొవ్వలోకి పోయి మొవ్వను తినడం వల్ల మొవ్వలు ఎండిపోతాయి. ఎదిగే మొవ్వను ఆశించడం వల్ల కాండంపై లార్వా నష్టపరిచిన గాట్లను గమనించవచ్చు. లార్వా తీవ్రత, మొక్కను ఆశించినప్పుడు సులువుగా మొక్క విరిగిపోతుంది. అలాగే మొక్క ఎదుగకుండా పొట్టిగా ఉంటుంది. తద్వారా కంకి చిన్న పరిణామంలో ఉంటుంది.

నివారణ

ప్రతిరోజూ పంటను శుభ్రంగా ఉంచుకోవాలి. ఎలాంటి కలుపునకు తావివ్వకుండా చర్యలు తీసుకోవాలి. లార్వా ఆశించి నష్టపరిచిన మొక్క భాగాలను తీసివేసి నాశనం చేయాలి. పంట తీసిన తరువాత మిగిలిపోయిన పంట వ్యర్థలనూ తీసివేయాలి లేదా దుక్కిలో దున్నుకోవాలి. క్లోరాంట్రానిల్‌ప్రోల్ 0.3 మిల్లిమిటర్లు లీటరు నీటికి మొక్క 10 నుంచి 12 రోజుల వయస్సు ఉన్నప్పుడు పిచికారీ చేసుకోవాలి. కార్బోఫ్యూరాన్ 3 కేజీల గుళికలు, ఎకరానికి 25 నుంచి 30 రోజుల వయస్సు ఉన్నప్పుడు పంటలో వేసుకోవాలి.


-మద్దెల లక్ష్మణ్, 90107 23131
ఖమ్మం వ్యవసాయం

కాయగూరల పంటల సంజీవని

మైక్రోబియల్ కన్సార్సియా

రాష్ట్రంలో ఏడాదంతా కాయగూరలు సాగులో ఉంటున్నాయి. పంటలు ఏపుగా పెరిగి, మేలైన దిగుబడులు రావడంలో మొక్కల ఆరోగ్యం ముఖ్యం. దీనికి రసాయనాలు అందుబాటులో ఉన్నాయి. అయితే రసాయన అవశేషాల నేపథ్యంలో వాటి వాడకం సిఫార్సు కాదు. కేవలం పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులతో బెంగళూరులోని IIHR తయారుచేసిన 'మైక్రోబియల్ కన్సార్సియా' రైతుల ఆదరణ చూరగొన్నది. సేంద్రియ ఎరువుగా, తెగులు శిలీంధ్ర ఇది నాశనిగా దీన్ని వాడవచ్చు.

అర్కా మైక్రోబియల్ కన్సార్సియ (AMC) బయోమిక్ ఎన్‌పిజడ్‌కే పేరుతో ఉంటుంది. దీనిలో NPZ ఉంటాయి. లిగ్నైట్ ఆధారిత సూక్ష్మజీవిక ఉత్పత్తి. దీనిలో నత్రజనిని స్థాపించే భాస్వరం, జింకును కరిగించే బ్యాక్టీరియాతో పాటు మొక్కల పెరుగుదలకు కూడా తోడ్పడే బ్యాక్టీరియా ఉంటుంది. ఈ ఉత్పత్తిని విత్తనాలు, నేలలు, నీటిలో కలిపి లేదా నర్సరీలో సైతం నేరుగా వాడుకోవచ్చు.



వాడే పద్ధతులు

విత్తనశుద్ధి: 20 మి.లీ వండిన బియ్యం జిగురుతో 10–20 గ్రాముల ఉత్పత్తిని కలిపి స్లర్రీగా తయారు చేయాలి. ఇలా తయారైన స్లర్రీని 100–200 గ్రాముల విత్తనానికి పట్టించి విత్తుకోవచ్చు. విత్తనాలను స్లర్రీ సమానంగా పట్టేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆ విత్తనాలను 30 నిమిషాల వరకు నీడలో ఆరబెట్టి, 24 గంటలలోపు పొలంలో విత్తుకోవాలి.

కొబ్బరిపీచుతో వాడకం

బయోమిక్–ఎన్‌పిజెడ్‌కేను కొబ్బరిపీచును పోషక సహితంగా చేసేందుకు సైతం వాడుకోవచ్చు. వెయ్యి కిలోల కొబ్బరి పీచుకు ఒక కిలో బయోమిక్ సిఫార్సు చేయబడింది. లేదా ఒక కిలో కొబ్బరి పీచుకు 20 గ్రాముల బయోమిక్ ఉత్పత్తితో పిచికారీ చేసి వాడుకోవచ్చు. ఇలాంటి శుద్ధి తర్వాత రాత్రంతా ఉంచి, ప్రోట్రేలలో వాడితే మేలైన ఫలితాలుంటాయి.

నేలలో వాడటం

ఎకరంలో పంటను వేసేందుకు గాను ఐదు కిలోల బయోమిక్ అవసరం ఉంటుంది. నర్సరీలో పెంచి, ప్రధాన పొలంలో నాటే పంటలకు అయితే, లీటరు నీటికి 20 గ్రాముల కన్సార్సియాను కలిపి, ఆ తర్వాత ప్రధాన పొలంలో పంటను నాటిన 10 వ రోజు వేరు వ్యవస్థ దగ్గరలో వేయాలి. నేరుగా నాటే పంటలైతే, నాటిన 4 నుంచి 7వ రోజుల్లో వేరు వ్యవస్థలో వేయాలి.

ప్రధాన పొలంలో వాడటం

ఎకరా ప్రధాన పొలంలో నాటేందుకు అవసరమయ్యే పంటకు గాను ఐదు కిలోల బయోమిక్ కన్సార్సియం అవసరం. 500 కిలోలు బాగా చివికిన పశువుల ఎరువుతో ఐదు కిలోల కన్సార్సియం బాగా కలిసేలా కలిపి పొలంలోని మొక్కల వేరు వ్యవస్థలో వేయాలి. అదే విధంగా, పొలం తయారీ సమయంలో సైతం వేయవచ్చు.

కన్సార్సియం వాడకంతో ఉపయోగాలు

విత్తన మొలక శాతాన్ని పెంచుతుంది. మొక్కల పెరుగుదలను ఎక్కువ చేస్తుంది. పైన పేర్కొన్న విధంగా వాడితే, నత్రజని, భాస్వరం వాడకంలోని 25 శాతం ఎరువులను ఆదా చేస్తుంది. పంటల ఉత్పాదకత పెంచుతుంది.

కన్సార్సియం నిల్వలో కిటుకులు

బ్యాక్టీరియా ఆధారిత కన్సార్సియం కాబట్టి తయారీ దగ్గరి నుంచి పంటలకు వాడే వరకు వాటి సంఖ్య తగ్గకుండా నిల్వలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. కచ్చితంగా పొడిగా ఉండే చల్లని ప్రాంతాల్లో నిల్వ ఉంచాలి. సూర్యరశ్మి నేరుగా ఉత్పత్తులపై పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇలాంటి పరిస్థితుల్లో ఆరు నెలల వరకు నిల్వ ఉంటాయి.

సేంద్రియ సేద్యానికి ఊతం

అర్కా మైక్రోబియర్ కన్సార్సియం శుద్ధమైన జీవన పదార్థం. దీనితో అసలు రసాయనాలు ఉండవు. ఇందులో ఉండే మూడు రకాల బ్యాక్టీరియా పూర్తి సేంద్రియ సాగుకు అత్యంత ఉపయోగం. నత్రజని స్థాపన, భాస్వరం, జింకు కరిగించే శక్తి ఉండే బ్యాక్టీరియాలు ఇందులో ఉన్నాయి. కాబట్టి జీవన ఎరువులుగా అదే విధంగా సస్యరక్షణ జీవన పురుగు మందుగా కన్సార్సియం ఉపయోగపడుతుంది. వివిధ విశ్వవిద్యాలయాలు ఈ తరహా కన్సార్సియా తయారుచేసి, విక్రయిస్తున్నప్పటికీ అర్కా ఉత్పత్తులకు నాణ్యత ఎక్కువ.

ఈ కన్సార్సియా తెగుళ్లను సమర్థవంతంగా నియంత్రించగలదు. కూరగాయలలో నారుకుళ్లు, మొదలు కుళ్లు ఫ్యుజేరియం ఎండు తెగుళ్లను నియంత్రిస్తుంది. అదేవిధంగా బ్యాక్టీరియా ఎండుతెగులు, ఇతర పంటలలో ఎండుతెగుళ్లను కూడా సమర్థవంతంగా నియంత్రించగలుగుతుందన్న పరిశోధన ఫలితాలు ఉన్నాయి.

అర్కా మైక్రోబియల్ కన్సార్సియం బయోమిక్ ఎన్‌పిజెడ్‌కే పేరుతో బెంగళూర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ రీసెర్చ్ విక్రయిస్తుంది. వారి నుంచి ఆమోదం, లైసెన్స్ పొందిన ప్రైవేటు విక్రయదారులు సైతం రాష్ట్రంలో వివిధ పేర్లతో విక్రయిస్తున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం విక్రయిస్తున్న వారిని 09148928714 లేదా 09177178001, plantdoctorforfarmer@gmail.com సంప్రదించవచ్చు



డాక్టర్
పిడిగెం సైదయ్య
77805 09322
శాస్త్రవేత్త, రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం

బయోమిక్ అర్క మైక్రోబియల్ కన్సారియం

ఈ ద్రవరూప సూక్ష్మజీవిక ఉత్పత్తిలో నత్రజనిని స్థాపించే, భాస్వరం, పొటాషియం, జింక్‌లను కరిగించి మొక్కకు అందించే బ్యాక్టీరియాలు ఉన్నాయి. ఇది పూర్తిగా నీటిలో కరుగుతుంది. ఈ ఉత్పత్తిని విత్తనశుద్ధికి, నారుమడికి, నేలలో నీటిలో కలిపి నేరుగా వాడవచ్చు.

వాడే పద్ధతులు

విత్తనశుద్ధి: 20 మి.లీ బయోమిక్ ఉత్పత్తిని 20 మి.లీ బియ్యం గంజితో కలిపి మిశ్రమం తయారుచేసుకోవాలి. ఈ మిశ్రమంలో 200 గ్రాముల విత్తనాలను పట్టించి, 30 నిమిషాలు నీడలో ఆరబెట్టి, 24 గంటలలోగా విత్తుకోవాలి. ఈ మిశ్రమం విత్తనాలకు సమానంగా పట్టేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

కొబ్బరిపీచుతో వాడకం

లీటరునీటికి 20 మి.లీ. బయోమిక్–ఎన్‌పీజడ్ కలిపి, 1000 కి.గ్రాల బాగా చివికిన కొబ్బరిపీచుపై చల్లుకోవచ్చు. ఇలా చేస్తే చివికిన కొబ్బరిపీచు మరింత పోషక సహితంగా మారి, నారు ఆరోగ్యంగా, త్వరగా పెరుగుతుంది. ఈ విధంగా తయారుచేసుకున్న కొబ్బరిపీచు (కోకోపీట్)ను వాడితే, నర్సరీ దశలో వచ్చే వేరుకుళ్లు, కాండం కుళ్లు తెగుళ్లను అరికట్టవచ్చు. కూరగాయలు/పండ్లు/పూల మొక్కల నారు త్వరగా నాటడానికి సిద్ధమవుతుంది.

నేలలో వాడటం (సాయిల్ డ్రైంచింగ్)

ఎకరంలో పంటను వేసేందుకు గాను, మూడు లీటర్ల బయోమిక్ అవసరం. నర్సరీ పెంచి, ప్రధాన పొలంలో నాటే పంటలకు అయితే ప్రధాన పొలంలో పంటను నాటిన నాలుగు లేదా ఏడు రోజుల్లోపు దీన్ని వేరు వ్యవస్థ దగ్గర రోజ్‌క్యాన్‌తో పొయ్యాలి.



ప్రధాన పొలంలో వాడటం

ఎకరా ప్రధాన పొలంలో నాటేందుకు అవసరమయ్యే పంటకు గాను మూడు లీటర్ల బయోమిక్ కన్సారియం అవసరం. 500 కిలోలు బాగా చివికిన పశువుల ఎరువుతో మూడు లీటర్ల కన్సార్సియం బాగా కలిసేలా కలిపి పొలంలోని మొక్కల వేరు వ్యవస్థలో వేయాలి. అదేవిధంగా పొలం తయారీ సమయంలోనూ వేయవచ్చు.

ఫెర్టిగేషన్

డ్రిప్ సిస్టంలో, ఫెర్టిగేషన్ ట్యాంకులో 200 లీటర్ల నీటికి 3 లీటర్ల 'ద్రవరూప బయోమిక్ ఎఎమ్‌సి' కలిపి, డ్రిప్ ద్వారా మొక్కల పాదుల్లో అందించవచ్చు. ప్రతి రెండు నెలలకు ఒకసారి ఇలా అందివ్వాలి.

–ద్రవరూప బయోమిక్ ఉత్పత్తి 100 శాతం నీటిలో కరుగుతుంది. కాబట్టి డ్రిప్ నాజిల్స్ మూసుకుపోయే సమస్య ఉండదు.

–డ్రిప్ ద్వారా అందించడం వల్ల కూలీల ఖర్చు తగ్గించుకోవచ్చు.

–చాలా త్వరగా ఫలితాలు వచ్చి, అధిక దిగుబడులు రాబట్టవచ్చు.

మామిడిలో పూత సమయంలో సమగ్ర సస్యరక్షణ

- అల్పపీడన ద్రోణితో అప్రమత్తంగా ఉండాలి
- సమగ్ర నివారణ చర్యలతోనే అధిక దిగుబడి

రాష్ట్రంలో సుమారు 3.15లక్షల హెక్టార్లలో మామిడి తోటలు ఉన్నాయి. ముఖ్యంగా కరీంనగర్, జగిత్యాల, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, మంచిర్యాల, వరంగల్ రూరల్ జిల్లాల్లో అధిక విస్తీర్ణంలో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. గత మూడునాలుగు రోజులుగా మంచు కమ్ముకున్నది. రాష్ట్ర వ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోయాయి. దీంతో రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ప్రస్తుతం చాలాచోట్లలో మామిడి తెల్లపూత నుంచి పిందెకట్టు దశలో ఉన్నది. ఈ సమయంలో పూతకాడలపై ఆంత్రక్నోస్ మచ్చలు ఏర్పడి అవి క్రమేపీ పెద్దగా తయారై పూతకాడలు రాలిపోతాయి. వీటి నివారణకు రైతులు కార్బండిజమ్ 2గ్రాములు/లీ. + మాంకోజెబ్ 2గ్రా./లీ కలిపి పిచికారీ చేస్తే సమర్థవంతంగా నివారించవచ్చని ఉద్యానశాఖ అధికారులు సూచిస్తున్నారు.



తోటల్లో తెగుళ్ల నివారణ:

ప్రస్తుతం మొగ్గ దశల ఉన్న తోటల్లో క్లోరిపైరిఫాస్, నీటిలో కరిగే గంధకం 3గ్రా. కలిపి పిచికారీ చేస్తే తేనెమంచు పురుగు, బూడిద తెగులు రాకుండా నివారించవచ్చు. మొగ్గ తొందరగా విచ్చుకోవడానికి, పూత, కాడ పొడవుగా పెరుగడానికి పొటాషియంనైట్రేట్ లీటరు నీటికి 10గ్రా. కలిపి పిచికారీ చేసుకోవాలి. నీటి వసతి ఉన్న వారు మొగ్గ పగిలే దశ గమనించి నీరు పెట్టాలి. అయితే తప్పనిసరిగా డ్రిప్ ద్వారానే నీరు పెట్టాలి.

మొగ్గదశలో చేపట్టవలసిన చర్యలు:

పూత మొగ్గలు బయటకు వచ్చే వరకు నీటి తడి ఇవ్వరాదు. మొగ్గ పగిలే దశలో పొటాషియం నైట్రేట్ 10గ్రా. నీటికి కలిపి పిచికారీ చేస్తే మొగ్గ త్వరగా పగిలి పూత వచ్చే అవకాశం ఉంటుంది. జూన్–జూలై వర్షాభావ పరిస్థితుల వల్ల ఎరువులు వేయలేకపోయినవారు పిందె దశలో 1/2కిలో యూరియా 1/2కిలో పొటాష్ ఎరువులు వేసుకోవాలి. నీటి వసతి లేని వారు పిందె 1 శాతం యూరియా ద్రావణాన్ని 15రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి. పూత ఆలస్యమైన తోటల్లో కాయ పెరుగుదల దశలో తప్పనిసరిగా డ్రిప్ ద్వారా నీరు పెట్టుకోవాలి. సాగునీటి సౌకర్యంలేని వర్షాధారపు తోటల్లో పెరుగుతున్న పిందెల మీద, కాయల మీద ఒక శాతం యూరియా (10గ్రా./లీటరు నీటికి) పిచికారీ చేయాలి.

చీడ పీడల యాజమాన్యం:

పూత దశలో బూడిద తెగులు నివారణకు హెక్సాకోనజోల్ 2మి.లీ. లేదా బెల్‌టాన్1 గ్రా. లలో ఏదైనా ఒక మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పూత ఆలస్యంగా వచ్చినప్పుడు కాయ పెరుగుదల దశలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండి పొడి వాతావరణం ఉంటుంది. కాబట్టి రసం పీల్చే పురుగులు(తామర పురుగులు, నల్లి) ఎక్కువగా ఆశించి నష్టపరిచే అవకాశం ఉన్నది.

తేనెమంచు పురుగు:

ఈ పురుగులు రసాన్ని పీల్చడం వల్ల పూత పూర్తిగా మాడిపోయి పిందె పట్టదు. లేత ఆకులు, కొమ్మల నుంచి కూడా రసం పీల్చడంతో ఆకులు ముడతపడి సరిగా పెరుగవు. పురుగులు విసర్జించిన తేనె లాంటి బంక ఆకుల మీద కనబడుతుంది. సూర్యరశ్మి వెలుతురులో మెరుస్తూ ఉంటుంది.

నివారణ:

లీటరు నీటికి డైమిథోయేట్ 2మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.5మి.లీ చొప్పున కలిపి పూత మొదలయ్యే, పిందెలు తయారయ్యే సమయాల్లో పూత ఆకులపైనే కాకుండా మొదళ్లపైన, కొమ్మలపైన కూడా పిచికారీ చేయాలి. పూత పూర్తిగా విచ్చుకోకముందే పిచికారీ చేయాలి. పూత బాగా ఉన్నప్పుడు పిచికారీ చేయడం వల్ల పుప్పొడి రాలి పరాగ సంపర్కానికి తోడ్పడే కీటకాలు నశిస్తాయి. మొగ్గదశలో కనిపిస్తే ఇమిడాక్లోప్రిడ్ 0.3మి.లీ. థయోమిథాక్సామ్ (0.3గ్రా./లీ. నీటికి) పిచికారీ చేస్తే పూత, కాపు సమయంలో తేనెమంచు పురుగును సమర్థవంతంగా నివారించవచ్చు.

తామర పురుగులు:

ఇవి 2 మి.మీ పొడవు ఉంటాయి. కొత్త చిగురు వచ్చే దశలో ఆకులపై అసంఖ్యాకంగా చేరి గోకి రసాన్ని పీల్చివేస్తాయి. దీనివల్ల చిగురు ఆకులు చిన్నగా ఉండి, ఆ తర్వాత రాలిపోతాయి. ఈ తామర పురుగులు పుష్పగుచ్ఛాలపై, పిందెలపై చర్మం గీకి రసం పీలుస్తాయి. దీనివల్ల వక్క రంగులో చర్మం బీటలు వారి 'రాతి మంగు' ఏర్పడి కాయ నాణ్యత పడిపోతుంది. ఈ పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 1.5 మి.లీ లీటరు నీటికి కలిపి నల్లపూత దశలో అంటే పిందెలు ఎదిగే దశలో పిచికారీ చేయాలి.

ఆకుజల్లెడ గూడు పురుగు:


శాఖీయ పెరుగుదల అధికంగా ఉన్నా పూత తగ్గడం లేదా పూమొగ్గలు తక్కువగా వస్తాయి. ఇలాంటి సందర్భాల్లో శాఖీయ పురుగుదల నియంత్రించేందుకు లీటరు నీటికి 1–2మి.లీ.సైకోసిల్ కలిపి పిచికారీ చేయాలి.

సూక్ష్మ పోషకాల వాడకం:

ఈ ఏడాది పిందె రాలడం, కాయ పగలడం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నది. జింకు (1.2గ్రా.జింకుసల్ఫేట్)1.25గ్రా. బోరాన్ లీటరు నీటికి కలిపి పూత మొగ్గల పెరుగుదల దశలో ఉన్నప్పుడు చెట్లు బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి. దీనివల్ల పిందె శాతం పెరుగడమే కాకుండా కాయ పగలకుండా నివారించుకోవచ్చు. మామిడి పిందెలు ముఖ్యంగా జొన్నగింజ పరిమాణంలోను, గోలికాయ పరిమాణంలోను ఉన్నప్పుడు కూడా రాలుతాయి. రైతుకు గోలికాయ పరిమాణంలో ఉన్నప్పుడు రాలిపోతే దిగుబడి బాగా తగ్గుతుంది. దీని నివారణకు నాఫ్తలిన్ ఎసిటిక్ ఆమ్లం హార్మోన్‌ను 10–20 పి.పి.యం. చొప్పున పిచికారీ చేయాలి.

-గుండెల రాజు, 72889 85757
మహబూబాబాద్ వ్యవసాయం

రైతులు అప్రమత్తంగా ఉండాలి



ఆకాల వర్షాలతో మామిడి తోటలను పురుగులు ఆశిస్తాయి. తోటలను తీవ్ర నష్టపరుస్తాయి. రోజురోజుకూ వీటి ఉధృతి ఎక్కువ ఉంటుంది. ఈ పురుగు ఉనికి మామిడి సాగుతున్న అన్నిప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నది. మామిడితోటల్లో చేపట్టే యాజమాన్య విధానాన్ని బట్టి తామర పురుగులు, తేనెమంచు పురుగులు, ఆకుజల్లెడ గూడు పురుగులు ఉధృతి 1– 8 శాతం వరకు ఉంటుంది. ఈ పురుగు ఆశిస్తే తీరని నష్టం జరుగుతుంది. రైతులు మందస్తుగా అధికారుల సలహాలతో తగినచర్యలు తీసుకోవాలి. దీనివల్ల మంచి దిగుబడులతో పాటు ఆదాయం పొందవచ్చు.

- కె. సూర్యనారాయణ, 79977 25108
జిల్లా ఉద్యాన శాఖ అధికారి, మహబూబాబాద్
టోల్ ఫ్రీ నెంబరు: 18004250519


రైతుబడికి ఆహ్వానం



రైతు పంట పొలాలే జీవితంగా వ్యవసాయంలో రేయింబవళ్లు పనిచేస్తాడు. తమవైన అనుభవాలు, గుణపాఠాలతో మెరుగైన, మేలైన పంట విధానాలకు జీవం పోస్తాడు. ఇలాంటి అనుభవాలు పదిమందితో పంచుకుంటే రైతులకు మరింత మేలు జరుగుతుంది. కాబట్టి రైతు సోదరులు తమవైన అనుభవాలు, గుణపాఠాలతో పాటు, తమ సృజనాత్మక పనిలో భాగంగా కొత్తగా ఆవిష్కరించిన పనిముట్ల గురించి రైతుబడికి రాసి పంపించగలరు.

రచనలు పంపవలసిన చిరునామా 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. raithubadi@ntdaily.news, Fax-040-23291118

నమస్తే తెలంగాణ
చిత్రం
[కరీంనగర్]
గురువారం 31 జనవరి 2019



సినిమాను ప్రేక్షకుడికి చేరువచేసేది.. అది ఎలాంటి సినిమా తెలియజేసేది ఓ సినిమా టైటిలే... ఇక ఆ సినిమా పేరును బట్టి మాస్, క్లాస్ చెప్పేయచ్చు. టైటిల్ సినిమాను నిర్వచిస్తుంది. అదే సినిమాకు బ్రాండ్‌గా ఉపయోగపడుతుంది. కథకు తగ్గట్లుగా సరైన పేరును నిర్ణయిస్తే సగం విజయం సాధించినట్లేనని దర్శకనిర్మాతలు భావిస్తుంటారు. తమ సినిమాలకు టైటిల్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటారు సదరు చిత్ర యూనిట్. అయితే ఈ టైటిల్స్ కొన్ని సార్లు నిర్మాతల మధ్య వివాదాల్ని సృష్టిస్తున్నాయి. హీరోలతో పాటు దర్శకనిర్మాతల్ని సమస్యల వలయంలో చిక్కుకునేలా చేస్తున్నాయి

టైటిల్.. నీదా?.. నాదా?

తాజాగా 'ముద్ర' టైటిల్ హీరో నిఖిల్, నిర్మాత నట్టికుమార్‌ల మధ్య వివాదాన్ని రాజేసింది. ప్రస్తుతం నిఖిల్ 'ముద్ర' టైటిల్‌తో ఓ సినిమా చేస్తున్నారు. ఇదే టైటిల్‌తో జగపతిబాబు కథానాయకుడిగా నట్టికుమార్ ఓ సినిమాను నిర్మించారు. చాలా రోజుల క్రితమే షూటింగ్‌ను పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని ఈ నెల 25న నట్టికుమార్ విడుదలచేశారు. అయితే జగపతిబాబు చిత్రానికి నిఖిల్ నటిస్తున్న తాజా చిత్రానికి ఒకే టైటిల్ కావడం సమస్యకు దారితీసింది. జగపతిబాబు సినిమా స్థానంలో తన ముద్ర సినిమా పోస్టర్స్‌ను ఉపయోగించి టికెట్స్ అమ్ముకుంటూ మోసానికి పాల్పడుతున్నారని ఇది దారుణమని నిఖిల్ ట్విట్టర్‌లో వ్యాఖ్యానించడం వివాదానికి దారితీసింది. 'కొందరు ఉద్దేశపూర్వకంగానే తన ముద్ర సినిమా లోగోను వాడుకుంటున్నారు. తన పేరును బుకింగ్స్ యాప్‌లో ఉపయోగిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకుంటాం' అని నిఖిల్... నట్టికుమార్ పేరు చెప్పకుండానే అతడిపై విమర్శలు గుప్పించారు. నిఖిల్ వ్యాఖ్యలతో ఈ వివాదం కొత్త మలుపు తిరిగింది. నిఖిల్ మాటలపై నట్టికుమార్ ఘాటుగానే సమాధానమిచ్చారు. 'ముద్ర' టైటిల్ తనదేనని, అందుకు సంబంధించిన పూర్తి ఆధారాలు తన వద్ద ఉన్నాయని పేర్కొన్నారు నట్టికుమార్. వాస్తవాలు తెలుసుకోకుండా తన ఫొటోను, సినిమా లోగోను పెట్టుకొని టికెట్స్ అమ్ముకుంటున్నారంటూ హీరో నిఖిల్ తనపై నిరాధారమైన ఆరోపణలు చేశారని ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు. టైటిల్ తనది అని వాదిస్తున్న నిఖిల్ నిజాల్ని నిరూపించలేని పక్షంలో సినిమాల్ని వదిలిపెట్టి వెళ్లిపోవాలని పేర్కొన్నారు.'ఎవరిని సంప్రదించకుండా టైటిల్ లాక్కునాన్నని నిఖిల్ అసభ్యపదజాలంతో నన్ను దూషించారు. విడుదల సమయంలో నా సినిమా చూడొద్దని ప్రచారం చేశారు. అతడు క్షమాపణలు చెప్పకపోతే ఊరుకునేది లేదు' అని నిఖిల్‌పై మండిపడ్డారు నట్టికుమార్. ఈ టైటిల్ విషయంలో తలెత్తిన గందరగోళం చినికి చినికి గాలివానగా తయారైంది. తెలుగు సినీ పరిశ్రమను మరోసారి కలవరపాటుకు గురిచేసింది. ప్రస్తుతం టైటిల్ కారణంగా ఏర్పడిన సమస్యల్ని పరిష్కరించుకునే ప్రయత్నాల్లో నిఖిల్ ముద్ర చిత్ర బృందం నిమగ్నమైంది. ఈ వివాదం కారణంగా తన సినిమా టైటిల్‌ను మార్చుకొనే ఆలోచనలో హీరో నిఖిల్ ఉన్నట్లు తేలిసింది.

మహేష్‌బాబుకు తప్పలేదు..

టైటిల్ వివాదాలు తెలుగు చిత్రసీమకు కొత్తేమీ కాదు. మహేష్‌బాబు, రవితేజ వంటి అగ్ర హీరోలకు ఈ టైటిల్ కష్టాలు తప్పలేదు. గతంలో త్రివిక్రమ్ దర్శకత్వంలో మహేష్‌బాబు కథానాయకుడిగా తెరకెక్కిన 'ఖలేజా' టైటిల్ వివాదాస్పదంగా మారింది. తమ టైటిల్‌ను మహేష్‌బాబు సినిమాకు ఉపయోగించారని విజయభాస్కర్, సుబ్బారెడ్డి అనే దర్శకనిర్మాతలు ఆరోపణలు చేశారు. 'కత్తి' సినిమా టైటిల్ దర్శకుడు గుణశేఖర్, కల్యాణ్‌రామ్ మధ్య వివాదాన్ని సృష్టించింది. 'కత్తి' టైటిల్‌ను తాను రిజిస్టర్ చేయిస్తే దానికో తోక తగలించి కల్యాణ్‌రామ్ వాడుకున్నాడని గుణశేఖర్ విమర్శించారు. పవన్‌కల్యాణ్ హీరోగా రూపొందిన 'కాటమరాయుడు' టైటిల్ విషయంలో అడ్డంకులు ఎదురయ్యాయి. అప్పటికే ఈ టైటిల్‌ను హాస్యనటుడు సప్తగిరి తన సినిమాకు రిజిస్టర్ చేసుకున్నారు. పవన్‌కల్యాణ్ తన సినిమాకు ఇదే పేరు అయితే బాగుంటుందని అభిప్రాయపడటంతో ఆయన మీదున్న అభిమానంతో సప్తగిరి తన సినిమా పేరును సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌గా మార్చుకున్నారు. ప్రస్తుతం కార్తికేయ కథానాయకుడిగా తెరకెక్కుతున్న ఓ కొత్త సినిమాకు టైటిల్ సమస్యలు ఎదురైనట్లు సమాచారం. ఈ టైటిల్ సమస్యల వల్ల కష్టపడి సినిమాలు చేస్తున్న నిర్మాతలు నష్టాల పాలవుతున్నారు.

టైటిల్ రిజిస్టర్ చేయడం ఎలా..

తొలుత బ్యానర్ పేరును రిజిస్టర్ చేసుకున్న తర్వాత ఆ సంస్థ ద్వారా టైటిల్స్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఓ టైటిల్‌ను రిజిస్టర్ చేసుకునే సమయంలో ప్రొడ్యూసర్ గిల్డ్, తెలుగు ఫిలిం ఛాంబర్, తెలంగాణ ఫిలిం ఛాంబర్, సౌత్ ఇండియా ఫిలింఛాంబర్‌తో పాటు ఇతర చోట్ల ఆ పేరు నమోదు అయిందో లేదో తెలుసుకున్న తర్వాతే నిర్మాతలకు టైటిల్‌ను కేటాయిస్తారు. ఒక సారి టైటిల్ రిజిస్టర్ చేసుకుంటే ఏడాది వరకు దాని గడువు ఉంటుంది. ఏడాది పూర్తయిన తర్వాత రెన్యువల్‌తో గడువును పొడగించుకునే వెసులుబాటు ఉంది. టైటిల్ రిజిస్ట్రేషన్ చేసుకున్న సంవత్సరంలోగా ఆ చిత్ర షూటింగ్‌ను మొదలుపెట్టాలి. లేకపోతే సదరు టైటిల్‌ను ఇతరులకు కేటాయించే అధికారం తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలికి వుంది.

స్వల్పమార్పులతో టైటిల్స్: కొన్ని చిత్రాల విషయంలో స్వల్ప మార్పులతో ఒకే టైటిల్స్‌ను నిర్ణయిస్తున్నారు. తాజాగా జగపతిబాబు 'ముద్ర' విషయంలో అదే జరిగింది. నట్టికుమార్-జగపతిబాబుతో నిర్మించిన చిత్రానికి 'ముద్ర' టైటిల్‌ను రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో నిఖిల్‌తో సినిమా చేసే నిర్మాతలు టైటిల్‌కు ముందు హీరో పేరు జతచేసి 'నిఖిల్ ముద్ర'గా మార్చుకున్నారు. అయితే రెండింటికి టైటిల్ లోగోలను ఒకటే వాడటంతో సమస్య తలెత్తింది. అయితే టైటిల్స్ విషయంలో ఇలాంటి సమస్యలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా వుండాలంటే తెలుగు చలనచిత్ర మండలి టైటిల్స్ రిజిస్ట్రేషన్స్ విషయంలో నియమ నిబంధనలు మరింత కఠినతరం చేయాల్సిన అవసరం వుందని, దర్శక నిర్మాతలు అభిప్రాయపడుతున్నారు.



సినిమా టైటిల్స్‌ను స్వల్ప మార్పులతో రెండు బ్యానర్‌లకు కేటాయించడం వల్లే సమస్యలు వస్తున్నాయి. ఈ విషయంలో అందరూ ఏకతాటిపైకి వచ్చి నిర్ణయం తీసుకోవాలి. సినిమా టైటిల్స్ రిజిస్ట్రేషన్స్ చేసే వరకు గోప్యంగా వుంచుకోవాలి. టైటిల్స్ పేరుపై డబ్బులు వసూలు చేసే వారిపట్ల కఠినంగా వుండాలి.
- ఎన్.శంకర్, దర్శకుల సంఘం అధ్యక్షుడు.



'టైటిల్స్ విషయంలో కఠినమైన విధానాల్ని ఫిలిం ఛాంబర్ అమలు చేయాలి. టైటిల్స్‌ను అడ్డంపెట్టుకొని డబ్బులు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి'
నిర్మాత మోహన్ వడ్లపట్ల



కీర్తిసురేష్

నానితో వన్స్‌మోర్..

'నేను లోకల్' తర్వాత నాని, కీర్తిసురేష్ కలయికలో మరో సినిమా రానుందా అంటే ఔననే అంటున్నారు టాలీవుడ్ వర్గాలు. 'మహానటి' సినిమాతో తెలుగులోలక్కీస్టార్‌గా మారిపోయింది కీర్తిసురేష్. ఈ విజయం తర్వాత నటనకు ఆస్కారమున్న పాత్రలపై దృష్టిసారించిన ఆమె తాజాగా నానితో ఓ సినిమా చేయనున్నట్లు తెలిసింది. నాని కథానాయకుడిగా విక్రమ్.కె.కుమార్ దర్శకత్వంలో క్రైమ్ థ్రిల్లర్ సినిమా తెరకెక్కనున్నది. మహిళా దృక్కోణం నేపథ్యంలో ఐదు కథల సమాహారంగా వైవిధ్యమైన కథాంశంతో దర్శకుడు విక్రమ్.కె.కుమార్ ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు. నాయిక పాత్రకు ప్రాధాన్యమున్న కథ కావడంతో చిత్రబృందం హీరోయిన్‌గా కీర్తిసురేష్‌ను ఎంచుకున్నట్లు తెలిసింది. ఈ సినిమాలో ఆమె పాత్ర నవ్యరీతిలో సాగనున్నట్లు సమాచారం. కీర్తిసురేష్‌తో పాటు మేఘా ఆకాష్, ప్రియా ప్రకాష్ వారియర్ ఇందులో కీలక పాత్రలను పోషించనున్నట్లు చెబుతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించనున్న ఈ చిత్రం ఫిబ్రవరిలో సెట్స్‌పైకి రానుంది.

'4 లెటర్స్' గీతాలు

ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకిత మహారాణా నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం '4 లెటర్స్'. ఆర్.రఘురాజ్ దర్శకుడు. దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఆడియోను, ట్రైలర్‌ను దర్శకుడు ఎస్వీకృష్ణారెడ్డి గురువారం హైదరాబాద్‌లో విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సినిమా సాంగ్స్ చూస్తే హీరో ఎనర్జీ లెవెల్స్ సూపర్. ఈశ్వర్‌కి కమర్షియల్ హీరో కావాలన్న గొప్పకల వుంది. తల్లిదండ్రులు అండగా నిలబడి అతని కలను ఈ సినిమాతో నిజం చేశారు.తల్లిదండ్రుల ప్రోత్సాహం లేకపోతే ఓ పిల్లవాడు చదువులో ఎలా పైకి రాడో అలాగే తన వృత్తిలో పైకి రాలేడు. ఈశ్వర్‌కి తల్లిదండ్రుల ప్రోత్సాహం వుంది కాబట్టే హీరో అయ్యాడు. చిన్న సినిమా అంటున్నారు కానీ ట్రైలర్ చూస్తే పెద్ద హిట్



చంద్రబోస్, ఉదయ్‌కుమార్, ఈశ్వర్, అచ్చిరెడ్డి, సురేష కృష్ణారెడ్డి, టువ చక్రవర్తి, అంకిత, భీమ్స్

అయ్యేలా కనిపిస్తోంది' అన్నారు. చంద్రబోస్ మాట్లాడుతూ 'ఈశ్వర్ మంచి డ్యాన్సర్, మంచి గాయకుడు కూడా. అతనికి ఈ సినిమాతో మంచి గుర్తింపు రావాలి. భీమ్స్ మంచి బాణీలు అందించాడు. సురేష్ ఉపాధ్యాయ చక్కని సాహిత్యాన్నిచ్చాడు' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'టీజర్‌కు మంచి ఆదరణ లభిస్తోంది. దర్శకుడు రఘురాజ్‌ని నమ్మి ఈ సినిమా చేశాం. ఇంజినీరింగ్ విద్యార్థుల నేపథ్యంలో సినిమా సాగుతుంది. ఈశ్వర్ చాలా కష్టపడ్డాడు. చిత్రాన్ని ఫిబ్రవరి 8న విడుదల చేస్తున్నాం' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'సినిమాలో మంచి సందేశం వుంది. అందుకే ఈ చిత్రాన్ని ఇంజినీరింగ్ విద్యార్థులకు అంకితం చేస్తున్నాం. సరికొత్త పాయింట్‌తో సందేశాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మించాం. ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో కె. అచ్చిరెడ్డి, భీమ్స్, సురేష్ ఉపాధ్యాయ తదితరులు పాల్గొన్నారు.

జార్జి ఫెర్నాండెజ్ జీవితంతో..

ఇటీవల కన్నుమూసిన మాజీ రక్షణ శాఖ మంత్రి జార్జి ఫెర్నాండెజ్ జీవితాన్ని వెండితెరపై ఆవిష్కరించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు శివసేన ఎంపీ, నిర్మాత సంజయ్‌రౌత్ ప్రకటించారు. సంజయ్ రౌత్ మాట్లాడుతూ 'రాజకీయ సిద్ధాంతాల పరంగా బాల్ థాకరే, జార్జిఫెర్నాండెజ్ దారులు వేరైనా ఇద్దరి మధ్య వ్యక్తిగతంగా చక్కటి అనుబంధం ఉంది. వారి స్నేహాన్ని ఈ సినిమాలో చూపించబోతున్నాం. దేశంలో సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాటులో జార్జి ఫెర్నాండెజ్ పాత్రను వాస్తవిక కోణంలో సినిమాలో చూపించనున్నాం. 1950ల కాలంలో ముంబాయిలో ఉన్న రాజకీయ పరిణామాల్ని చర్చిస్తూ జార్జి ఫెర్నాండెజ్ బయోపిక్‌ను తెరకెక్కించే ఆలోచనలో ఉన్నాం' అని చెప్పారు. బాల్ థాకరే జీవితం ఆధారంగా రూపొందిన 'థాకరే' చిత్రం ఇటీవలే విడుదలైంది. ఈ చిత్రాన్ని వయాకామ్ 18 మోషన్ పిక్చర్స్, శ్రీకాంత్ భసీలతో కలిసి సంజయ్ రౌత్ ఈ చిత్రాన్ని నిర్మించారు.



అనసూయ

క్రైమ్ థ్రిల్లర్ కథనం!

అనసూయ, అవసరాల శ్రీనివాస్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'కథనం'. రాజేష్ నాదెండ్ల దర్శకుడు. మంత్రి ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీగాయత్రి ఫిల్మ్స్ పతాకంపై బి. నరేంద్రరెడ్డి, శర్మ చుక్కా సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పాటలు మినహా చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో అనసూయ మాట్లాడుతూ ' ఈ చిత్ర ఫస్ట్‌లుక్ విడుదలైన తరువాత 'క్షణం' సినిమా తరహాలో నేను పోలీస్ పాత్రలో కనిపిస్తున్నానని అంతా అనుకున్నారు. కానీ ఈ చిత్రంలో నేను అసిస్టెంట్ డైరెక్టర్‌గా నటిస్తున్నాను. రెండు పాటలు మినహా చిత్రీకరణ పూర్తయింది. కథను నమ్మి చేసిన సినిమా ఇది. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి చిత్రాన్ని వేసవిలో విడుదల చేస్తాం' అన్నారు. 'క్షణం, రంగస్థలం చిత్రాల తరువాత వస్తున్న మా సినిమాతో అనసూయ హ్యాట్రిక్ విజయాన్ని అందుకుంటుందనే నమ్మకం ఉంది' అని దర్శకుడు తెలిపారు.



లక్ష్మీరాయ్

వెంకటలక్ష్మి ఎక్కడుంది?

లక్ష్మీరాయ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'వేర్ ఈజ్ వెంకటలక్ష్మి'. కిషోర్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. రామ్‌కార్తిక్, పూజిత పొన్నాడ జంటగా నటిస్తున్నారు. ఎం. శ్రీధర్‌రెడ్డి, హెచ్.ఆనంద్‌రెడ్డి, ఆర్కే రెడ్డి నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాతలు మాట్లాడుతూ 'హారర్ కామెడీ చిత్రమిది. వెంకటలక్ష్మి ఎవరు? ఆమె గురించి సాగించిన అన్వేషణలో కొందరు యువతీయువకులు తెలుసుకున్న నిజాలేమిటన్నది ఆసక్తిని పంచుతుంది. లక్ష్మీరాయ్ పాత్ర చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. ఇటీవల విడుదల చేసిన 'పాపా నీకేదంటే ఇష్టం' అనే పాటకు చక్కటి స్పందన లభిస్తున్నది. ప్రవీణ్, మధునందన్ కామెడీ కడుపుబ్బా నవ్విస్తుంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల్ని జరుపుతున్నాం. మార్చిలో సినిమాను విడుదలచేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు. బ్రహ్మాజీ, పంకజ్‌కేసరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: వెంకట్ ఆర్ శాఖమూరి, సంగీతం: హరి గౌర.



వినాయక్, అనురాగ్

చినుకు నాకు చూపే..

అనురాగ్ కొణిదెన, శ్వేత అవస్తి, కైరవి తక్కర్ నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'మళ్లీ మళ్లీ చూశా'. సాయిదేవరామన్ దర్శకుడు. కొణిదెన కోటేశ్వరరావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని 'చినుకు నాకే చూపే చిన్నదాని రూపే' అనే గీతాన్ని దర్శకుడు వి.వి.వినాయక్ విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'చక్కటి సాహిత్యపు విలువలతో శ్రావ్యంగా ఈ గీతం ఉంది. ట్రైలర్ బాగుంది' అని తెలిపారు. చిత్ర దర్శకుడు మాట్లాడుతూ 'ప్రకృతితో ముడిపడిన అందమైన ప్రేమకథా చిత్రమిది. ఓ జంట ప్రేమను ప్రకృతి ఎలా విజయతీరాలకు చేర్చిందన్నది ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల్ని జరుపుతున్నాం' అని తెలిపారు. మళ్లీ మళ్లీ చూడాలనిపించే ఆహ్లాదభరితమైన చిత్రమిదని హీరో అనురాగ్ చెప్పారు. దర్శకుడు వి.వి.వినాయక్ మొదటి పాటను విడుదల చేయడం ఆనందంగా ఉందని చిత్ర ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సాయిసతీష్ పాలకుర్తి పేర్కొన్నారు. ఈటీవీ ప్రభాకర్, టీఎన్ఆర్, మిర్చి కిరణ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి శ్రవణ్ భరద్వాజ్, ఛాయాగ్రహణం: సతీష్ ముత్యాల.